

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 95

బుధవారం 26-6-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అఫ్'గన్' పేలింది

బంగ్లాదేశ్‌పై 8 పరుగుల తేడాతో అఫ్గాన్ విజయం.. సెమీఫైనల్లోకి ఎంట్రీ - 12లో



రూ.11వేల కోట్ల బిడ్లు

టెలికం స్పెక్ట్రమ్ మొదటిరోజు వేలానికి మంచి స్పందన - 13లో



న్యూస్‌రీల్

కేజ్రీవాల్‌కు మళ్లీ నిరాశే



మనీ లాండరింగ్ కేసులో బెయిల్ కోసం ఎదురుచూస్తున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మళ్లీ నిరాశే ఎదురయ్యింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కేజ్రీవాల్‌కు ఇచ్చిన రెగ్యులర్ బెయిల్‌పై విధించిన మధ్యంతర స్టే ఎత్తివేసేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది.

వివరాలు 6లో ▸

ఏపీ టెట్ ఫలితాలు విడుదల



టెట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం విడుదల చేశారు. టెట్–2024కు ఫిబ్రవరిలో ప్రభుత్వం నోటిఫికేషన్, పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. ఫలితాల్లో 1,37,903 మంది (58.4 శాతం) అర్హత సాధించారు.

వివరాలు 14లో ▸

కప్పం కడితేనే 'కింగ్ ఫిషర్'!



'మాకు లాభం ఉంటేనే లారీలు కదులుతాయి'.. 'మాకు కప్పం కడితేనే కింగ్ ఫిషర్ బీరు మార్కెట్‌లోకి వస్తుంది.. లేదంటే అంతే సంగతులు' అని పారిశ్రామికవేత్తలకు హెచ్చరికలు జారీ చేస్తోంది.. టీడీపీ కూటమి ముఠా. డీల్ సెట్ కాకపోతే కంపెనీలోకి ఒక్క లారీని రానివ్వం.. పోనివ్వం అని తెగేసి చెబుతోంది.

వివరాలు 14లో ▸

చరిత్ర సృష్టించిన 'చాంగ్‌యీ–6'



చైనా జాతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ సరికొత్త చరిత్ర సృష్టించింది. చందమామపై మనకు కనిపించని అవతలివైపు భాగం నుంచి మట్టి నమూనాలను విజయవంతంగా భూమిపైకి తీసుకొచ్చింది. చైనా ప్రయోగించిన లూనార్ ప్రోబ్ మాడ్యూల్ చాంగ్ యీ–6 జాబిల్లి నుంచి మట్టిని మోసుకొని ఇన్నర్ మంగోలియా ప్రాంతంలో దిగింది.

వివరాలు 6లో ▸

NECC Venkobb Chicken — సూచించిన నేటి గుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹72

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 132 | రిటైల్ లైవ్ బర్డ్ 154 | డ్రెస్డ్ స్కిన్‌తో 223 | స్కిన్‌లెస్ 254

ఇదండీ సంగతి



పేపర్ లీకయిందని ఇలా ఎత్తేసుకుంటూ పోతే ఇక ఏ పరీక్షలూ మిగలవ్ సార్!

ప్రజల గొంతును గుర్తించండి

స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ

ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించేందుకు వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలి

- చట్టబద్ధంగా గుర్తింపుతో హక్కులు, తగినంత సమయం లభిస్తాయి
- విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రతిపక్ష హోదా..
- చట్టంలో దీన్ని స్పష్టంగా నిర్వచించారు.. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10% సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదు
- నాడు ఉపేంద్ర, పీజేఆర్ విషయంలోనూ ఇదే జరిగింది
- మంత్రుల తర్వాత నాతో ప్రమాణం చేయించడం సంప్రదాయాలకు విరుద్ధం
- ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపు ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించారా?
- శాసనసభలో మేం గొంతు విప్పే అవకాశాలు కనిపించడం లేదు



అంతరంగం అప్పుడే అర్థమైంది..

ఈ నెల 21న అసెంబ్లీలో జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణం కార్యక్రమాన్ని పరిశీలిస్తే నాకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వరనే అభిప్రాయం కలిగింది. అసెంబ్లీ సంప్రదాయాల ప్రకారం ముందుగా సభా నాయకుడు, తర్వాత ప్రతిపక్ష నాయకుడు, అనంతరం మంత్రులు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా అలా జరగలేదు. సంప్రదాయాలకు విరుద్ధంగా మంత్రుల తర్వాతే నాతో ప్రమాణం చేయించారు. నాకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకూడదనే నిర్ణయాన్ని మీరు ముందుగానే తీసుకున్నట్లు కనిపిస్తోంది.

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ప్రతిపక్ష హోదా ఉండాల్సిందేనని, ఈ విషయంలో పరిశీలన చేయాలని కోరుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుందన్నారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు సాధించాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. విపక్ష పార్టీల్లో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని పేర్కొన్నారు. శాసనసభలో కూటమి పార్టీల

మిగతా 2వ పేజీలో ▶



ఓం బిర్లా X కె.సురేశ్

2లో

- డిప్యూటీ స్పీకర్ ఇస్తే పోటీపెట్టబోమన్న ఇండియా కూటమి
- హామీ ఇవ్వని బీజేపీ.. కుదరని ఏకాభిప్రాయం
- దళిత నేత సురేశ్‌ను పోటీకి దింపిన ఇండియా కూటమి

లోక్‌సభ స్పీకర్ పదవికి పోటీ

ఓం బిర్లా అభ్యర్థిత్వానికి వైఎస్సార్‌సీపీ మద్దతు


2లో

కాంగ్రెస్–టీడీపీ లాలూచీ రాజకీయాలకు వ్యతిరేకమని స్పష్టీకరణ

ఏపీలో ఆ చానళ్ల ప్రసారాలు వెంటనే పునరుద్ధరించండి

'సాక్షి' సహా పలు చానళ్ల ప్రసారాలు నిలిపివేతపై కేబుల్ ఆపరేటర్లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం 2లో

ఏపీలో నిలిపివేసిన చానళ్ల ప్రసారాలను తక్షణమే పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 6 నుంచి సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ ప్రసారాలను నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ మిని పుష్కర్ణ మంగళవారం విచారించారు. ఆయా చానళ్లను పునరుద్ధరించాలని కేబుల్ ఆపరేటర్లను ఆదేశించారు.



మా ఆస్తులనే అమ్ముకుంటున్నాం

- హైకోర్టుకు విశాఖ ఉక్కు యాజమాన్యం నివేదన.. ఇప్పటికే బిడ్డర్లు కొంత మొత్తం చెల్లించారు
- స్టేటస్ కో వల్ల విక్రయాల ప్రక్రియ ఆగిపోయింది.. ఉత్తర్వులు సవరించాలని అభ్యర్థన
- కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లు, కేంద్రానికి కోర్టు ఆదేశం
- విచారణ వచ్చే వారానికి వాయిదా
- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మడం లేదు
- మా పెట్టుబడులను మాత్రమే ఉపసంహరిస్తున్నామన్న కేంద్రం

10లో

'పెట్టుబడి' గండం!

అప్పు పుట్టక.. సర్కారు సాయం కోసం రైతన్న ఎదురు చూపులు

- ఏటా రూ.20 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో కూటమి హామీ.. రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా మార్చడం మినహా సాయం ఏదీ?
- అన్నదాతకు తొలి విడత సాయం ఎప్పుడిస్తారో చెప్పలేని దుస్థితి.. సాగు ఖర్చుల కోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ రైతన్నల ప్రదక్షిణలు
- నాడు హామీ కంటే మిన్నగా పెట్టుబడి సాయం అందించిన జగన్.. ఏటా సగటున 51.50 లక్షల మందికి రూ.13,500 చొప్పున సాయం జమ
- భూ యజమానులతో పాటు అటవీ, దేవదాయ, కౌలు రైతులకూ సాయం

2లో





జగన్ వ్యక్తిత్వ హననమే లక్ష్యం

- చంద్రబాబు, లోకేశ్ ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు నడుపుతున్నారు.. జగన్ భద్రతపై అసత్య కథనాలు ప్రచురిస్తున్నారు
- ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇదంతా
- బాబుతోపాటు లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్, భువనేశ్వరికి భద్రత ఇవ్వలేదా?
- హైదరాబాద్‌లోని బాబు ఇంటిలో ఏమున్నాయో ఫొటోలు విడుదల చేయగలరా?
- మీడియాకు ఆ ఇంటిని చూపించగలరా?
- ఉండవల్లిలో కరకట్ట ఇంటికి రూ.వందల కోట్లు ఖర్చు చేయలేదా?
- వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని ధ్వజం



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రతపై టీడీపీ అనుకూల మీడియా అసత్య కథనాలు ప్రచురిస్తోందని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేశ్ ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు నడుపుతున్నారని ధ్వజమెత్తారు. జగన్ వ్యక్తిత్వ హననమే లక్ష్యంగా నిత్యం విష ప్రచారాలు

మిగతా 2వ పేజీలో ▶

అప్పులు మొదలు

రూ.2,000 కోట్లతో చంద్రబాబు ప్రభుత్వం బోణి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రూ.2,000 కోట్లు అప్పు చేసింది. రూ.1,000 కోట్లను 11 ఏళ్ల కాల వ్యవధితో 7.34% వడ్డీకి అప్పు చేసింది. మరో రూ.1,000 కోట్లను 20 ఏళ్ల కాలవ్యవధితో 7.31% వడ్డీకి అప్పు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలకు ఆర్‌బీఐ వేలం నిర్వహించడం ద్వారా ఈ రూ.2,000 కోట్ల అప్పును సమీకరించింది.

క్లుప్తంగా...

రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్

- 2వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 5వ తేదీ ఉపసంహరణకు తుది గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎమ్మెల్యేల ద్వారా ఎన్నిక జరిగే రెండు ఎమ్మెల్సీ స్థానాల పోలింగ్‌కు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. వచ్చే నెల 2వ తేదీతో నామినేషన్ల స్వీకరణకు తుది గడువు కాగా జూలై 3వ తేదీన పరిశీలిస్తారు. ఉపసంహరణకు జూలై 5వ తేదీ తుది గడువు. అవసరమైన పక్షంలో జూలై 12వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎమ్మెల్సీలు సి.రామచంద్రయ్య, ఇక్బాల్‌పై అనర్హత వేటుపడటంతో ఖాళీ అయిన రెండుస్థానాలకు ఎన్నిక నిర్వహిస్తున్నారు.

సీఎస్‌కు జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ నోటీసు

విశాఖ సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ మంగళవారం నోటీసు జారీ చేసింది. షెడ్యూల్డ్ కులాలకు పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించలేదని విశాఖ న్యాయవాది వి.రమేష్ చంద్ర వర్మ ఈ నెల 8వ తేదీన కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషన్ స్పందించింది. ఈ అంశంలో తీసుకున్న చర్యలు, అసలు వాస్తవాలతో నివేదికను 15 రోజుల్లోగా కమిషన్‌కు పోస్టు ద్వారా గానీ, స్వయంగా గానీ అందించాలని ఆదేశించింది. నిర్ణీత సమయంలో నివేదిక అందించని పక్షంలో ఆర్టికల్ 338 ప్రకారం సమన్లు జారీ చేస్తామని, కమిషన్ ముందు హాజరుకావాల్సి ఉంటుందని నోటీసులో హెచ్చరించింది.

నేడు ఇంటర్ మొదటి ఏడాది సప్లిమెంటరీ ఫలితాలు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను బుధవారం విడుదల చేయనున్నారు. ఈనెల 18న రెండో ఏడాది ఫలితాలను ప్రకటించిన ఇంటర్ విద్యా మండలి, బుధవారం మొదటి ఏడాది ఫలితాలను వెల్లడించనున్నారు.

ఓం బిర్లా అభ్యర్థిత్వానికి వైఎస్సార్‌సీపీ మద్దతు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థి ఓం బిర్లాకు వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. బుధవారం జరిగే స్పీకర్ ఎన్నికలో ఓం బిర్లాకు మద్దతివ్వాలని ఎన్డీఏ అగ్ర నేతలు వైఎస్సార్‌సీపీ అధినాయకత్వాన్ని కోరారని పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని లాంఛనంగా జరిగే సభాపతి ఎన్నికలో ఓం బిర్లాకు మద్దతివ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. అంతేగాక లాలూచీ రాజకీయాలకు వైఎస్సార్‌సీపీ పూర్తి వ్యతిరేకమని, అందువల్లే ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతివ్వట్లేదని తెలిపారు. ఎన్డీఏ కూటమిలో భాగంగా బీజేపీతో కలిసి పోటీ చేసిన టీడీపీ స్పీకర్ పదవి కోసం పట్టుబడితే.. టీడీపీ అభ్యర్థికి మద్దతిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇటీవల లాలూచీ రాజకీయాలకు తెరలేపిందని, అందువల్లే ఓం బిర్లాకు మద్దతివ్వాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిందని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

‘పెట్టుబడి’ గండం!



సాక్షి, అమరావతి: జోరందుకున్న వర్షాలతో ఖరీఫ్ సాగు ఊపందుకుంటోంది. ఈ సమయంలో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనుల కోసం రైతన్నలకు పెట్టుబడి ఖర్చులు చాలా కీలకం. సకాలంలో సాయం చేతికందితే వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇదే దృక్పథంతో గత ఐదేళ్లు మే/జూన్‌లో తొలి విడత పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం అందించింది. తాము అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందచేస్తామని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు ఆ ఊసే పట్టనట్లు వ్యవహరించడంపై అన్నదాతల్లో ఆందోళన రేగుతోంది. కూటమి సర్కారు పగ్గాలు చేపట్టిన వెంటనే రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చడం మినహా డబ్బులు విడుదల చేయలేదు. ప్రమాణ స్వీకారం రోజు చంద్రబాబు తొలి ఐదు సంతకాల్లో పెట్టుబడి సాయం పెంపు ఉంటుందని ఆశించిన రైతన్నలు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆ తర్వాత కేబినెట్ భేటీలో అయినా చర్చిస్తారనుకున్నారు. చివరకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం జరిపిన తొలి సమీక్షలో మాట వరసకైనా ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. దీంతో ఏటా సీజన్‌కు ముందుగానే చేతికి అందే తొలి విడత పెట్టుబడి సాయం డబ్బులు ఎప్పుడిస్తారో అంతుబట్టక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీ కంటే మిన్నగా..

ఇచ్చిన హామీ కంటే మిన్నగా ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించి వైఎస్ జగన్ ప్రభుత్వం రైతన్నలకు అండగా నిలిచింది. ప్రతి రైతు కుటుంబానికి పీఎం కిసాన్‌తో కలిపి ఏటా మే/ జూన్‌లో రూ.7,500, అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో 2 వేలు చొప్పున క్రమం తప్పకుండా జమ చేశారు. ఏటా సగటున 51.50 లక్షల మందికి ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ పథకం కింద రూ.34,288.17 కోట్లు జమ చేసి తోడుగా నిలిచారు. పీఎం కిసాన్ పరిధిలోకి రాని నాన్ వెబ్‌ల్యాండ్ భూ యజమానులతో పాటు వారసత్వంగా భూములు పొందినవారు, ఎక్వైర్డ్ ల్యాండ్ సాగుదారులతో సహా అటవీ, దేవదాయ భూసాగుదారులకే కాకుండా సెంటు భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలుదారులకు ఈ ఐదేళ్లు వైఎస్ జగన్ ప్రభుత్వమే సొంతంగా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం జమ చేసింది.

మళ్లీ వడ్డీ వ్యాపారుల చుట్టూ..

ప్రతీ రైతుకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి నేతలు సూపర్‌సిక్స్‌లో హామీ ఇచ్చారు. పీఎం కిసాన్‌తో కలిసి రైతు భరోసా సాయాన్ని అందించినప్పుడు గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు తామిచ్చిన హామీ మేరకు రూ.20 వేలు సొంతంగా ఇస్తారా? లేక పీఎం కిసాన్‌తో కలిపి ఇస్తారా? అన్నది స్పష్టత ఇవ్వడం లేదు. పైగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు నెల రోజులవుతోంది. గతంలో సీజన్‌కు ముందుగానే తొలివిడత సాయం రైతులకు చేతికొచ్చేది. ఈ సొమ్ములు ఖరీఫ్‌లో విత్తనాల కొనుగోలు, దుక్కులు, నారుమడులు, నాట్లు వేసుకునేందుకు ఉపయోగపడేవి. ఈసారి మాత్రం తొలి విడత పెట్టుబడి సాయం ఎప్పుడు చేతికి వస్తుంది? ఎంత వస్తుంది? అనే సంగతి తేలకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదునులో పెట్టుబడి సాయం చేతికి రాకపోవడంతో రైతులు మళ్లీ అప్పుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, దళారీల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మోదీ తొలి సంతకం పీఎం కిసాన్‌పైనే..

కేంద్రంలో మూడోసారి పగ్గాలు చేపట్టిన ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేసిన రోజే పీఎం కిసాన్ సాయంపై తొలి సంతకం చేసి రైతుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. 2018–19 నుంచి ఏటా మూడు విడతల్లో కేంద్రం ఈ సాయం అందిస్తోంది. ఇప్పటివరకు 16 విడతల్లో రాష్ట్రంలోని అర్హులైన రైతులకు రూ.14,717 కోట్లు జమ చేసింది. ఈ నెల 18న ఉత్తరప్రదేశ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ బటన్ నొక్కి పీఎం కిసాన్ తొలి విడత సాయాన్ని జమ చేశారు. 2024–25 సీజన్‌లో రాష్ట్రంలో తొలి విడత సాయం కోసం 40.91 లక్షల మంది అర్హత పొందగా వీరికి రూ.824.61 కోట్లు పెట్టుబడి సాయం జమ చేశారు.

అన్నదాతా అంటూ నాడు మోసం

తాము అధికారంలోకి రాగానే వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేలు పెట్టుబడి సాయంగా అందిస్తామని 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. దీంతో 2019 ఎన్నికలకు నాలుగు నెలల ముందు అన్నదాత సుఖీభవ అంటూ చంద్రబాబు హడావుడిగా ఓ పథకాన్ని తెరపైకి తెచ్చారు. ఆగమేఘాల మీద జీవో 28 జారీ చేశారు. ఆ జీవో ప్రకారం 2 హెక్టార్లలోపు సన్న, చిన్నకారు రైతులకు ఏటా రూ.15 వేలు, రెండు హెక్టార్లకు పైబడిన వారికి రూ.10 వేలు, కౌలురైతులు, అటవీ, దేవదాయ భూసాగుదారులకు రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ లెక్కన రూ.9,225 కోట్లు జమ చేయాల్సి ఉండగా.. రెండు విడతల్లో 43.26 లక్షల మందికి రూ.4 వేల చొప్పున రూ.2,440.29 కోట్లు మాత్రమే జమ చేశారు. ఈ మొత్తంలో పీఎం కిసాన్ కింద కేంద్రం అందించింది రూ.675 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.1,765.29 కోట్లు జమ చేసిన విషయాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

అప్పులు చేయక తప్పదు



గత ఐదేళ్లుగా ఖరీఫ్ సీజన్‌కు ముందే మే నెలలోనే పెట్టుబడి సాయం అందేది. దీంతో అప్పుల కోసం వ్యాపారులపై ఆధారపడాల్సిన అగత్యం ఉండేది కాదు. ఈ సొమ్ములు దుక్కి దున్నుకోవడం, నారు మళ్లు పోసుకోవటానికి ఎంతగానో ఉపయోగపడేవి. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రూ.20 వేలు పెట్టుబడి సాయం చేస్తామన్నారు. ఎప్పుడు జమ చేస్తారో ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదు. ఈసారి పెట్టుబడుల కోసం అప్పులు చేయక తప్పని పరిస్థితి నెలకొంది.
–కె.ధనుంజయరావు, సింగుపాలెం, బాపట్ల జిల్లా

వెంటనే జమ చేయాలి




ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం చేస్తామని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చారు. అదును దాటి పోకుండా జమ చేస్తే రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో ఐదేళ్ల సీజన్‌కు ముందుగానే సాయం అందించారు. కూటమి ప్రభుత్వం కూడా అదే రీతిలో వెంటనే పెట్టుబడి సాయం జమ చేయాలి.
–కె.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

పెట్టుబడి కోసం ఇబ్బందులు



పదేళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. 6 ఎకరాల్లో చీని, 4 ఎకరాల్లో టమోటా, 3 ఎకరాల్లో ఆముదం, కంది, 5 ఎకరాల్లో అరటి, 6 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నా. గత ఐదేళ్లు క్రమం తప్పకుండా సీజన్‌కు ముందుగానే పెట్టుబడి సాయం అందింది. ఈసారి ప్రభుత్వం పెట్టుబడి సాయం సకాలంలో ఇవ్వకపోవడంతో పంట సాగుకు ఇబ్బందిపడుతున్నా.
–హనుమంతరాయుడు, కదిరిదేవరపల్లి, అనంతపురం జిల్లా

ప్రతి కౌలు రైతుకూ ఇవ్వాలి



సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా ప్రతీ రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలి. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా ప్రతి కౌలు రైతుకూ సాయం జమ చేయాలి. భూ యజమానులకు రుణాలిస్తారు. కౌలు రైతులకు రుణాలు దక్కడం లేదు. వారికి ఎలాంటి సంక్షేమ ఫలాలు అందడం లేదు. కనీసం పెట్టుబడి సాయమైనా జమ చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. –పి.జమలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ కౌలురైతు సంఘం

ప్రజల గొంతును గుర్తించండి

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్దేశపూర్వక చర్యలను సైతం లేఖలో ప్రస్తావించారు. వైఎస్ జగన్ లేఖలో ముఖ్యాంశాలు ఇవీ..

శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు..

మంత్రుల తర్వాత నాతో ప్రమాణం చేయించడం సంప్రదాయాలకు పూర్తి విరుద్ధం. ప్రధాన ప్రతిపక్ష నాయకుడి గుర్తింపు ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించినట్లు దీనిద్వారా కనిపిస్తోంది. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే పది శాతం సీట్లు సాధించి ఉండాలని చట్టంలో ఎక్కడా లేదు. పార్లమెంట్‌లోగానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ ఈ నిబంధన పాటించలేదు. అధికార కూటమి, స్పీకర్ ఇప్పటికే నాపట్ల శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ చేసిన వ్యాఖ్యలు వీడియోల ద్వారా బయటపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో అసెంబ్లీలో గొంతు విప్పే అవకాశాలు కనిపించడం లేదు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతోనే ప్రజా సమస్యలను బలంగా వినిపించే ఆస్కారం ఉంటుంది. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని నా లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

చట్టంలో స్పష్టంగా ఉంది..

ప్రధాన ప్రతిపక్ష పార్టీ, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అంటే ఎవరనే విషయాన్ని చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్క్వాలిఫికేషన్ యాక్ట్ 1953 చట్టం 12 ఆ' ప్రధాన ప్రతిపక్ష పార్టీ అంటే ఎవరనే విషయాన్ని స్పష్టంగా నిర్వచించింది. విపక్షంలో ఉన్న పార్టీల్లో ఎవరికి ఎక్కువ సంఖ్యా బలం ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టం చెబుతుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకుని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందున విపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. కానీ జూన్ 21న జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చూస్తే వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం, పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా నన్ను ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించడంలో మీ ఉద్దేశాలేమిటో బయటపడ్డాయి. కానీ చట్టాన్ని పరిశీలిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడంలోగానీ, పార్టీ శాసనసభా పక్షనేత అయిన నన్ను ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించేందుకుగానీ ఎలాంటి సందిగ్ధతకు తావులేదు. ఇటీవల స్పీకర్ చేసిన వ్యాఖ్యలు యూట్యూబ్ ఛానళ్లలో ఉన్నాయి. ఓడిపోయాడుగానీ చావలేదు.. చచ్చేవరకూ కొట్టాలి..! అంటూ నన్ను ఉద్దేశించి గౌరవ స్పీకర్ అన్న మాటలు ఆ వీడియోల్లో ఉన్నాయి. తద్వారా నాపై ఉన్న శత్రుత్వాన్ని స్పీకర్ రూపంలో అధికార కూటమి వ్యక్తం చేసింది.

వైఎస్సార్ సీపీ 40% ఓట్లను సాధించింది

ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 40 శాతం ఓట్లను సాధించింది. ప్రజా సంబంధిత అంశాలపై అసెంబ్లీలో ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహించాల్సిన బాధ్యత మాపై ఉంది. అయితే ప్రభుత్వం, స్పీకర్ శత్రుత్వ వైఖరిని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో మా పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీ కార్యకలాపాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కట్టడి చేస్తున్నట్లే అవుతుంది. వైఎస్సార్ సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం వల్ల అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడికి తగిన సమయం లభిస్తుంది. దీనివల్ల ప్రజా సంబంధిత అంశాలను సభ దృష్టికి బలంగా తేగలుగుతారు. సభా కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొనేలా, ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్ష పార్టీగా అభిప్రాయాలను చెప్పేలా చట్టబద్ధమైన భాగస్వామ్యం ప్రధాన ప్రతిపక్ష పార్టీకి లభిస్తుంది. ఇలాంటి పరిస్థితి లేకపోతే అసెంబ్లీలో అధికార కూటమి గొంతు మాత్రమే వినిపిస్తుంది. వివిధ అంశాల్లో బలమైన చర్చలు జరిగే అవకాశం కనిపించదు.

3 సీట్లు వచ్చిన బీజేపీకి సైతం..

2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగానూ బీజేపీ కేవలం 3 సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చారు. ఈ అంశాలన్నీ కూడా కేవలం ప్రజా ప్రయోజనాల రీత్యా మీ దృష్టికి తెస్తున్నా. ప్రజల తరఫున అసెంబ్లీలో గొంతు విప్పడానికి తగిన సమయం లభించాలనే ఉద్దేశంతో మీకు ఈ లేఖ రాస్తున్నా. అయితే ఇలాంటి పరిస్థితికి ఆస్కారం లేకుండా అధికార కూటమి ఇప్పటికే శత్రుత్వాన్ని ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో నేను సభలో మాట్లాడాలనుకుంటే అది భారీ మెజార్టీ సాధించిన అధికార కూటమి దయమీద, నన్ను చచ్చేవరకూ కొట్టాలన్న స్పీకర్ గారి విచక్షణ మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సభలో ఉన్న పార్టీల సంఖ్యా బలాలను దృష్టిలో ఉంచుకుని ఈ లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

ఉపేంద్ర, పీజేఆర్‌ను ప్రధాన ప్రతిపక్ష నేతలుగా గుర్తించారు..

అసెంబ్లీలో 10 శాతం సీట్లు రానందున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్షానికి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించదనే చర్చ జరుగుతోంది. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 208 కింద ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నోటిఫై చేసిన సభా ప్రవర్తనా నియమావళిలో నిర్దిష్ట సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలనే విషయాన్ని ఎక్కడా చెప్పలేదనే విషయాన్ని మీ ముందుకు తెస్తున్నా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎక్కడా ఈ నిబంధన పాటించలేదనే అంశాన్ని గుర్తు చేస్తున్నా. లోక్‌సభకు 1984లో 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 30 ఎంపీ సీట్లను గెలుచుకుంది. సభలో 10 శాతం సీట్లు సాధించనప్పటికీ నాడు టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రను ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు. 1994 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకుగానూ కాంగ్రెస్ 26 సీట్లు మాత్రమే సాధించింది. 10 శాతం సీట్లు కాంగ్రెస్‌కు దక్కనప్పటికీ పి.జనార్ధనరెడ్డిని నాడు ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు.

ఏపీలో ఆ చానళ్ల ప్రసారాలు వెంటనే పునరుద్ధరించండి

'సాక్షి' సహా పలు చానళ్ల ప్రసారాలు నిలిపివేతపై కేబుల్ ఆపరేటర్లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో నిలిపివేసిన చానళ్ల ప్రసారాలను తక్షణమే పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 6 నుంచి ఏపీలో సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ ప్రసారాలను నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ మిని పుష్కర్ణ మంగళవారం విచారించారు. ఆయా చానళ్లను పునరుద్ధరించాలని కేబుల్ ఆపరేటర్లను ఆదేశించారు. లిఖితపూర్వక ఆదేశాలు ఇంకా వెబ్‌సైట్‌లో పొందుపరచాల్సి ఉంది. ఢిల్లీ హైకోర్టు నిర్ణయంపై న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ ఫెడరేషన్ (ఎన్‌బీఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఏపీలో ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా తీసుకొన్న నిర్ణయంపై కొరడా లాంటి ఆదేశాలుగా అభివర్ణించింది. 'ప్రజాస్వామ్య పనితీరుకు అవసరమైన బహిరంగ, పారదర్శక మీడియా వాతావరణాన్ని నిర్వహించే ప్రాముఖ్యతను హైకోర్టు జోక్యం నొక్కి చెబుతోంది. ఈ తీర్పు పత్రికా స్వేచ్ఛను సమర్థించడం, జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడంపై ఓ ఉదాహరణగా నిలుస్తుంది' అని మంగళవారం ఎన్‌బీఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది.

ఓం బిర్లా X కె.సురేశ్

న్యూఢిల్లీ: పద్దెనిమిదో లోక్‌సభ స్పీకర్ పదవికి అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఫలితంగా పోటీ అనివార్యమైంది. కీలక నేతలను పాత పదవుల్లో కొనసాగిస్తున్న మోదీ 3.0 సర్కారు దానికి అనుగుణంగానే ఎన్డీఏ అభ్యర్థిగా ఓం బిర్లాను మంగళవారం స్పీకర్ బరిలో నిలిపింది. ఓం బిర్లా 17వ లోక్‌సభలో ఐదేళ్లు స్పీకర్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. విపక్ష ఇండియా కూటమి ఆఖరి నిమిషంలో.. కాంగ్రెస్ ఎంపీ కొడికున్నిల్ సురేశ్‌ను రంగంలోకి దింపింది. పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరించి విపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తే.. ఓం బిర్లాకు మద్దతు ఇస్తామని ఇండియా కూటమి షరతు పెట్టింది. అయితే బీజేపీ సీనియర్ నేతలు దీనిపై ఎలాంటి హామీని ఇవ్వలేదు. స్పీకర్ ఎన్నిక తర్వాత డిప్యూటీ స్పీకర్ ఎంపిక ఉంటుందని, ఆ సందర్భం వచ్చినపుడు చూద్దామని బీజేపీ పేర్కొంది. దీనికి ఇండియా కూటమి నేతలు సమ్మతించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి కేటాయిస్తామని హామీ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. ఎన్డీఏ అభ్యర్థిగా ఓం బిర్లా పేరు ఖరారయ్యాక కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్.. చొరవ తీసుకొని విపక్షాలను సంప్రదించారు. రాజ్‌నాథ్ ఆఫీసులో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షాలతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, డీఎంకే నేత టి.ఆర్.బాలు మంగళవారం సమావేశమయ్యారు. ఇరుపక్షాలు తమ తమ వాదనలకే కట్టుబడి ఉండటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. కొద్దిసేపట్లోనే ఈ భేటీ ముగిసింది. వేణుగోపాల్, బాలు అర్ధంతరంగా సమావేశం నుంచి బయటికి వచ్చేశారు. మూడుసార్లు ఎంపీ అయిన ఓం బిర్లా రాజస్తాన్‌లోని కోటాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఓం బిర్లా తరఫున 10కి పైగా నామినేషన్లు దాఖలైనట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డాలతో పాటు, టీడీపీ, జేడీయూ, జేడీఎస్, ఎల్జేపీ (ఆర్) పార్టీలు ఓం బిర్లా తరఫున నామినేషన్‌లు దాఖలు చేశాయి. కేరళ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న దళిత ఎంపీ కే.సురేశ్ ఎనిమిదోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. సురేష్ తరఫున మూడుసెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.

మూడోసారి పోటీ

స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగుతుంది. ఒకవేళ పోటీ అనివార్యమైతే.. లోక్‌సభ చరిత్రలో స్పీకర్ పదవికి పోటీ జరగడం ఇది మూడోసారి అవుతుంది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో 1952, 1967, 1976లలో మాత్రమే స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. 1952లో కాంగ్రెస్ అభ్యర్థి జి.వి.మౌలాంకర్ 394 ఓట్లు సాధించి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి శాంతారాం మోరేకు కేవలం 55 ఓట్లు మాత్రమే వచ్చాయి. 1967లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం సంజీవరెడ్డితో తెన్నేటి విశ్వనాథం పోటీపడ్డారు. సంజీవరెడ్డికి 278 ఓట్లు రాగా, విశ్వనాథంకు 207 ఓట్లు పడ్డాయి. 1976లో జరిగిన ఎన్నిక పూర్తిస్థాయి స్పీకర్ పదవికి కాదు. 1975లో ఇందిరాగాంధీ దేశంలో అత్యయిక పరిస్థితిని విధించారు. ఐదో లోక్‌సభ ఐదో సెషన్‌ను ఏడాది పాటు పొడిగించారు. అప్పటి స్పీకర్ జి.ఎస్.ధిల్లాన్ రాజీనామా చేయడంతో.. జనవరి 5, 1976న పొడిగించిన ఏడాది కాలానికి స్పీకర్ ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ నాయకుడు బలిరామ్ భగత్‌ను స్పీకర్ పదవికి ఇందిరా గాంధీ ప్రతిపాదించారు. జనసంఘ్ నాయకుడు జగన్నాథరావు జోషి బరిలో నిలువడంతో ఎన్నిక జరిగింది. బలిరామ్ భగత్‌కు 344 ఓట్లు రాగా, జోషికి 58 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం 18వ లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యులు ఉండగా, ఇండియా కూటమికి 233 (రాహుల్ గాంధీ వయనాడ్‌కు రాజీనామా చేయడంతో విపక్షాల బలం ఒకటి తగ్గింది) ఎంపీలున్నారు. అంతేకాకుండా ఇండియా కూటమికి ముగ్గురు స్వతంత్ర ఎంపీల మద్దతుంది. సంఖ్యా బలాన్ని బట్టి చూస్తే ఓం బిర్లా స్పీకర్‌గా ఎన్నిక కావడం లాంఛనమే. బుధవారం ఓటింగ్ జరిగితే.. పేపర్ స్లిప్పులనే వాడనున్నారు. నూతన సభ్యులు ఎవరెక్కడ కూర్చోవాలో నిర్ణయించే సీట్ల కేటాయింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. కాబట్టి ఎలక్ట్రానిక్ ఓటింగ్ వ్యవస్థ సిద్ధంగా లేదు. ఓం బిర్లా స్పీకర్‌గా ఎన్నికైతే.. రెండు పర్యాయాలు స్పీకర్‌గా పనిచేసిన ఐదోవ్యక్తి అవుతారు. కాకపోతే గతంలో కాంగ్రెస్ నేత బలరాం జాఖడ్ ఒక్కరు మాత్రమే రెండుసార్లు (ఏడు, ఎనిమిదో లోక్‌సభల్లో) స్పీకర్‌గా పూర్తి పదవీకాలాన్ని పూర్తిచేశారు.

సంప్రదాయాన్ని పాటించడం లేదు: వేణుగోపాల్

విపక్షాలకు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇచ్చే సంప్రదాయాన్ని ప్రభుత్వం పాటించడం లేదని వేణుగోపాల్ ఆరోపించారు. ఓం బిర్లాపై తమ అభ్యర్థిని పోటీకి నిలుపుతామని ప్రకటించారు. విపక్షం ఒత్తిడి రాజకీయాలకు దిగుతోందని, షరతులు పెడుతోందని కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, లలన్ సింగ్ (జేడీయూ)లు అన్నారు. డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకునే సమయం వచ్చినపుడు విపక్షాల డిమాండ్‌ను పరిశీలిస్తామని సీనియర్ మంత్రులు హామీ ఇచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యం షరతులపై నడవదని పీయూష్ గోయల్ అన్నారు. ఇండియా కూటమిలోని మిగతా పార్టీలు పోటీకి అంత సుముఖంగా లేనప్పటికీ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందని బీజేపీ వర్గాలు తెలిపాయి.

అది మా హక్కు: సురేశ్

'గెలుస్తామా, ఓడుతామా అన్నది ముఖ్యం కాదు. అధికారపక్షం నుంచి స్పీకర్ ఉంటే డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు ఇవ్వాలనేది సంప్రదాయం. గత రెండు లోక్‌సభల్లో మాకు ప్రతిపక్ష హోదా లేదని డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వడానికి నిరాకరించారు. ఇప్పుడు మేము గుర్తింపు పొందిన ప్రతిపక్షం. డిప్యూటీ స్పీకర్ పదవి మా హక్కు. కానీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. మంగళవారం 11:50 గంటల దాకా ప్రభుత్వం నుంచి స్పందన కోసం ఎదురుచూశాం. ఎలాంటి సమాధానం రాలేదు' అని కే.సురేష్ అన్నారు.

జగన్ వ్యక్తిత్వ హననమే లక్ష్యం

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారని నిప్పులు చెరిగారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల నుంచి వారి దృష్టి మళ్లించేందుకే జగన్ భద్రతపై రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన సతీమణి భువనేశ్వరి, నారా లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్‌లకు భద్రత కల్పించలేదా అని నిలదీశారు. లోకేశ్ కుమారుడు దేవాన్ష్‌కు సైతం 4+4తో భద్రత కల్పించారని గుర్తు చేశారు. భద్రత గురించి కాబట్టే.. అప్పుడు ఎవరూ ప్రశ్నించలేదన్నారు. మరి ఇప్పుడు జగన్ భద్రతపై ఎందుకు ఇంత విషప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు ఎంతమందితో భద్రత కల్పిస్తున్నారో బయటపెట్టే దమ్ముందా అని రామోజీ కుమారుడు కిరణ్‌ని నిలదీశారు. జగన్‌కు మొత్తం 196 మందితో మాత్రమే భద్రత కల్పిస్తుంటే 986 మంది అని ఎలా రాస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, మాజీగా ఉన్నప్పుడు ఎంత మంది సెక్యూరిటీ ఉన్నారో.. వారి జీతాలు ఎంతో బయటపెట్టాలని సవాల్ విసిరారు. సుమారు 1,800 నుంచి 2,000 మందిని భద్రతకు సెక్యూరిటీని నియమించుకోలేదా? అని నిలదీశారు. జగన్ ఉంటున్న తాడేపల్లి నివాసంపైనా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్‌లో చంద్రబాబు నివాసంలో ఏమున్నాయో ఫొటోలు విడుదల చేయగలరా అని ప్రశ్నించారు. తాడేపల్లిలోని జగన్ ఇంటిలో, హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ఏమున్నాయో నిపుణుడితో ఖరీదు కట్టిద్దామా అని సవాల్ విసిరారు. మీడియాకు జూబ్లీహిల్స్ ఇంటిని చూపించగల దమ్ము చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే..

జగన్ నివాసంపైనా తప్పుడు ప్రచారాలేనా?

ఓటుకు కోట్లు కేసులో ఇరుక్కుని చంద్రబాబు హైదరాబాద్ నుంచి పారిపోయి విజయవాడ వచ్చారు. కరకట్ట ఇంటికోసం రోడ్లు, హెలీప్యాడ్, టవర్ల రూపేణా వందల కోట్లు ఖర్చు చేశారు. పార్టీ ఆఫీసులకు స్థలాలు ఇవ్వాలని జీవో ఇచ్చింది కూడా చంద్రబాబే. 33 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వాల్సి ఉండగా 99 ఏళ్లకు లీజు పెంచుకున్నారు. టీడీపీ కట్టుకున్న ఆఫీసులు.. పూరిపాకలు, గుడిసెలు కాదు. మీలా ప్రభుత్వ కాంట్రాక్టులు ఇచ్చుకున్న వారితో మేం ఆఫీసులు కట్టించుకోలేదు.. పార్టీ డబ్బుతో కట్టుకుంటున్నాం. టీడీపీ ద్వంద్వ ప్రమాణాలను రామోజీరావు కుమారుడు కిరణ్ తన పత్రికలో రాయగలరా? జగన్ బెంగళూరు వెళ్తే.. కాంగ్రెస్‌లో విలీనం చేస్తారని ఫేక్ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్‌కు ఎదురొడ్డి ధైర్యంగా రాజకీయాలు చేసిన వ్యక్తి జగన్. భయపడటం ఆయనకు తెలియదు. చంద్రబాబు, సోనియాగాంధీ చీకట్లో కలుసుకుని 16 నెలలు జైల్లో పెడితే ఏమైనా తగ్గారా? ఓడిపోతే తగ్గుతారా? జగన్ మళ్లీ ఎన్నికల్లో గెలిచే వరకు తాడేపల్లిలోనే ఉండి రాజకీయాలు చేస్తారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి.

ఇంత దుర్మార్గపు రాతలా?

కొన్ని ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు తప్పుడు వార్తలతో ప్రజల మనసుల్లో విషాన్ని ఎక్కించే ప్రయత్నం చేస్తున్నాయి. వాళ్ల లక్ష్యం నెరవేరాక కూడా ఈ దుర్మార్గపు రాతలను ఆపకపోవడం వాళ్ల కిరాతక మానసిక నైజానికి అద్దం పడుతోంది. రామోజీరావు లేరనుకుంటే ఆయన కుమారుడు కిరణ్ ఈనాడులో తప్పుడు వార్తలు రాయిస్తున్నారు. జగన్ రక్షణకు 986 మంది, ఇంట్లో ఉంటేనే ఇంత మంది.. బయటకెళ్తే దీనికి రెండు మూడింతలు.. 5 ఏళ్లలో భద్రతా సిబ్బంది జీతాలకే రూ.296 కోట్లు అని అసత్యాలను ఎలా ప్రచురిస్తారు? తాడేపల్లి క్యాంప్ ఆఫీసును ప్యాలెస్ అని లోకేశ్ మాట్లాడుతున్నారు. ఆయన ఎర్రబుక్కు రాసింది నిజమైతే, ఖలేజా ఉన్న రాజకీయ నాయకుడైతే.. వారి జూబ్లీహిల్స్ ఇంటికి మీడియా టూర్ పెట్టాలి. లేదా రిటైర్డ్ జడ్జితో ఆ ఇంటికి విలువ కట్టించాలి. చంద్రబాబు తన రాజ్యకాంక్ష కోసం ఎన్టీఆర్ దగ్గర నుంచి జగన్ వరకు ఎవరినీ వదిలిపెట్టకుండా వ్యక్తిత్వహననం చేయిస్తున్నారు. సీఎం క్యాంప్ ఆఫీసులో ఫర్నీచర్ గురించి మాట్లాడుతున్నారు.. బాబు ఆఫీసులో ఫర్నీచర్ ఎవరు వేశారో లెక్కలు తీయాలి. మీకో న్యాయం.. జగన్‌కో న్యాయమా?.

చంద్రబాబు ఇంటి రోడ్డును బ్లాక్ చేయలేదా?

మొన్నీమధ్య తాడేపల్లిలోని రోడ్డును మూసేశారంటూ రాశారు. 2014 నుంచి 2019 దాకా చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఉండవల్లిలో లోటస్ హోటల్ నుంచి మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం మీదుగా కరకట్ట రోడ్డులో జడ్జిలను తప్ప ఎవరినైనా వెళ్లనిచ్చారా? చివరకు టీడీపీ ఎమ్మెల్యేలకు కూడా ఆ రోడ్డులో ప్రవేశం లేదు. మందడం, వైకుంఠపురం, కృష్ణాయపాలెం ఊర్లకు లోపలి నుంచి చుట్టూ తిరిగి రావాల్సిందే కదా. నాడు మొత్తం 13 కిలోమీటర్లు రోడ్డు మూసేశారు. తాడేపల్లిలో జగన్ ఇంటి చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లు ఉన్నాయి కాబట్టే ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేశారు. ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీ ఓనర్లు ఇకనైనా ఈ అసత్య కథనాలను ప్రచురించడమానుకోవాలి.

మాజీ ఎంపీ ఎంవీవీపై కేసు నమోదు

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎండాడ ప్రాంతంలో హయగ్రీవ భూముల వ్యవహారంలో తమపై ఒత్తిడి చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఎంవీవీ, మరికొందరిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరిలోవ సీఐ బి.గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం..హయగ్రీవ భూముల వ్యవహారంలో తమను వేధించి, తమపై ఒత్తిడి చేసినట్లు హయగ్రీవ ప్రాజెక్ట్ ప్రతినిధి సీహెచ్.జగదీశ్వరుడు ఈ నెల 22న ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ప్రకారం ఏ1గా జి.బ్రహ్మాజీ, ఏ2 గా జి.వెంకటేశ్వరరావును, ఏ3గా ఎంవీవీ సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిపై 9 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుపై మాజీ ఎంపీ ఎంవీవీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసినట్లు తెలిసింది.

క్లుప్తంగా...

గతంలోలా పనిచేస్తామంటే కుదరదు

అధికారులకు హోంమంత్రి అనిత హెచ్చరిక



పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): గత ప్రభుత్వంలోలా అధికారులు పని చేస్తామంటే కుదరదని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. మంగళవారం పంచాయతీరాజ్ అధికారులతో అతిథి గృహంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన కోసం పనిచేయమని అడగనని, ప్రజల కోసమే పనిచేయాల్సి ఉంటుందన్నారు. హోంమంత్రి ఉన్న నియోజకవర్గ పరిధిలో పని చేయడం మీ అదృష్టమో, దురదృష్టమో మీకే తెలియాలన్నారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని, పరిష్కరం లేని సమస్యలు ఉండవన్నారు. పాయకరావుపేట నుంచే ప్రక్షాళన మొదలుపెట్టాలని అనుకుంటున్నానన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్‌లు వేస్తే సహించేది లేదన్నారు. పట్టణంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వాటిని పరిశీలించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. తన పేరు చెప్పి ఎవ్వరైనా డబ్బు వసూలు చేస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తెరుచుకున్న మైనింగ్ కార్యాలయాలు

అనుమానంతో 14 రోజులు మూసివేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మైనింగ్ శాఖ ప్రధాన కార్యాలయాలు రెండు వారాల తర్వాత తెరుచుకున్నాయి. ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో ఇబ్రహీంపట్నంలోని మైనింగ్ డైరెక్టర్ కార్యాలయం, తాడిగడపలోని ఏపీఎండీసీ కార్యాలయాలను రెండు వారాల క్రితం అనధికారిక ఆదేశాల ప్రకారం మూసివేశారు. అధికారులు, ఉద్యోగులు ఎవరూ వారి కార్యాలయాల్లోకి వెళ్లవద్దని చెప్పి అక్కడ పోలీసు పహారా ఏర్పాటు చేశారు. దాదాపు 14 రోజుల పాటు రెండు కార్యాలయాలు పోలీసుల ఆధీనంలోనే ఉన్నాయి. తాజాగా మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బాధ్యతలు చేపట్టడం, అంతకుముందే ఆ శాఖ ముఖ్య కార్యదర్శిగా యువరాజ్, డైరెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ నియమితులై బాధ్యతలు తీసుకోవడంతో మంగళవారం కార్యాలయాలను తెరిచారు. వెలగపూడి సచివాలయంలో డైరెక్టర్, ఏపీఎండీసీ కార్యాలయాల అధికారులతో మంత్రి సమక్షంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. మైనింగ్ శాఖకు సంబంధించిన వివరాలను ఆయన ముందుంచి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత అధికారులు తమ కార్యాలయాలకు వెళ్లారు. బుధవారం నుంచి కార్యాలయాలు పూర్తిగా తెరుచుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం కుట్ర రాజకీయాలు చేస్తోంది

- వాగ్దానాలపై కూటమి మౌనం
- మాజీ మంత్రి కారుమూరి



సాక్షి, భీమవరం: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీపై కక్షసాధింపు లక్ష్యంగా పాలన సాగిస్తోందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి అనుమతులు లేవంటూ ఇప్పుడు పంచాయతీ అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని మంగళవారం ఆయన తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వం వస్తే అవి చేస్తాం.. ఇవి చేస్తామంటూ ఎన్నికల ముందు ఎడాపెడా వాగ్దానాలిచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదని విమర్శించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి కుట్ర రాజకీయాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారని చెప్పారు. కక్ష సాధింపు చర్యలు కొనసాగింపులో భాగంగా ఇప్పుడు వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై పడ్డారని కారుమూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నార్పీ అగ్రహారంలో గత ఏడాది చేపట్టిన జిల్లా కార్యాలయం గురించి ఇప్పటి వరకు నోరుమెదపని కూటమి నాయకులు ఇప్పుడు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి నోటీసులు జారీ చేయించడం సిగ్గుచేటన్నారు. చౌకబారు పనులు మాని ప్రజాహితం కోసం పనిచేయాలని కారుమూరి హితవు పలికారు.

ఢిల్లీ చేరిన ఏపీ కాంగ్రెస్ పంచాయతీ

ఏఐసీసీ నేత తారిక్ అన్వర్‌ను కలిసిన ఏపీ కాంగ్రెస్ నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నాయకుల పంచాయతీ హస్తినకు చేరింది. ఇటీవల జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి వైఎస్ షర్మిల కారణమని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ ఆరోపించారు. మంగళవారం సుంకర పద్మశ్రీ, రాకేష్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ నాయకుల బృందం ఢిల్లీలో ఏఐసీసీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ తారిక్ అన్వర్‌ను కలిసింది. ఎన్నికల్లో వైఎస్ షర్మిల వ్యవహరించిన తీరు, పలు ఇతర అంశాలపై వారు ఫిర్యాదు చేశారు. పార్టీలో తాజా పరిస్థితులు, పరిణామాల గురించి ఆయనకు వివరించారు. వీలైనంత త్వరగా పార్టీని గాడిలో పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

భద్రతపైనా తప్పుడు రాతలా?

వైఎస్ జగన్ సెక్యూరిటీపై ఈనాడు అవాస్తవాలు

- 983 మందితో భద్రత అంటూ దుష్ప్రచారం
- భద్రతా విధుల్లో ఉన్నది 196 మందే
- నాడు చంద్రబాబు కుటుంబానికి భారీ భద్రత
- నిబంధనల మేరకు జగన్‌కు కల్పించిన భద్రతపై అబద్ధాల రాతలు

సాక్షి, అమరావతి: అవాస్తవాలు, అభూత కల్పనలే ఆసరాగా బతికేస్తున్న పచ్చ మీడియా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మరోసారి బురద జల్లే ప్రయత్నం చేసింది. ఆయనకు కల్పిస్తున్న భద్రతపై ఈనాడు పత్రిక అభూత కల్పనలతో అసత్య కథనాన్ని అచ్చేసింది. ఆయనకు 983 మందితో భారీ భద్రత కల్పించినట్లు అబద్ధాలతో కథనాన్ని వండింది. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రుల భద్రత ఏర్పాట్లకు ఉన్నత స్థాయి సెక్యూరిటీ రివిజన్ కమిటీ అనే ప్రత్యేక వ్యవస్థ ఉంటుందని, ఆ కమిటీ నిర్ణయం మేరకే ఏర్పాట్లు జరుగుతాయన్న కనీస జ్ఞానం ఆ పత్రికకు లేకపోయింది. వాస్తవంగా వైఎస్ జగన్‌కు ఉన్న భద్రతా సిబ్బంది ఎందరు అన్న విషయాన్ని పరిశీలించాలన్న నైతిక విలువలకూ తిలోదకాలిచ్చి నోటికొచ్చిన సంఖ్యలతో ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తోంది. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం వద్ద ఈనాడు చెప్పినట్లుగా 983 మంది భద్రతా సిబ్బంది లేరు. కాన్వాయ్ కాంపొనెంట్‌తో కలిపి కేవలం 196 మందే విధుల్లో ఉన్నారు. అదీ షిఫ్టులవారీగా భద్రతా విధులు నిర్వర్తిస్తున్నారు.

వివిధ విభాగాల నుంచి విధుల్లో ఉన్న భద్రతా సిబ్బంది వివరాలు

సివిల్ పోలీసులు: సీఐ-1, ఎస్సైలు-4, హెడ్ కానిస్టేబుల్-1, కానిస్టేబుళ్లు -12 , మహిళా కానిస్టేబుల్ -1.
ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు: ఆర్ఎస్సైలు - 2, ఏఆర్ఎస్సై -1, కానిస్టేబుళ్లు - 28
ఏపీఎస్పీ: డీఎస్పీ -1, ఆర్ఎస్సై - 3, ఏఆర్ఎస్సై-2, హెడ్ కానిస్టేబుళ్లు - 14, కానిస్టేబుళ్లు - 69
ఆక్టోపస్: ఆర్ఐ -1, ఆర్ఎస్సైలు -2, కానిస్టేబుళ్లు-10
మొత్తం: 152 మంది

ఐసోలేషన్‌లో: అదనపు ఎస్పీ - 1, ఆర్ఐ - 2, ఆర్ఎస్సై - 3, కానిస్టేబుళ్లు - 17
మొత్తం: 23 మంది
కాన్వాయ్ విభాగంలో: సీఐ - 1, ఎస్సై - 3, హెడ్ కానిస్టేబుల్ - 1, కానిస్టేబుళ్లు - 16
మొత్తం: 21 మంది.

సెక్యూరిటీ రివిజన్ కమిటీ సమావేశం కాకుండానే

ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రుల భద్రత ఏర్పాట్లను ఉన్నత స్థాయిలోని సెక్యూరిటీ రివిజన్ కమిటీ నిర్ణయిస్తుంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఆ కమిటీ సూచనల మేరకే భద్రతా ఏర్పాట్లు కల్పించాల్సి ఉంటుంది. ఏ ముఖ్యమంత్రీ తనకు ఇంత భద్రత కావాలని అడగరు. సెక్యూరిటీ రివిజన్ కమిటీయే అన్ని అంశాలను విశ్లేషించి ఎంత మేర భద్రత కల్పించాలన్నది ఖరారు చేస్తుంది. ముఖ్యమంత్రి నివాసం, పరిసర ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లు, మార్పులు, చేర్పులు తదితర అంశాలను కూడా ఈ కమిటీ ఆదేశాల మేరకే చేపడతారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఆయన నివాసం వద్ద భద్రతా ఏర్పాట్లను సెక్యూరిటీ రివిజన్ కమిటీ నిర్ణయం మేరకే చేపట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సెక్యూరిటీ రివిజన్ కమిటీ ఇంకా సమావేశమవ్వనే లేదు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రుల భద్రత ఏర్పాట్లపై సమీక్షించనే లేదు. కానీ ఈనాడు పత్రిక మాత్రం దురుద్దేశపూరిత కథనం ప్రచురించడం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నమే.

నాడు బాబు మనవడికి కూడా భద్రత

2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన మనవడు దేవాన్ష్‌కు కూడా ప్రత్యేకంగా భద్రత కల్పించారనే వాస్తవాన్ని ఈనాడు ఉద్దేశపూర్వకంగా విస్మరించింది. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్‌కు ప్రత్యేకంగా భద్రత కల్పించారు. ఉండవల్లిలోని చంద్రబాబు కరకట్ట నివాసంతోపాటు హైదరాబాద్‌లోని వారి నివాసం, చివరకు ఫామ్ హౌస్ వద్ద కూడా భారీ భద్రత కల్పించడం గమనార్హం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కల్పించిన భద్రతకంటే ఎన్నోరెట్లు అధికంగా భద్రత కల్పించారు. ఈ అధికార దుర్వినియోగంపై ఏనాడూ పట్టించుకోని ఈనాడు.. ఉన్నత స్థాయి కమిటీ సూచనల మేరకు నిబంధనల ప్రకారం వైఎస్ జగన్‌కు కల్పించిన భద్రతపై అభూత కల్పనలు ప్రచురించింది.

బాబు అక్రమాలను కప్పిపుచ్చేందుకే ప్రజావేదిక నిర్మాణం

ప్రభుత్వ ఆస్తి అక్రమంగా ఉండకూడదనే కూల్చివేత

సాక్షి, అమరావతి: ఐదేళ్ల క్రితం గుంటూరు జిల్లా ఉండవల్లిలో చంద్రబాబు నివాసం పక్కన అక్రమంగా నిర్మించిన ప్రజావేదిక కూల్చివేతపై టీడీపీ చిలవలు పలవలుగా ప్రచారం చేయడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. అన్యాయంగా ఈ వేదికను కూల్చారని టీడీపీ తప్పుగా వాదిస్తోంది. నిజానికి ప్రజావేదిక ప్రభుత్వమే నిర్మించిన ఒక అక్రమ కట్టడం. ఓ తప్పును కప్పి పుచ్చుకునేందుకు బాబు చేసిన మరో తప్పు ప్రజావేదిక నిర్మాణం. ఉండవల్లిలోని ఆయన నివాసం ఉంటున్న భవనాన్ని అక్రమంగా నిర్మించారు. నదీ పరిరక్షణ చట్టానికి విరుద్ధంగా దాన్ని నిర్మించారని ఆయన అధికారంలో ఉన్నప్పుడే ఆయన ప్రభుత్వమే నిర్ధారించి నోటీసులు ఇచ్చింది. కనీసం బిల్డింగ్ ప్లాన్ అనుమతి కూడా తీసుకోకుండా లింగమనేని రమేష్ దానిని నిర్మిస్తే బాబు దాన్ని మరింత అత్యాధునికంగా మార్చుకుని వినియోగించారు. ఆ అక్రమ నిర్మాణాన్ని కప్పి పుచ్చేందుకు పక్కనే ప్రజల కోసమంటూ ప్రజావేదిక నిర్మించారు. పేరుకు ప్రజావేదికైనా అది పూర్తిగా టీడీపీ కార్యక్రమాల కోసం నిర్మించిందే. కనీసం దానికైనా అనుమతి తీసుకున్నారా అంటే అదీ లేదు. అధికారంలో ఉన్నాం కాబట్టి ఏదైనా చేయొచ్చనే అహంకారంతో తన ఇంటి పక్కనే ఉన్న స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా, నదీపరిరక్షణ చట్టాలు ఉల్లంఘించి ప్రజావేదిక నిర్మించి పార్టీ కోసం వాడుకున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక దానిపై సమీక్ష జరిపి ప్రభుత్వ ఆస్తి అక్రమంగా, ఉల్లంఘనలతో ఉండకూడదనే ఉద్దేశంతో దాన్ని కూల్చివేసింది. ఈ చర్యను టీడీపీ వక్రీకరించింది. ఎందుకు అలా కూల్చారనే విషయాన్ని టీడీపీ ఏనాడూ చెప్పలేదు. ప్రభుత్వ ఆస్తి అన్ని అనుమతులతో, ఉల్లంఘన రహితంగా ఉండాలని అప్పటి ప్రభుత్వం భావించింది. అదే ప్రైవేట్ ఆస్తి అయితే నోటీసులు ఇవ్వడం, ఆ తర్వాత నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లే అవకాశం ఉండేది. ప్రజావేదిక పక్కనే ఉన్న బాబు నివాసం ప్రైవేట్ ఆస్తి కాబట్టి దానికి నోటీసులు ఇచ్చింది. ఈ విషయాలను మరుగునపరిచి ప్రజావేదిక అంతా సక్రమమైనట్లు, నిబంధనలకు విరుద్ధంగా దాన్ని కూల్చినట్లు టీడీపీ ప్రచారంచేయడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజావేదిక శిథిలాలే వైఎస్సార్‌సీపీకి సమాధి రాళ్లు: లోకేశ్

ఐదేళ్ల క్రితం ప్రజావేదికపైకి బుల్డోజర్ పంపి జగన్ విధ్వంస పాలన ఆరంభించారని మంత్రి లోకేశ్ విమర్శించారు. ఆ శిథిలాలే వైఎస్సార్‌సీపీకి సమాధికి పునాదిరాళ్లు అయ్యాయన్నారు.

కుప్పాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- పలమనేరు నుంచి క్రిష్ణగిరి వరకు నాలుగులైన్ల రోడ్డు
- కుప్పం-బెంగళూరు మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే
- నియోజకవర్గ అభివృద్ధికి మళ్లీ 'కడా' ఏర్పాటు
- కుప్పం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సాక్షి, చిత్తూరు/కుప్పం: రానున్న ఐదేళ్లల్లో కుప్పాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన సీఎం హోదాలో తొలిసారిగా సొంత నియోజకవర్గం కుప్పానికి మంగళవారం వచ్చారు. అక్కడి నుండి శాంతిపురం మండలం జెల్లిగానిపల్లి చేరుకుని హంద్రీనీవా కాలువను సందర్శించారు. అనంతరం సా.4 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఐదేళ్లల్లో కుప్పాన్ని అగ్రస్థానంలో నిలబెట్టి, ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. పేదరికం లేని సమాజం చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో అప్రజాస్వామ్యం, రౌడీయిజం, అన్నా క్యాంటీన్‌పై దాడులు, ఏకంగా తననే బెదిరించే స్థాయి దౌర్జన్యాలతో కుప్పాన్ని భ్రష్టు పట్టించారన్నారు. కేజీఎఫ్ గనులు, గ్రానైట్ దోపిడీ చేశారన్నారు. ఇకపై అలాంటి పరిస్థితి ఉండదని, అభివృద్ధి బాధ్యత తనేదన్నారు. తనకు ఎవరిపైనా కోపం లేదని, ప్రశాంతమైన పట్టణంగా అభివృద్ధికే కట్టుబడి ఉన్నానన్నారు. ఇకపై కుప్పంలో ఎవరు రౌడీయిజం చేసినా అదే కడపటి రోజు అవుతుందని చంద్రబాబు హెచ్చరించారు. గంజాయి, అక్రమ వ్యాపారాలు చేస్తే అణచివేస్తామన్నారు.

కుప్పం అభివృద్ధికి 'కడా' ఏర్పాటు..

ఇక కుప్పం అభివృద్ధి కోసం గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ఏర్పాటుచేశానని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. మళ్లీ 'కడా'ను ఏర్పాటుచేస్తానని, ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించి అభివృద్ధి చేస్తామన్నారు. కుప్పం నియోజకవర్గంలో మరో రెండు మండలాలుగా మల్లానూరు, రాళ్ళబూదుగూరులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఆర్టీసి డిపోను ఆధునీకరించి, ఎలక్ట్రికల్ బస్సులు తీసుకొస్తామన్నారు. కుప్పంలోని ప్రధాన ఆలయాలను అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే, కుప్పంలో విమానాశ్రయం నిర్మించనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. కుప్పంలో ఉత్పత్తి చేసే కూరగాయలు, పండ్లు, పూలు, ఇతర వస్తువులు ఇక్కడి నుంచి దేశవిదేశాలకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పూలకు ప్రత్యేకంగా మార్కెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. కోళ్ళు, గొర్రెల పెంపకం పరిశ్రమలు ఏర్పాటుచేసి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. పాల ఉత్పత్తి సామర్థ్యాన్ని 10 లక్షల లీటర్ల వరకు పెంచే చర్యలు చేపడతామన్నారు. కుప్పంలో ప్రతి కుటుంబాన్ని లక్షలాధికారులుగా తీర్చిదిద్దే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు చంద్రబాబు చెప్పారు.

కుప్పం-బెంగళూరు మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే..

కుప్పం నియోజకవర్గాన్ని తమిళనాడు, కర్ణాటకలతో అనుసంధానం చేసేందుకు ఫోర్‌వే రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు సీఎం చెప్పారు. ఇందులో భాగంగా కుప్పం-బెంగళూరు మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే, పలమనేరు-క్రిష్ణగిరి మధ్య ఫోర్ వే రోడ్లను నిర్మించనున్నట్లు చెప్పారు. అలాగే, హంద్రీ-నీవా కాలువ అభివృద్ధి పనులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించి, ట్రాక్టర్లతో నీటిని నింపి సినిమా షో చేసిందని విమర్శించారు. కానీ, తాను ఈ ఏడాదిలోనే పూర్తిస్థాయిలో కృష్ణాజలాలు కుప్పానికి తీసుకొస్తానన్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు భారీ మెజారిటీలు రాగా.. తనకు ఆ స్థాయిలో మెజారిటీ రాకపోవడంపై చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లాలోని 4 లక్షల డ్వాక్రా పొదుపు సంఘాలు అమరావతి నిర్మాణం కోసం రూ.4.5 కోట్లు విరాళం చెక్కులను సీఎంకు అందజేశారు.

బీసీ భవనాల నిర్మాణం పూర్తి చేయండి: మంత్రి సవిత



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మంజూరైన బీసీ భవనాలు, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో మంగళవారం బీసీ సంక్షేమ శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె పలు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 13 బీసీ భవనాలు మంజూరయ్యాయని, వాటిలో చిత్తూరు, శ్రీకాకుళం, కర్నూలు కేంద్రాల్లో మూడు భవనాలు నిర్మాణం ప్రారంభించారన్నారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఏడు బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 13 ఉమ్మడి జిల్లాల్లోని బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. మెగా డీఎస్సీ-2024కు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలు జరుగుతున్న పథకాలను మరింత సమర్థంగా అందించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తేవాలని సూచించారు. ముఖ్యమైన 15 అంశాలను గుర్తించి వంద రోజుల్లో తయారు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

కాలువల శివారు ప్రతి ఎకరానికి నీరందాలి

- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- ఆ శాఖ ఇంజనీరింగ్, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయానికి ఇబ్బందులు తలెత్తకుండా పంట కాలువల శివారు ప్రతి ఎకరానికి సాగునీరందేలా అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో ముంపు సమస్య ఎదురు కాకూడదన్నారు. అన్నదాతకు మేలు జరిగేలా కాలువలు, డ్రెయిన్లలో అవసరమైన ప్రక్షాళన పనులను యుద్ధప్రాతిపదికన పదిరోజుల్లో మొదలుపెట్టేలా సమాయత్తం కావాలని చెప్పారు. ఆయన మంగళవారం సచివాలయంలోని తన చాంబర్‌లో జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజనీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డితో కలిసి శాఖకు సంబంధించిన ఉన్నత ఇంజనీరింగ్ అధికారులు, అన్ని జిల్లాల ఎస్ఈలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతాంగానికి మేలు జరగాలనే ఉద్దేశంతో బడ్జెట్ ఇబ్బందులు ఉన్నా ప్రత్యేక నిధులు ఇచ్చేందుకు సుముఖత తెలిపారని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కష్టనష్టాలు ఎదురుకాకుండా పంట కాలువలు, మురుగుకాలువల ప్రక్షాళన పనులు పదిరోజుల్లో చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధానంగా తూడు, గుర్రపుడెక్క, మట్టి తొలగింపు పనులు చేపట్టాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో గోదావరి ఏటిగట్ల పటిష్టతకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాలని ఆదేశించారు. సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రాజెక్టుల వద్ద, రిజర్వాయర్ల వద్ద మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. నదుల అనుసంధానం ద్వారా కరువురహిత రాష్ట్రంగా సస్యశ్యామలమయ్యే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అనంతరం మంత్రి తన కార్యాలయంలో పాత్రికేయ సమావేశం నిర్వహించి రైతుశ్రేయస్సు కోసం ప్రభుత్వం తీసుకోబోతున్న చర్యలను వివరించారు. ధవళేశ్వరం, నాగార్జున సాగర్, శ్రీశైలం నుంచి విడుదల చేసే నీటిని సద్వినియోగం చేసుకోవడానికి ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

గిరిజనులకు ఇంటి వద్ద రేషన్ పంపిణీ నిలిపివేత

- రేషన్ షాపులు ద్వారానే పంపిణీ
- అరకు కాఫీ అవుట్‌లెట్ల విస్తరణ
- గిరిజన విద్యాలయాల్లో బాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వెల్లడి



సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో ఇకపై ఇంటి వద్దకు రేషన్ సరకులు రావు. గిరిజనులు రేషన్ షాపులకు వెళ్లి తెచ్చుకోవాల్సిందే. రాష్ట్ర గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ విషయం వెల్లడించారు. మంత్రి మంగళవారం గిరిజన సంక్షేమ శాఖపై సమీక్ష చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేస్తామని, ఇకపై రేషన్ షాపుల ద్వారానే సరుకులు పంపిణీ చేస్తామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో ఇంటింటికి రేషన్ అందించే మొబైల్ డిస్పెన్సరీ వాహనాలు (ఎండీయూ) వల్ల సమస్యలు ఉన్నాయన్నారు. అందువల్ల గిరిజనుల సౌలభ్యం కోసం ఏజెన్సీలోని 962 రేషన్ డిపోల ద్వారానే సరుకులు అందిస్తామని చెప్పారు. అంతర్జాతీయ గుర్తింపు కలిగిన అరకు కాఫీ అవుట్‌లెట్‌లను పెద్ద ఎత్తున విస్తరించి, డిమాండ్‌ను మరింతగా పెంచుతామన్నారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) అందించే తేనె, ఇతర ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి పెడతామని చెప్పారు. జీసీసీ పరిధిలోని 16 పెట్రోల్ బంకులు, 18 గ్యాస్ డిపోలు, 12 సూపర్ మార్కెట్‌ల ద్వారా మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టులు వస్తున్నాయని, వాటిలో 2 వేలకుపైగా పోస్టులు గిరిజన ప్రాంతాల్లో భర్తీ అవుతాయని చెప్పారు. దీంతో గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుందన్నారు. గిరిజన పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం 554 ఏఎన్ఎంలను డిప్యుటేషన్‌పై నియమిస్తున్నట్టు తెలిపారు. గిరిజన వసతి గృహాల్లో స్టడీ అవర్స్ పెడతామన్నారు. గిరిజన విద్యాలయాల్లో బాలికల రక్షణ కోసం ఫిర్యాదుల బాక్స్ పెడతామన్నారు. ఫిర్యాదు చేసిన విద్యార్థిని పేరు గోప్యంగా ఉంచుతామని, వేరే ప్రాంత అధికారులతో విచారణ చేయిస్తామని చెప్పారు. గిరి శిఖర గ్రామాల ప్రజలకు తక్షణ వైద్య సేవల కోసం ఫీడర్ అంబులెన్స్‌లు, ప్రసవం అనంతరం సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. వంద రోజుల్లో గంజాయికి చెక్ పెట్టేందుకు కృషి చేస్తామని మంత్రి చెప్పారు.

ఎండీయూ వాహనాలకు 'కూటమి' మంగళం

'ఎక్స్'లో వైఎస్సార్‌సీపీ మండిపాటు



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇంటింటి రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వం మంగళం పలికిందని వైఎస్సార్‌సీపీ పేర్కొంది. గిరిజన ప్రాంత ప్రజలకు కూటమి ప్రభుత్వం మళ్లీ తిప్పలు తెస్తుందని మండిపడింది. పెన్షన్ పంపిణీకి వలంటీర్స్‌ను దూరం చేస్తూ ఇటీవల తీర్మానం చేసిందని, ఇప్పుడు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీని నిలిపివేస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుపట్టింది. మారుమూల గిరిజన ప్రాంత ప్రజలు రేషన్ కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేసింది. రేషన్ షాప్స్ వద్ద మళ్లీ క్యూ లైన్‌లో గిరిజనులు తిప్పలు పడనున్నారని పేర్కొంది. గత ఐదేళ్లు గడప వద్దే వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన సేవలకి వరుసగా మంగళం పలుకుతుండటాన్ని ఖండించింది. రాష్ట్రవ్యాప్తంగా పేద బిడ్డల మెడికల్ చదువుల కోసం వైఎస్ జగన్ కట్టిన ప్యాలస్‌లను నీ బుల్డోజర్లతో ఎప్పుడు కూల్చేస్తున్నావ్ లోకేశ్? అంటూ వైఎస్సార్‌సీపీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

తొలి 100 రోజులు పాలనాపరమైన అంశాలపైనే దృష్టి

- పార్టీ ఎమ్మెల్యేలకు జనసేన అధినేత పవన్ దిశా నిర్దేశం
- అసెంబ్లీ వ్యవహారాలు, సభా నియమావళిపై జనసేన ఎమ్మెల్యేలకు అవగాహన



వివిధ స్థాయి ఉద్యోగ సంఘాల నేతలతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: జనసేన నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో ఎక్కువ శాతం శాసన సభ వ్యవహారాలకు కొత్తవారేనని, ఇక్కడి నుంచి తొలి 100 రోజులు పాలనాపరమైన విషయాలపై అవగాహన, అధ్యయనంపైనే దృష్టిపెట్టాలని పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు. శాసనసభ వ్యవహారాలకు సంబంధించి పార్టీ ఎమ్మెల్యేలకు జనసేన పార్టీ మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. విజయవాడలోని ఉప ముఖ్యమంత్రి అధికారిక క్యాంప్ కార్యాలయంలో పవన్‌కళ్యాణ్ జనసేన పార్టీ తరుపున గెలిచిన ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో శాసనసభ వ్యవహారాలు, సభ నియమావళిని ఎమ్మెల్యేలకు వివరించారు. పవన్ మాట్లాడుతూ.. జనసేన నుంచి గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలకు అభినందన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామని, ఈ కార్యక్రమం అయిన తరవాత మీరు నియోజకవర్గస్థాయిలో అభినందన కార్యక్రమాలు చేపట్టి మీ గెలుపు కోసం తోడ్పడిన కూటమి, జనసేన నాయకులను అభినందించండి అని ఎంపీలు, ఎమ్మెల్యేలకు సూచించారు. కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల, దుర్గేష్ పాల్గొన్నారు. కాగా, బుధవారం నుంచి వారాహి అమ్మవారి దీక్ష చేపట్టబోతున్నట్లు ప్రకటించిన పవన్‌కళ్యాణ్ మంగళవారం ఎమ్మెల్యేల సమావేశంలో ప్రత్యేక మాలధారణతో కూడిన పసుపు వస్త్రాలు ధరించి పాల్గొన్నారు.

శాఖల వారీగా శ్వేతపత్రాలు విడుదల

వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రం దెబ్బతిందని, వ్యవస్థలు ఎలా నాశనమయ్యాయో వివరిస్తూ.. కీలక శాఖల్లోని వాస్తవాలను ప్రజల ముందు పెట్టేందుకు శాఖల వారీగా శ్వేత పత్రాలు విడుదల చేస్తామని పవన్ చెప్పారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లోని వివిధ స్థాయి ఉద్యోగుల సంఘాల నేతలు మంగళవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో వేర్వేరుగా కలిసి తమ సమస్యలు గురించి పవన్‌కు వివరించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, తాను వెంటనే అద్భుతాలు చేసేస్తాను అని చెప్పను గానీ.. ఉద్యోగుల వేదన వింటానని, వారి సూచనలను స్వీకరిస్తానని పవన్ చెప్పారు.

కార్మిక శాఖపై మంత్రి వాసంశెట్టి సమీక్ష



సాక్షి, అమరావతి: కార్మిక శాఖ పరిధిలోని అన్ని విభాగాలపై ఆ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయా విభాగాల్లో అమలు చేసే కార్యక్రమాలు, పథకాలు, వాటి పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. సమీక్షా సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ శేషగిరిరావు, ఈఎస్ఐ డైరెక్టర్ అంజనేయులు, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ చంద్రశేఖర్ వర్మ, బాయిలర్ల డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, కార్మిక సంక్షేమ కమిషనర్ రాణి పాల్గొన్నారు.





ఆకర్షణీయమైన వస్తువుల పట్ల మోహరహితమైన దృష్టి ఏర్పడటమే నిజమైన ప్రజ్ఞ: ఆరాటం స్థానంలో విరక్తి ఉత్పన్నమవటం, స్పష్టమైన అంతఃదృష్టి కలిగిందనటానికి గుర్తు.

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 26 జూన్ 2024

చెరవీడిన అసాంజ్ !

అగ్రరాజ్యంపై యుద్ధం చేయాలంటే మారణాయుధాలు అవసరం లేదని, ఒక ల్యాప్‌టాప్‌తో దాన్ని ముప్పుతిప్పలు పెట్టొచ్చని గుక్కతిప్పుకోనీయకుండా చేయొచ్చని నిరూపించిన వికీలీక్స్ అధిపతి జూలియన్ అసాంజ్‌కు పద్నాలుగేళ్ల తర్వాత ఎట్టకేలకు స్వేచ్ఛ లభించింది. తన సాహసవంతమైన కార్యకలాపాల కారణంగా అయినవాళ్లకు దూరమై కొన్నాళ్లు లండన్‌లోని ఈక్వెడార్ దౌత్యకార్యాలయంలో తలదాచుకుని, ఆ తర్వాత బ్రిటన్ చెరలో మగ్గిన అసాంజ్ నేరాంగీకార ప్రకటనకు సిద్ధపడి అమెరికా ఇవ్వజూపిన వెసులుబాటుకు తలొగ్గక తప్పని స్థితి ఏర్పడటం స్వేచ్ఛాప్రియులకూ, పాత్రికేయలోకానికీ చివుక్కుమనిపిస్తుంది. ఒప్పందం ప్రకారం పశ్చిమ పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలోని 14 దీవుల సముదాయమైన ఉత్తర మెరీనా ఐలాండ్స్ (ఎన్ఎంఐ)లో ఒకటైన సైపాన్ దీవిలోని న్యాయస్థానం ఎదుట అసాంజ్ హాజరై తన తప్పు ఒప్పుకున్నాడు. అమెరికాలో అడుగుపెట్టడానికి అసాంజ్ విముఖత చూపిన కారణంగా, సాంకేతికంగా దానిలోనే భాగమైన సైపాన్‌లో ఈ తతంగం పూర్తిచేయటానికి అధ్యక్షుడు జో బైడెన్ అంగీకరించారు. అమెరికా ఆయనపై గూఢచర్యానికి సంబంధించి 18 ఆరోపణలు చేసింది. వాటి ఆధారంగా విచారణ జరిగితే అసాంజ్‌కు 175 ఏళ్ల శిక్షపడేది. కానీ ఒప్పందం ప్రకారం అందులో ఒకే ఒక నేరారోపణ మోపి, దానికింద అయిదేళ్ల శిక్షవిధించి బ్రిటన్ జైల్లో అనుభవించిన కాలాన్ని పరిగణనలోకి తీసుకుని వెంటనే విడుదల చేయటానికి ఒప్పందం కుదిరింది. వికీలీక్స్ ఎప్పటిలా పనిచేస్తుందా లేదా అన్నది తేలాల్సి వుంది.

ఏం నేరం చేశాడు అసాంజ్? యుద్ధాలనూ, దురాక్రమణలనూ సమర్థించుకునేందుకు అగ్రరాజ్యాలు ప్రచారంలో పెట్టే అబద్ధాలను తుత్తినియలు చేశాడు. అమెరికా దురాక్రమణలో ఉన్న ఇరాక్‌లో ఒక మారుమూల పల్లెలో వీధిలో నిలబడి మాట్లాడుకుంటున్న ఇద్దరు సాధారణ పౌరులనూ, రాయిటర్ జర్నలిస్టులు ఇద్దరినీ కేవలం సరదా కోసం బాంబులతో హతమార్చిన అమెరికా సైనికుల దురంతాన్ని ప్రపంచం దృష్టికి తీసుకొచ్చాడు. ఉగ్రవాదాన్ని అంతంచేసే పేరిట ఇరాక్, అఫ్గానిస్తాన్‌లలో అమెరికా కూటమి దేశాలు ఎన్ని అఘాయిత్యాలకు పాల్పడ్డాయో, ఎలా నరమేధాన్ని సాగించాయో తెలిపే లక్ష పత్రాలను బట్టబయలు చేశాడు. వర్ధమాన దేశాలే కాదు... సాటికి సరైన సంపన్న దేశాల విషయంలోనూ అమెరికాకు ఎంత చిన్న చూపున్నదో ఏకరువు పెట్టే కోట్లాది సందేశాలను బజారున పడేశాడు. అవన్నీ వేర్వేరు దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలు తమ ప్రభుత్వానికి పంపిన సందేశాలు. ఎక్కడి ప్రభుత్వం ఎటువంటిదో, సైనిక వ్యవస్థల తీరుతెన్నులేమిటో తెలిపే అంచనాలు వాటిల్లో ఉన్నాయి. ఆఖరికి దేశదేశాల పాలకులు తమ అక్రమార్జనను వేరే దేశాల బ్యాంకులకు తరలిస్తున్న వైనాన్ని ఆధారాలతో వెల్లడించాడు. యూపీఏ ప్రభుత్వ హయాంలో 2006లో జరిగిన కేంద్ర కేబినెట్ విస్తరణలో 'మన అనుకూలుర' వివరాలు పంపిన సందేశం కూడా అసాంజ్ లీక్స్‌లో ఉంది. ఇవన్నీ గూఢచర్యం కిందికొస్తాయని ఇన్నేళ్లుగా అమెరికా చేసిన వాదనలో పసలేదు. ఆ దేశమైనా, పాశ్చాత్య దేశాలైనా సందర్భం ఉన్నా లేకపోయినా ప్రపంచానికి ప్రజాస్వామ్య పాఠాలు చెబుతుంటాయి. తెరవెనక మాత్రం అందుకు విరుద్ధమైన పోకడలకు పోతుంటాయి. దీన్నే సాక్ష్యాధారాలతో అసాంజ్ వెల్లడించాడు. అప్రజాస్వామికమైన ఆ కార్యకలాపాలు తాము నమ్మే విలువలకూ, విధానాలకూ పూర్తి విరుద్ధమని ఆ దేశాల పౌరులు గ్రహించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చివుంటే అంతిమంగా అక్కడి సమాజాలకూ, ప్రపంచానికీ మేలు జరిగేది. కానీ వంచకులను విశ్వసించటం, అబద్ధాలకు పట్టంగట్టడం ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు కనిపిస్తున్న ధోరణి. అసాంజ్ విలువను ఇలాంటి సమాజాలు ఏం గుర్తించగలవు? ఆయన ఇరాక్, అఫ్గాన్‌లలో అమెరికా దురంతాలను వెల్లడించినప్పుడు అమెరికా పౌరులు వెల్లువలా కదిలివుంటే ఇవాళ ఇజ్రాయెల్ గాజాను వల్లకాడు చేయసాహసించేది కాదు. మారణాయుధాలూ, మందుగుండు సరఫరా చేస్తూ ఆ నెత్తుటి క్రీడకు అమెరికా దోహదపడేది కాదు. అమెరికా ఆరోపిస్తున్నట్టు అసాంజ్ గూఢచారి కాదు. నికార్సయిన పాత్రికేయుడు. తన చర్యల ద్వారా మెరుగైన స్వేచ్ఛాయుత సమాజాన్ని ఆశించాడు తప్ప అందులో దురుద్దేశాలు లేవు. చేయని నేరానికి ఇలా గత అయిదేళ్లుగా అసాంజ్ దాదాపు 19 చదరపు అడుగుల సెల్‌లో రోజుకు 23 గంటలు ఏకాంతవాస ఖైదు అనుభవిస్తున్నాడు. బయటి ప్రపంచంతోగానీ, సహ ఖైదీలతోగానీ ఆయనకు సంబంధాల్లేవు. ఈ శిక్ష కారణంగా ఆరోగ్యం బాగా దెబ్బతింది. గుండెజబ్బు సోకింది. బహుశా అందుకే కావొచ్చు... ఆయన ఈ ఒప్పందానికి అంగీకరించి వుండొచ్చు.

అసాంజ్ విడులను స్వాగతిస్తూనే పాత్రికేయ ప్రపంచం వ్యక్తం చేస్తున్న భయాందోళనలు సహేతుకమైనవి. తమ దేశ పౌరుడు కాకపోయినా తమ గుట్టుమట్లు వెల్లడించినందుకు అమెరికా ఆగ్రహించటం, ఇన్నేళ్లుగా ఆయన్ను వెంటాడటం... ప్రజాస్వామ్య దేశాలుగా డప్పు కొట్టుకునే స్వీడన్, బ్రిటన్‌లు అందుకు సహకరించటం ఏరకంగా చూసినా సిగ్గుచేటైన విషయం. అసాంజ్ కేసు చూపి భవిష్యత్తులో తమ చీకటి చర్యలను బట్టబయలు చేసే ఏ దేశ పాత్రికేయులనైనా అమెరికా తమ దేశానికి పట్టి అప్పగించమని కోరవచ్చు. ఇప్పుడు ఆస్ట్రేలియా అసాంజ్ వెనక దృఢంగా నిలబడి అటు అమెరికాపైనా, ఇటు బ్రిటన్‌పైనా దౌత్యపరంగా ఒత్తిడి తెచ్చింది. ఎన్ని దేశాలు ఆ పని చేయగలుగుతాయి? అసాంజ్ విడుదల ఆయన కుటుంబానికీ, మద్దతుదార్లకూ ఊరటనిస్తుందనటంలో సందేహం లేదు. కానీ ఇందులో అంతర్లీనంగా కనిపిస్తున్న పోకడలు ప్రమాదకరమైనవి.

వేగంగా, క్షేమంగా పట్టాలెక్కితేనే...

విశ్లేషణ



అలోక్ కుమార్ వర్మ

ఈ నెలలో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదం రైల్వేల పనితీరును మరోసారి వార్తల్లోకి తెచ్చింది. కాగ్ నివేదిక ప్రకారం, రైళ్లలో అత్యంత ప్రమాదాలకు కారణం అవుతున్నవి సిగ్నల్ వైఫల్యాలు, పట్టాల్లో బీటలు. భద్రతా ప్రమాణాలకు తోడు, నత్తనడక వేగం వల్ల రైల్వేలు తమ మార్కెట్ వాటాను కోల్పోయాయి. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సగటు వేగం గంటకు 50 – 51 కిలోమీటర్ల మధ్యనే ఉండిపోయిందనీ, 'మిషన్ రఫ్తార్' ద్వారా సగటు వేగం 75 కిలోమీటర్లకు పెరిగిందన్నది ప్రచారమేననీ తేలింది. వందే భారత్ రైళ్లు వేగం కంటే హంగులకే ప్రసిద్ధి చెందాయి. 140 కోట్ల జనాభా కలిగిన దేశంలో రైల్వే వ్యవస్థ అన్ని విధాలుగా పటిష్ఠంగా ఉన్నప్పుడే ప్రజల అవసరాలు తీరుతాయి.

భారతీయ రైల్వే మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఈ నెల 16న పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి వద్ద ఓ గూడ్సు బండి, ప్యాసెంజర్ రైలును ఢీకొట్టడంతో తొమ్మిది మంది మరణించగా, సుమారు 40 మంది గాయపడ్డారు. 1995 నుంచి తీసుకుంటే దేశంలో కనీసం ఏడు భయంకరమైన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిల్లో ఐదింటిలో 200కు పైగా ప్రాణాలు పోయాయి. ఇంకోదాంట్లో 358 మంది మృతి చెందారు. ఈ దుర్ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ వద్ద 1995లో జరిగింది. ఏడాది క్రితం ఒడిశాలోని బాలాసోర్ వద్ద పలు రైళ్లు ఢీకొనడంతో 287 మంది చనిపోయిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ ఏడు ప్రమాదాల్లోనే విలువైన 1,600 ప్రాణాలు గాల్లో కలిసిపోవడం గమనార్హం.



పశ్చిమ బెంగాల్‌లో జూన్ 16న జరిగిన ప్రమాద దృశ్యం

140 కోట్ల జనాభా కలిగిన మనలాంటి దేశంలో రైల్వే వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలనీ, రోడ్డు, వాయు మార్గాలతో పోటీపడేలా ఉన్నప్పుడే ప్రజల అవసరాలు తీర్చగలమనీ రైల్వే ప్లానర్స్ చెబుతారు. రైల్వే బోర్డు లేదా కేంద్ర ప్రభుత్వం రెండూ ఈ ప్రాథమ్యాన్ని కాదని అనలేదు. రైల్వే వేగం రెట్టింపు చేస్తామనీ, మరిన్ని రైల్వే లైన్లతో పాటు భద్రతను కూడా పెంచుతామనీ కేంద్రం తరచూ ప్రకటనలు చేస్తూనే ఉంటుంది. ప్రధానమైన రైల్వే రూట్లలో రద్దీ విపరీతమైన నేపథ్యంలో ఇది అవసరం కూడా. కాకపోతే ఈ మాటలు ఇప్పటివరకూ మాటలకే పరిమితం కావడం గమనార్హం.

గూడ్స్, ప్యాసెంజర్ రవాణా రెండింటిలోనూ రైల్వేలు తమ మార్కెట్ వాటాను ఎప్పుడో కోల్పోయాయి. 2010–12 మధ్యకాలంలో ఈ రెండింటిలో వృద్ధి స్తంభించిపోయింది. రోడ్డు, వాయు మార్గాల వాటా ఏటా 6 నుంచి 12 శాతం వరకూ పెరిగాయి. 2014–15 నుంచి 2019 – 20 మధ్యలో ప్రయాణికుల సంఖ్య కిలోమీటర్‌కు 99,500 కోట్ల నుంచి కిలోమీటర్‌కు 91,400 కోట్లకు పడిపోవడం గమనార్హం. అదే గూడ్స్ రవాణా విషయానికి వస్తే, అది కిలోమీటర్‌కు 68,200 – 73,900 టన్నుల మధ్యే నిలిచిపోయింది. 2019–20 నుంచి ఇప్పటి వరకూ ఉన్న కాలంలో ప్యాసెంజర్, గూడ్స్ రవాణా గణాంకాలను రైల్వే శాఖ వెల్లడించలేదు.

దేశంలో రవాణాలో రైల్వేది గుత్తాధిపత్యం అనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అయితే ప్రస్తుతం అది తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మార్కెట్ వాటా తగ్గుదల ఇప్పటిమాదిరే ఇంకో పదేళ్లు కొనసాగితే రైల్వేలు రెండో తరగతి రవాణా వ్యవస్థలుగా మారిపోతాయి. రైల్వే లైన్లు, వేగం, భద్రతా ప్రమాణాలు పెరగకపోవడాన్ని బట్టి చూస్తే భారతీయ రైల్వే ప్రస్థానం ఈ దిశగానే సాగుతోందని అనాలి. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి విశాలమైన, జనాభా తక్కువ ఉన్న దేశాల్లో రైల్వేలు ఇప్పుడు ఇదే దశలో ఉన్నాయి. అయితే భారతదేశంలోని జనాభా సాంద్రత, ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న వైనాలను దృష్టిలో పెట్టుకుంటే రైల్వేల తిరోగమనం మంచిది కాదు.

రైళ్లలో భద్రత అంశాన్ని విస్తృత దృష్టికోణంతో చూడాల్సి ఉంటుంది. గత రెండు దశాబ్దాల్లో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే రైల్వే బోర్డు ఒక దిశ, దిక్కూ లేకుండా పని చేస్తోంది. అకస్మాత్తుగా విధానాల మార్పులు జరిగిపోతుండటంతో విస్తరణ, వృద్ధికి సంబంధించిన భవిష్యత్తు ప్రణాళికలు అస్తవ్యస్తంగా మారిపోయాయి. నత్తనడకన నడుస్తున్న రైళ్లను మరింత వేగంగా పరుగెత్తించడంలో బోర్డు ఘోరంగా విఫలమైంది. రైళ్ల రాకపోకలు దైవాధీనమన్న పరిస్థితి ఇప్పటికీ మారలేదు. భద్రతపై ఆందోళనలూ పెరిగిపోతున్నాయి.

రైల్వేల భద్రత, వేగం, సమయపాలన విషయాల్లో భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇటీవలే రెండు ముఖ్యమైన నివేదికలు సమర్పించారు. 2014–19 మధ్యలో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైల్వేల సగటు వేగంలో పెద్దగా మార్పుల్లేవనీ, గంటకు 50 – 51 కిలోమీటర్ల మధ్యనే ఉండిపోయిందనీ స్పష్టం చేసింది. 'మిషన్ రఫ్తార్' ద్వారా సగటు వేగం గంటకు 75 కిలోమీటర్లకు పెరిగిందన్న ప్రచారం వట్టిదేనని తేల్చింది. సరుకు రవాణా రైళ్ల విషయంలో రైల్వే బోర్డు చెప్పుకొంటున్నట్లుగా వేగం రెట్టింపు కాకపోగా, సగటు వేగం కొంత తగ్గినట్లు ఈ నివేదిక తెలిపింది. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, రైళ్లను గంటకు 110–130 కి.మీ. వేగం నుంచి, గంటకు 160 – 200 కి.మీ. వేగంతో పరుగెత్తించేందుకు కావాల్సిన టెక్నాలజీ, కోచుల తయారీ సామర్థ్యాలను భారత్ 20 ఏళ్ల క్రితమే సముపార్జించుకోవడం!

కాగ్ విడుదల చేసిన రెండో నివేదిక ప్రమాదాలకు సంబంధించినది. ప్రమాదాల సంఖ్యలో కొంత తగ్గుదల ఉంది. మనుషుల కాపలి లేని గేట్ల దగ్గర మనుషులను పెట్టడం దీనికి ముఖ్య కారణం. కానీ పట్టాలు తప్పిపోవడం, ఢీకొనడం వంటి వాటి విషయంలో పెద్దగా పురోగతి లేదు. సిగ్నల్ వైఫల్యాలు, రైల్ ఫ్రాక్చర్లు(పట్టాల్లో బీటలు) పెరిగిపోతూండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. భారతీయ రైల్వేల్లో అత్యంత భారీ ప్రమాదాలు ఈ రెండు కారణాలతోనే జరగడం గమనార్హం. బాలాసోర్‌లో గత ఏడాది సంభవించిన ప్రమాదానికి సిగ్నల్ వైఫల్యం కారణమన్నది తెలిసిన విషయమే. మొత్తమ్మీద కాగ్ నివేదికలు రెండింటి సారాంశం చూస్తే రైల్వేల్లోని వ్యవస్థల వైఫల్యానికి వేగం, సామర్థ్యం పెంపు వంటివి తోడయ్యాయి. ఫలితంగా భద్రత అంతంత మాత్రంగా మారిపోయింది. సమయపాలన అసాధ్యంగా మారింది.

భారతీయ రైల్వేల్లో ప్రస్తుత నెట్‌వర్క్ తిరోగమన దిశలో ఉంటే... ఏటికేడాదీ భారీ ప్రాజెక్టుల ప్రకటన కొనసాగుతూనే ఉంది. వీటి ఆర్థిక వెసలుబాటు గురించి ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. ప్రధాన బ్రాడ్‌గేజ్ లైన్‌తో అనుసంధానం కాకుండా ఉండే 'స్టాండ్ అలోన్ బుల్లెట్ ట్రైన్లు' వీటిల్లో ఒకటి. ఈ లైన్లు అన్నీ స్టాండర్డ్ గేజ్‌పై నిర్మించినవి. అలాగే సరుకు రవాణాకు ఉద్దేశించిన కారిడార్ పొడవాటి, బరువైన రైళ్ల కోసం సిద్ధం చేసినది.

దేశంలో తొలి బుల్లెట్ రైలు నిర్మాణం 2017లో మొదలైంది. 2012లోనే సరుకు రవాణాకు ప్రత్యేకమైన కారిడార్ల నిర్మాణం మొదలైంది. ఇదిలా ఉంటే... గత మూడేళ్లలోనే దేశంలో సుమారు 50 జతల 'సెమీ హై స్పీడ్' వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టారు. ఇవి వేగం కంటే వాటి హంగులకే ఎక్కువ ప్రసిద్ధి చెందాయి. ఒక్క విషయమైతే స్పష్టం. రైల్వే బోర్డు తన ప్రాథమ్యాలను సమగ్రంగా సమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మరి కొత్త ప్రభుత్వం ఈ అంశాన్ని తలకెత్తుకుంటుందా అన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకం.

వ్యాసకర్త రైల్వే విశ్రాంత చీఫ్ ఇంజినీర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎమర్జెన్సీ బాధిత



అత్యవసర పరిస్థితి కాలంలో అమరులైన ఎందరిలో కన్నడ సినిమా నటి స్నేహలతా రెడ్డి (తెలుగు కవి పఠాభి భార్య) ఒకరు. ఆమె కుటుంబం జార్జి (ఫెర్నాండెజ్)కి సన్నిహితంగా ఉన్న కారణంగా, ఆమెను బెంగళూరు జైల్లో అమానవీయమైన హింసకు గురిచేశారు. ఎమర్జెన్సీ ఎత్తివేయడానికి కొద్దిరోజుల ముందు ఆమె విడుదలయ్యారు. ఆ హింస కారణంగా 1977 జనవరి 20న మరణించారు.

– అలోక్ భట్, కాలమిస్ట్

శభాష్ అఫ్గానిస్తాన్!



16 ఏళ్ల క్రితం అఫ్గానిస్తాన్ ఐసీసీ ప్రపంచ క్రికెట్ లీగ్‌లో ఐదో విభాగంలో ఉండి, జపాన్, సింగపూర్, బోట్స్‌వానా లాంటి దేశాలతో ఆడుతోంది. ఇవ్వాళ వాళ్లు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ లాంటి దేశాలకంటే ముందుండి, ఐసీసీ టీ20 ప్రపంచ కప్ సెమీ ఫైనల్లో ఆడుతున్నారు.

– మజహర్ అర్షద్, పాక్ క్రికెట్ స్టాటిస్టీషియన్

తప్పించుకోవడానికి...



దేశంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఎవరూ ప్రయత్నించడం లేదు. ఆ సమస్యలు తమకు వర్తించకుండా ఉండేలా, ప్రతి ఒక్కరూ తగినంత డబ్బును సంపాదించడానికి ప్రయత్నిస్తున్నారు.

– సౌమ్య శర్మ, లా విద్యార్థిని

మారిన కాలం



నేను ఇరాన్‌లో శరణార్థిగా జన్మించాను. నాకు విద్యాహక్కును నిరాకరించారు. హెరాత్(అఫ్గానిస్తాన్) దగ్గర సరిహద్దును దాటుతున్నప్పుడు, మా నాన్న చెప్పింది నాకు గుర్తుంది: 'ఇది నీ దేశం; నిన్నెవరూ ఇక్కడ తరగతి గదిలోంచి బయటకు తరిమేయలేరు.' అఫ్గానిస్తాన్‌లో చదువుకుని, నేను ఇంతదాన్నయ్యాను. కానీ ఇరవై ఏళ్ల అనంతరం అఫ్గానిస్తాన్‌లో బాలికలు విద్యా హక్కును కోల్పోయారు. మనం వారికి అండగా నిలవాలి.

– ఫెరెష్తా అబ్బాసీ, ఫెలో

అసాంజ్‌కు స్వేచ్ఛ




ఒక మంచి మనిషి, మొత్తానికి స్వేచ్ఛను పొందారు. కాలం మలుపు తిరుగుతోంది! (సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 'వికీ లీక్స్' సంపాదకుడు జూలియన్ అసాంజ్ యూకే జైలు నుంచి విడుదలైన నేపథ్యంలో.)

– టకర్ కార్ల్‌సన్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

రిజర్వేషన్ల పితామహుడు

భారత దేశంలో దళితులు, బీసీల వంటి సామాజికంగా వెనుకబడిన వర్గాలవారి ఉన్నతికి ప్రభుత్వ పరంగా ఇప్పుడు కొనసాగిస్తున్న అనేక సదుపాయాలు, హక్కులను 19వ శతాబ్దంలోనే తన కొల్హాపూర్ సంస్థాన ప్రజలకు అందించినవాడు సాహు మహారాజ్. 1894 ఏప్రిల్ 2న సింహాసనం అధిష్ఠించిన సాహు, వెనుకబడిన కులాల వారందరికీ పాఠశాలలు, వసతి గృహాలు ప్రారంభించి విద్యాబోధనను ఒక ఉద్యమంగా నడిపాడు. 1902 జులై 26, భారతదేశ చరిత్రలో ఒక చరిత్రాత్మక దినం. ఆ రోజు ఛత్రపతి సాహు మహారాజ్ ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగాలన్నింటిలో వెనుకబడిన వర్గాల వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సంచలనాత్మక ఉత్తర్వులను జారీ చేసింది. గ్రామ పరిపాలన రంగంలో వంశపారంపర్యంగా వచ్చే ముఖ్యులైన పటేల్ (పాటిల్), పట్వారీ (కులకర్ణి) వ్యవస్థని 1918లో రద్దు చేశారు.



సాహు మహారాజ్

1919 సెప్టెంబర్ 6న అంటరానితనం పాటించడం నేరమని ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. 1920 మే 3వ తేదిన వెట్టిచాకిరీ వ్యవస్థను రద్దు చేస్తూ చట్టం చేశారు. అంబేడ్కర్ అస్పృశ్యుల హక్కుల సాధన కోసం స్థాపించిన 'మూక్ నాయక్' పత్రికకు ఆర్థిక సాయం చేశారు. 1920లో అంబేడ్కర్ ఇంగ్లాండ్ వెళ్లి చదువుకునేందుకు ఆర్థిక సహాయం చేశాడు. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ప్రారంభించాడు. 1919 జూన్‌లో బాల్య వివాహాల రద్దు చట్టం వచ్చింది. 1919 జులై 12న కులాంతర, వర్ణాంతర వివాహాలను చట్టబద్ధం చేస్తూ చట్టం తెచ్చాడు. విడాకులు మంజూరు చేయడంలో స్త్రీల నిర్ణయానికే ప్రాధాన్యతనిస్తూ 1919 ఆగస్టు 2న విడాకుల చట్టం చేశాడు. 1920 జనవరి 17న జోగిని, దేవదాసీ వ్యవస్థను రద్దు చేశాడు. ప్రభుత్వం దేవదాసీల పునరావాసానికి చర్యలు తీసుకున్నాడు. 1918లో తన రాజ్యంలో వడ్డీ వ్యాపారాన్ని పూర్తిగా నిషేధిస్తూ సహకార సంఘాలను ఏర్పాటు చేశాడు. మహారాజుగా అనేక సంస్కరణలు తీసుకొచ్చిన రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్ 1922 మే 6న మరణించాడు.

– సంపత్ గడ్డం, కామారెడ్డి జిల్లా

(నేడు సాహు మహారాజ్ జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

రాజ్యాంగేతర శక్తుల కరాళ నృత్యం

సందర్భం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించటానికీ, పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం వంటి ఉదాత్త అంశాలను అందుబాటులోకి తేవడానికీ మన 'రాజ్యాంగ పరిషత్' రాజ్యాంగాన్ని రూపొందించింది. ప్రజాస్వామ్య సాధారణ లక్ష్యాల గురించి రాజ్యాంగ ప్రవేశికలో స్పష్టంగా ఉంది. ప్రధానంగా నిష్పక్షపాత ఎన్నికలు, ప్రజాస్వామ్య పాలన, సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం; స్వేచ్ఛ, సమానత్వం, ప్రాథమిక హక్కుల గురించిన ప్రస్తావన అందులో ఉంది. అందుకే ప్రతి ఒక్కరూ ప్రమాణ స్వీకారం చేసే ముందు రాజ్యాంగం మీద పూర్తి విశ్వాసం ఉంచుతామని ప్రమాణం చేస్తారు.

కానీ ఇటీవలి (2024) సార్వత్రిక ఎన్నికల్లో చోటు చేసుకున్న రాజ్యాంగ విరుద్ధమైన సంఘటనల గురించి ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా మాట్లాడుతున్నారంటే భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంత రాజ్యాంగ విరుద్ధంగా మారిందో చెప్పక తప్పదు. ఆధునిక విజ్ఞాన చక్రవర్తి 'ఎలెన్ మస్క్' లాంటి వాళ్ళు ఈవీఎమ్‌ల పనితీరును ఆక్షేపించారంటేనే ఎంత ఘోరంగా ఎన్నికలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. అమెరికా కూడా ఈసారి మన ఎన్నికలను తప్పు పట్టింది. 20 లక్షల ఈవీఎమ్‌లు ఎటుపోయాయో ఎవరూ సమాధానం చెప్పరు. న్యాయబద్ధంగా గెలవాల్సిన ఆంధ్ర, ఒరిస్సా ముఖ్యమంత్రులకు ప్రతిపక్ష హోదా కూడా రాకుండా మాయాజాలం జరిగింది. 'మాకు మంచి చేసిన జగన్ ప్రభుత్వానికి వేసిన మా ఓటు ఏమయ్యింద'ని సామాన్య ఓటరు అడుగుతున్నాడు.

ఇదే చంద్రబాబు నాయుడి చేతిలో 1995 లోనూ ప్రజాస్వామ్యం కుప్ప కూలటం చూశాం. కానీ ఏకంగా ఎన్నికల కమిషన్ సాయం అందించి కూటమి గెలుపు కోసం శ్రమించడం ఇప్పుడే చూస్తున్నాం. 'దారులన్నీ పెట్టుబడిదారి యంత్రాల కోరల్లోకే అని అర్థమయ్యాక నా వాదనే నాకు బలహీనంగా అనిపిస్తున్నది' అంటారు కార్ల్ మార్క్స్. ఆధునిక భారత ప్రజాస్వామ్య వ్యవస్థ అధికారం, డబ్బుల మయం అయిన వైనాన్ని కళ్ళారా చూస్తున్నాం. 'గెలవటానికి ఏ అడ్డదారైనా ఫర్వాలేదు, గెలవటమే ప్రధానం. ఎన్ని అవినీతి మార్గాలున్నాయో వాటన్నిటి ద్వారా డబ్బు సంపాదించు, వ్యవస్థల్ని అదుపులో పెట్టుకో' అనే ఎత్తుగడతో



వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి దృశ్యం

చంద్రబాబులాంటి వారు వ్యవహరించారు. వీరి నిఘంటువులో న్యాయం, ధర్మం, మానవత్వం అనేవి లేవు. అబద్ధాలు, అక్రమాలు వీరి ప్రాథమిక సూత్రాలు. గెలుస్తుందన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అడ్డ దారిలో ఓడించారు. గత ఐదేళ్లుగా జగన్ ఏ మంచి చేసినా దానిని ప్రజల్లోకి వెళ్ళనివ్వకుండా గోబెల్స్ ప్రచారాలు సాగిస్తూ, అరాచకాలూ వాళ్ళే చేస్తూ వాటిని జగన్ ప్రభుత్వం మీద రుద్దుతూ వచ్చారు.

కూటమి గెలుపు తర్వాత ఇప్పుడు దానిదైన నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అందులో రెడ్‌బుక్ పాలసీ కూడా ఒకటి. దానిలో భాగంగానే వీళ్ళు చేయబోయే ఆకృత్యాలను ప్రజలకు చేరకుండా ఉండటానికి ముందుగా పచ్చమీడియా తప్ప మిగిలిన అన్ని ఛానెల్స్‌ను బ్యాన్ చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందే వీళ్ళు ప్రేరేపించిన రౌడీమూకలు రాష్ట్రంలో చెలరేగిపోయారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లేసిన... ఓటర్ల దగ్గర నుండి నాయకుల వరకు ఎవ్వరినీ విడిచిపెట్టటం లేదు. ఏకంగా ఈ మూక ఇళ్ళ మీదకు ఎగబడుతూ తమ వ్యతిరేకుల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. కత్తిపోట్లతో ప్రాణాలు తీయటానికి ప్రయత్నిస్తున్నారు. గర్భిణీ స్త్రీలను కొడుతున్నారు. నాయకులను చంపటానికి ప్రయత్నిస్తున్నారు. ఒకప్పటి బిహార్‌లో ఉన్న అరాచకం నేడు ఆంధ్రాలో వర్ధిల్లుతోంది. చివరకు చంద్రబాబు నిరంకుశత్వం ఎంత పరాకాష్ఠకు చేరిందంటే... వైఎస్సార్‌సీపీ ఆఫీసును కోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా ఉత్తర ప్రదేశ్‌లో లాగా పొక్లెయిన్‌లతో తెల్లవారేసరికి కూల్చేశారు. కానీ ఏ వార్తా పచ్చ మీడియా రాయదు. చూపించదు.

ఈ దుర్ఘటనలు దేవుడి మీద నమ్మకం ఉన్న వాళ్ళ నమ్మకాన్నీ పోగొడుతున్నాయి. ఇక్కడ గ్రీకు తత్త్వవేత్త 'ఎపిక్యురస్' అన్న మాటలు... 'పదే పదే దుర్మార్గాలు చేస్తున్న వారిని చూస్తుంటే దేవుడు చెడును ఆపాలనుకుంటున్నా ఆపలేకపోతున్నాడా? అలా అయితే ఈ సృష్టి స్థితిలయలు అతని అదుపులో లేవన్నమాట. సమర్థుడే అనుకుంటే చెడును ఎందుకు నివారించటం లేదు. ఈ పగ, ద్వేషాలను, చెడును ఆపే సామర్థ్యం లేకపోతే ఇక ఎందుకండీ దేవుడు. రక్షకుడనే బిరుదులు?' గుర్తుకొస్తున్నాయి. ఎప్పుడో క్రీస్తుకు పూర్వం అన్న ఈ మాటలు నిజంగా ఆలోచించతగినవే కదా. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని ఒక్కసారి జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి పద్యాల్లో చూద్దాం. పోలిక ఎంత బాగా సరిపోతుందో–

కర్కశ కరాళ కారుమేఘాల నీడలెగురుతున్నవి/ప్రజల నెమ్మొగములందు/క్రౌర్య కౌటిల్య గాఢాంధకార పటలి /క్రమ్ముకున్నది దిగ్దిగంతమ్ములెల్ల

నిజంగానే '**ఏ నిరర్థక నిర్భాగ్య నీరస గళాలు ఎలుగెత్తి వాపోతున్నయ్యో– వెలయవో ప్రాభాతశోభావళుల్** అన్నట్లు నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం సుపరిపాలన అందించిన జగన్ మోహన్ రెడ్డి పునరాగమనం కోసం ఆశతో ఎదురుచూద్దాం.

వ్యాసకర్త మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సతీమణి

ఆధ్యాత్మిక శక్తితో...

ఇవ్వాళ ప్రభుత్వాలూ, సంఘసేవకులూ మహిళా సాధికారత గురించి ఎంతగానో మాట్లాడుతున్నారు. కానీ, దాదాపు 140 సంవత్సరాల క్రితమే శ్రీ రామకృష్ణ పరమహంస స్త్రీ జనోద్ధరణపై దృష్టి పెట్టారు. సాక్షాత్తూ భార్యలోనే కాళీ మాతను దర్శించగలిగిన పరమహంస స్త్రీ జనోద్ధరణకు తన శిష్యులను ప్రోత్సహించారు. ఒకరోజు గౌరీమా అనే భక్తురాలు పువ్వులు సేకరిస్తుండగా గురుదేవులు ఒక నీటికుండతో అక్కడకు వచ్చి ఒక చేత్తో చెట్టుకొమ్మను పట్టుకొని మరో చేత్తో చెట్టుకు నీరు పోస్తూ 'గౌరీ, నేను నీరు పోస్తూ ఉంటే నువ్వు మట్టిని కలుపు' అన్నాడు. అప్పుడామే 'ఇక్కడ బంక మట్టి లేదు. ఎలా మట్టిని కలప గలన'ని పలికింది. ఆ మాట విని గురుదేవులు 'నేను ఏ అర్థంలో చెప్పాను, నువ్వు ఏ రకంగా అర్థం చేసుకొన్నావు? ఈ దేశంలో స్త్రీల పరిస్థితి శోచనీయంగానూ, బాధాకరంగానూ ఉంది. వారికోసం నువ్వు పాటుపడాలి' అన్నారు. అంటే... తాను దేశ స్త్రీల అభివృద్ధికి నడుం బిగించి కృషి ఆరంభిస్తే, గురుదేవులు అందుకు తగిన తోడ్పాటు అందిస్తారన్నమాట అనుకున్నారు గౌరీమా. అప్పుడామె 'కొద్ది మంది బాలికలను నాకు ఇవ్వండి. వారిని హిమాలయాలకు తోడ్కొని వెళ్ళి వారిని సౌశీల్యవంతులుగా తీర్చి దిద్దుతాను' అంది. గురుదేవులు తన తలను అడ్డంగా ఊపుతూ, 'కాదు, కాదు, నువ్వు నగరంలోనే ఉంటూ పని చేయాలి. నువ్వు అనుష్ఠించిన ఆధ్యాత్మిక సాధనలు చాలు. ఆధ్యాత్మిక శక్తితో నువ్వు స్త్రీలను సేవించాలి' అన్నారు.



జ్యోతిర్మయం

గురుదేవుల ఆదేశాన్ని శిరసావహించిన గౌరీమా కలకత్తాలో బాలికల నిమిత్తం ఒక పాఠశాలను స్థాపించి భారతీయ స్త్రీలను విద్యావంతులను గావించడంలోనూ, తద్వారా వారిని ఉద్ధరించడంలోనూ ఎంతో కృషి చేసింది. (పుటలు 248, 249 – శ్రీ రామకృష్ణ లీలామృతం). రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు స్వామి వివేకానందుడు కూడా మహిళా ఉద్ధరణకు ఎంతగానో కృషి చేయడం గమనార్హం.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.పంచమి రా.10.48 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ధనిష్ఠ ప.3.27 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.10.14 నుండి 11.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.37 నుండి 12.29 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

జగనన్న లేఅవుట్ ధ్వంసంపై లోకాయుక్త సీరియస్

పూర్తి స్థాయి విచారణ చేసి 25 రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశాలు



కర్నూలు (సెంట్రల్): నంద్యాల జిల్లా డోన్ మండలం ఓబులాపురం జగనన్న లేఅవుట్‌ను టీడీపీ నాయకులు ధ్వంసం చేయడంపై లోకాయుక్త ఆగ్రహం వ్యక్తం చేసింది. పేదలకు ఇచ్చిన స్థలాల్లోని సరిహద్దు రాళ్లను జేసీబీలు, బుల్డోజర్లతో చదును చేయడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'సాక్షి' పత్రికలో 'జగనన్న లేఅవుట్ ధ్వంసం' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని సుమోటోగా స్వీకరించి విచారణ చేయాలని లోకాయుక్త, ఉపలోకాయుక్త నిర్ణయించాయి. గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 532లో 1.50 ఎకరాల పొలంలో జగనన్న లేఅవుట్ వేసి 65 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. టీడీపీ అధికారంలోకి రావడంతో స్థానిక నాయకులు జగనన్న లేఅవుట్‌ను ధ్వంసం చేసి రాళ్లను తొలగించి చదును చేశారు. ఈ ఘటనపై తహసీల్దార్, ఆర్డీఓలతో పూర్తిస్థాయిలో విచారణ చేయించి 25 రోజుల్లోపు నివేదిక సమర్పించాలని లోకాయుక్త నంద్యాల కలెక్టర్‌ను ఆదేశించింది. విచారణను జూలై 26వ తేదీకి వాయిదా వేసింది.

లారీ ఢీకొని ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం

ఉంగుటూరు: కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు ఫ్లై ఓవర్ వద్ద మంగళవారం తెల్లవారుజామున లారీ ఢీకొని ఇద్దరు డ్రైవర్లు మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం... పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కొండమూడుకు చెందిన డ్రైవర్ పల్లపు దుర్గారావు(40) బొలెరో వ్యాన్‌లో టమాట లోడుతో ఏలూరు వైపు వెళుతున్నాడు. మార్గమధ్యంలో ఉంగుటూరు మండలం ఆత్కూరు ఫ్లై ఓవర్ వద్ద బొలేరో వ్యాన్ టైర్ పంక్చరైంది. దీంతో టైరు మార్చేందుకు అదే మార్గంలో వస్తున్న ఏలూరు జిల్లా కోయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన టాటా ఏస్ డ్రైవర్ పోగుకెట్టి చైతన్య శ్రీసాయి (25)ని ఆయన సాయం కోరాడు. ఇద్దరూ కలిసి టైరు మార్చే ప్రయత్నిస్తుండగా... వెనుక నుంచి వేగంగా వస్తున్న సిమెంట్ లోడు లారీ ఆగి ఉన్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో దుర్గారావు అక్కడికక్కడే మృతిచెందగా, చైతన్య శ్రీసాయి తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

'మాన్సాస్' కౌలు కిరికిరి

ఆనందపురం మండలం బోని గ్రామంలో ట్రస్టుకు 614.97 ఎకరాల భూములు

- అకస్మాత్తుగా గ్రామసభ నిర్వహించిన మాన్సాస్ సిబ్బంది
- జూలై 1 నుంచి మూడ్రోజుల పాటు వేలం ప్రక్రియ ప్రకటన
- నిజానికి.. 18 ఏళ్లకు పైగా కౌలు వసూలుచేయని ట్రస్ట్
- ఇప్పుడు ఏడాదికి రూ.5 వేలు చొప్పున ఇవ్వాలనడంపై రైతుల ఆగ్రహం
- 1956లోనే ట్రస్టులన్నీ రద్దయినందున మాన్సాస్‌కు హక్కులు లేవంటున్న రైతులు



బోని పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన గ్రామసభలో మాన్సాస్ ప్రతినిధులతో రైతుల వాగ్వాదం

తగరపువలస (విశాఖ): అవి ఏడెనిమిది తరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములు.. వాటికి పద్దెనిమిది సంవత్సరాలకు పైగా ఏనాడూ కౌలు వసూలు చేయలేదు.. ఇప్పుడు ఉన్న పళంగా ఎవరికీ చెప్పాపెట్టకుండా గ్రామసభ పెట్టి కౌలు వేలం నిర్వహిస్తామని ఏకపక్షంగా ప్రకటించేశారు. పైగా గతంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు వచ్చి ఇప్పుడు ఆ మాట మార్చేశారు. దీంతో ఆ భూములు సాగుచేసుకుంటున్న రైతులు మండిపడుతున్నారు. ఈ కలవరపాటుకు కారణం విశాఖ జిల్లాలో 'మాన్సాస్' ట్రస్ట్ తాజా వ్యవహారం. విషయం ఏమిటంటే.. ఆనందపురం మండలం బోని పంచాయతీలో మాన్సాస్ ట్రస్ట్‌కు 614.97 ఎకరాల భూములున్నాయి. వీటికి సంబంధించి మూడేళ్ల కాలపరిమితితో జూలై ఒకటి నుంచి మూడో తేదీ వరకు లైసెన్సు హక్కులు నిర్ణయించనున్నారు. బహిరంగ వేలం ద్వారా నిర్ణయించనున్న ఈ ట్రస్ట్ భూములకు సంబంధించి మాన్సాస్ ప్రతినిధులు, ఆనందపురం రెవెన్యూ అధికారులు బోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు. మాన్సాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థల అభివృద్ధికి గాను ఈ కౌలు ద్వారా వచ్చే ఆదాయాన్ని కేటాయిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు రైతులకు తెలిపారు. కొన్నాళ్లుగా రైతులెవరూ కౌలు చెల్లించకపోవడంతో మాన్సాస్ లక్ష్యం దెబ్బతింటోందని దీనికి కౌలు రైతులంతా సహకరించకపోతే తాము మరోదారిలో వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. మాన్సాస్ భూములు కేవలం కౌలుకు మాత్రమేనని విక్రయానికి సాధ్యపడదని రైతులకు తెలిపారు. ఎవరైనా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో వచ్చినా నమ్మవద్దని తెలిపారు. వ్యవసాయానికి అయితే ఏడాదికి ఎకరాకు రూ.5 వేలు.. ఇటుక బట్టీలకైతే ఇంకా ఎక్కువ ధర నిర్ణయించనున్నట్లు మాన్సాస్ ప్రతినిధులు తెలిపారు.

సాగు హక్కులు కావాలంటూ రైతుల పట్టు..

పద్మనాభం మండలం కృష్ణాపురంలో ఇనాం రైతులకు ఇచ్చినట్లే తమకు కూడా మాన్సాస్ సాగు హక్కులు ఇవ్వాలంటూ కౌలు రైతులు పట్టుబట్టారు. గతంలో మాన్సాస్ ప్రతినిధులు రైతులతో వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు వచ్చినట్లు గుర్తుచేశారు. అసలు ఇక్కడి భూముల్లో బంజరు, ఇనాం, మాన్సాస్‌లకు చెందినవి విడివిడిగా చూపించాలన్నారు. స్వాతంత్రానికి పూర్వం నుంచి తమ ఏడెనిమిది తరాల వారు ఈ భూములను సాగు చేసుకుంటున్నట్లు వారంతా గుర్తుచేశారు. నిజానికి.. 18 ఏళ్లకు పైగా మాన్సాస్ ట్రస్ట్ తమ నుంచి కౌలు వసూలు చేయడంలేదని.. అంతకుముందు ఏడాదిలో ఎకరాకు రూ.20 నుంచి రూ.50 కౌలు మించేది కాదన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన తమపై కౌలు పేరుతో చెల్లించలేనంత భారాన్ని మోపితే సహించబోమన్నారు. దీంతో గ్రామసభ మరోమారు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇప్పుడు కౌలు అడగడం సరికాదు..



ముగ్గురు ఆడపిల్లలు, భార్య, నేను కలిసి ఎకరా భూమి సాగుచేసుకుంటున్నాం. మాకు తాతముత్తాతల నుంచి ఈ భూమే ఆధారం. ఇప్పుడొచ్చి ఏడాదికి రూ.5 వేలు కౌలు చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడం సరిగాలేదు.

– కాళ్ల నారాయణ, కౌలు రైతు, బోని గ్రామం

ముందస్తు సమాచారమే లేదు..



ముందుగా సర్పంచ్, ఎంపీటీసీలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. కనీసం పత్రికల్లో ప్రకటన కూడా ఇవ్వలేదు. వాళ్లంతట వాళ్లే కరపత్రాలు ఈరోజు పట్టుకొచ్చి గ్రామసభలో పంచిపెట్టారు. కౌలు రైతులు ఎవరూ ఇందుకు సిద్ధంగా లేరు.

– బోని ముకుంద, కౌలు రైతు, బోని గ్రామం

కౌలు భూములకు కమర్షియల్ ధరలా?



మేం సాగు చేసుకుంటున్న భూములపై సాగు హక్కులు కల్పించాలి. అప్పుడే మా కుటుంబాలకు భద్రత. కౌలు భూములకు కమర్షియల్ ధరలంటూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారు.

– సూరకత్తుల వెంకట్రావు, కౌలు రైతు, బోని గ్రామం

రైతులను వేధిస్తే ఊరుకోం..



1971లో గరీబ్ హటావో ద్వారా ఇందిరాగాంధీ.. 1986లో దున్నేవాడిదే భూమిపై హక్కులు అంటూ ఎన్టీఆర్.. 30 ఏళ్ల సాగులో ఉండేవారికి భూమిపై అన్ని హక్కులు సంక్రమిస్తాయని చెప్పారు. 1956లో ట్రస్టులన్నింటినీ ప్రభుత్వం రద్దుచేసింది. 1958లో పుట్టుకొచ్చిన మాన్సాస్‌పై చాలా కేసులున్నాయి. చాలా ఏళ్ల తరువాత వచ్చి ఇప్పుడు కౌలు కట్టాలని రైతులను వేధిస్తే ఊరుకోం.

– బోని సోంబాబు, కౌలు రైతు, బోని గ్రామం

వన్‌టైం సెటిల్‌మెంట్‌పై మాటమార్చారు..



మా బోని గ్రామ పంచాయతీ ప్రజలంతా అన్ని విధాలుగా వెనుకబడి ఉన్నాం. ప్రభుత్వాలు కల్పిస్తున్న వసతులతో కౌలు భూములు సాగుచేసుకుంటున్నాం. గతంలో మాన్సాస్ ప్రతినిధులు వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు వచ్చారు. ఇప్పుడు కాదంటున్నారు.

– మద్దిల తాతినాయుడు, కౌలు రైతు, బోని గ్రామం

రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమవుతున్న డయేరియా

ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా 634 కేసులు, మూడు మరణాలు నమోదు.. పారిశుద్ధ్యాన్ని పట్టించుకోని అధికారులు



జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు



చెన్నూరు గురుకుల పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్

సాక్షి, అమరావతి/జగ్గయ్యపేట/గూడూరు రూరల్ (తిరుపతి జిల్లా): కలుషిత నీరు, లోపించిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో డయేరియా ముప్పు నానాటికీ అధికమవుతున్నది. జూన్ ఒకటో తేదీ నుంచి 22వ తేదీ మధ్య వివిధ జిల్లాల్లో ఏకంగా 20 డయేరియా ఘటనలు చోటు చేసుకున్నాయి. 634 కేసులు నమోదవ్వగా.. ముగ్గురు మృత్యువాత పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వైద్య శాఖ లెక్కల ప్రకారం కాకినాడ జిల్లా ఎ.వి.నాగారం పీహెచ్‌సీ పరిధిలో 86 కేసులు నమోదవ్వగా ఒకరు మృతి చెందగా, ఇదే జిల్లాలోని వేటపాలెం పీహెచ్‌సీ పరిధిలో 32 కేసులు ఒక మరణం నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతంలో 79 కేసులు, ఒక మరణం సంభవించింది. తాజాగా మంగళవారం నాటికి పట్టణంతో పాటు జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో మరో 11 మంది వాంతులు, విరేచనాలతో ప్రభుత్వాస్పత్రిలో చేరారు. జగ్గయ్యపేట పట్టణంలో డయేరియా కేసులు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో.. మంగళవారం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (రాజమండ్రి) నాగ నరసింహారావు పారిశుద్ధ్య నిర్వహణపై స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సచివాలయాల్లో సిబ్బందికి డ్రెస్ కోడ్ లేకపోవడంతో ఒకరోజు వేతనం కట్ చేయాలని మున్సిపల్ కమిషనర్ నాగ మల్లేశ్వరరావును ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రికి డయేరియా కేసులు వస్తుండడంతో డీఎంహెచ్‌వో సుహాసిని పర్యవేక్షిస్తూ.. అవసరమైతే మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు తరలిస్తున్నారు. అలాగే మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరులోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్ మంగళవారం ఆకస్మికంగా పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఇదిలా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా డయేరియా బారిన పడిన వ్యక్తులు, మృతుల సంఖ్య అనధికారికంగా ఇంకా అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. కాగా, కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరడంతో వివిధ శాఖల అధికారులు మంచి పోస్టింగ్‌లు తెచ్చుకోవడం, ఇప్పటికే ఉన్న పోస్టింగ్‌ల్లో కొనసాగేలా పెద్దలను ప్రసన్నం చేసుకునే పనుల్లో పడ్డారు. దీంతో క్షేత్రస్థాయిలో పాలన గాడి తప్పింది. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం లోపిస్తున్నది. తొలకరి నేపథ్యంలో నదులు, చెరువులు, బావుల్లోని నీరు కలుషితమై అతిసార వ్యాప్తి చోటు చేసుకుంటున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పూర్తిస్థాయిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళికతో అడుగులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీచైతన్య స్కూల్ పుస్తకాల గది సీజ్

పాలకోడేరు: నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారన్న సమాచారంతో శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూలు పుస్తకాల గదిని అధికారులు సీజ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. తల్లిదండ్రుల నుంచి సమాచారం అందుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు వెంటనే స్పందించి సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారి పెన్మత్స వెంకట శివనాగరాజు ఎస్ఎఫ్ఐ నాయకుల సమక్షంలో పాఠశాలను తనిఖీ చేశారు. ఒక గదిలో పాఠ్యపుస్తకాలు ఉన్నట్టు గుర్తించి ఆ గదిని సీజ్ చేశారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశానుసారం శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను తనిఖీ చేయగా పాఠ్యపుస్తకాలను బలవంతంగా విద్యార్థులకు అమ్ముతున్నట్లు, ఇంకా స్టాకు ఒక గదిలో ఉన్నట్లు గుర్తించామన్నారు. పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

చిరుత దాడిలో మహిళ మృతి

శిరివెళ్ల: నంద్యాల జిల్లా, నల్లమల అటవీ ప్రాంతంలోని నంద్యాల–గిద్దలూరు రహదారిపై ఉన్న పచ్చర్లలో మంగళవారం చిరుతపులి దాడిలో షేక్ మెహరున్నీసా (56) మృతి చెందారు. ఏపీ ఎకో టూరిజం వెనుక భాగంలో ఉన్న వక్కిలేరు వాగు వెంట పుల్లలు ఏరుకుంటుండగా చిరుత పులి దాడి చేసింది. మెహరున్నీసా కేకలు విని స్థానికులు అక్కడికి చేరుకోగా అప్పటికే ఆమె తీవ్ర రక్తస్రావంతో మరణించినట్లు గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే రేంజర్ ఈశ్వరయ్య, తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. కొద్ది రోజులుగా పులి సంచరిస్తుందనే సమాచారంతో పట్టుకునేందుకు అటవీ అధికారులు సీసీ కెమెరాలు, బోనులు ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల క్రితం మృతురాలి చెల్లెలు షేక్ బీబీపై కూడా పులి దాడి చేయగా ఆమె తప్పించుకుంది.

ఏసీబీకి చిక్కిన విద్యుత్‌శాఖ ఏఈ

రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



విద్యుత్‌శాఖ ఏఈ శివశంకర్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఎల్‌టీ విద్యుత్ సర్వీసు కనెక్షన్ ఇచ్చేందుకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ విద్యుత్‌శాఖ ఏఈ శివశంకర్ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. ఏసీబీ అధికారుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్‌లోని అంబాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శివశంకర్ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)గా మూడేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. ఓగూరుపాడు ప్రాంతంలో హరిప్రసాద్ అనే వ్యక్తి ఓ ప్రైవేట్ లేఅవుట్‌లో స్థలం కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో ఎల్‌టీ విద్యుత్ సర్వీసు కనెక్షన్ కోసం హరిప్రసాద్ ఏఈ శివశంకర్‌ను సంప్రదించాడు. ఎల్‌టీ విద్యుత్ సర్వీసు కనెక్షన్ ఇవ్వాలంటే ముందుగా 11 కేవీ ఎల్‌టీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని, అందుకు రెండు నుంచి నాలుగు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఏఈ వివరించారు. ఇందుకు రూ.లక్షల్లో నగదు ఏపీఎస్పీడీసీఎల్‌కు చెల్లించాల్సి ఉంటుందని హరిప్రసాద్‌కు ఏఈ చెప్పడంతో అయితే అంత చెల్లించలేనని తెలపడంతో రూ.80 వేలు లంచం తనకు ఇస్తే పని పూర్తవుతుందని ఏఈ డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో రూ. 50 వేలకు డీల్ కుదిరింది. హరిప్రసాద్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ సూచనలతో మంగళవారం ఏఈ శివశంకర్ తన కార్యాలయంలో ఉండగా రూ.50 వేలను హరిప్రసాద్ అందజేశాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా ఏఈ శివశంకర్‌ను పట్టుకున్నారు.

ముంచేసిన 'మై క్వీన్'

- ప్రకాశం జిల్లాలో మనీ సర్క్యులేషన్ స్కీమ్
- ప్రైవేటు ఉపాధ్యాయులు, చిరు వ్యాపారులే లక్ష్యం
- రూ.100 కడితే రూ.700 చెల్లిస్తామంటూ బడా మోసం
- నాలుగైదు రోజుల నుంచి చెల్లింపులు నిలిపివేత



మార్కాపురం: ప్రకాశం జిల్లా మార్కాపురంలో మనీ సర్క్యులేషన్ స్కీమ్ ముంచేసింది. ఒక్క రూపాయి కడితే ఏడు రూపాయలు, రూ.100 కడితే రూ.700 చెల్లిస్తామంటూ వల విసిరి బాధితులకు శఠగోపం పెట్టింది. ప్రైవేటు ఉపాధ్యాయులు, యువత, చిరు వ్యాపారులు, సాధారణ ప్రజలు భారీ ఆదాయం వస్తుందనే ఆశతో ఈ మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. మొదట్లో వారికి బాగానే డబ్బులు వచ్చాయి. అయితే నాలుగు రోజుల నుంచి కొంతమందికి డబ్బులు రాకపోవడంతో విషయం బయటకు వచ్చింది. ఈ మనీ సర్క్యులేషన్ స్కీమ్ యజమాని ఎక్కడుంటాడో తెలీదు.. చెన్నై కేంద్రంగా అంతా కేవలం ఆన్‌లైన్ ద్వారానే నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో ఒక్క మార్కాపురంలోనే కాకుండా పెద్దారవీడు, తర్లుపాడు, పెద్ద దోర్నాల, త్రిపురాంతకం, యర్రగొండపాలెం తదితర మండలాలకు కూడా ఈ చైన్ లింకు స్కీమ్ విస్తరించినట్టు సమాచారం.

మై క్వీన్ యాప్ లింక్ పంపి..

ఒక్క రూపాయి కడితే మరుసటి రోజు రూ.7 అకౌంట్లో జమయ్యేలా మనీ సర్క్యులేషన్ స్కీమ్‌ను రూపొందించారు. ఈ చైన్ సిస్టమ్‌లో భాగంగా మొదట డబ్బులు చెల్లించిన వ్యక్తికి 'మై క్వీన్' యాప్ లింక్ పంపుతారు. ఆ వ్యక్తి మరో కొంత మందిని చేర్పిస్తే వారికి కూడా లింక్‌ను షేర్ చేస్తారు. ఇందులో బ్యాంక్ అకౌంట్ వివరాలు అప్‌లోడ్ చేయాలి. రూ.100 ఈ రోజు చెల్లిస్తే 24 గంటలు గడిచాక నగదు చెల్లించిన వ్యక్తి ఖాతాలో రూ.700 జమవుతాయి. దీంతో 24 గంటల్లోనే తాము కట్టిన దానికి 7 రెట్లు ఆదాయం రావడంతో ఈ యాప్ పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారు. దీంతో ఒక్క మార్కాపురం పట్టణంలోనే 8 నుంచి 10 వేల మంది సభ్యులుగా చేరి సుమారు రూ.5 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టినట్టు తెలిసింది. గతంలో ఇలాంటి స్కీమ్‌ల విషయంలో మోసపోయినా ప్రజలు లెక్కచేయడం లేదు. త్వరగా డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ మై క్వీన్ యాప్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. నెల రోజుల్లోనే లక్షాధికారులు కావాలనే దురాశ వారిని తెగించేలా చేస్తోంది. ఈ క్రమంలో కొంతమందికి కొన్ని రోజుల నుంచి నగదు చెల్లింపులు కావడంలేదని తెలుస్తోంది. ఈ విషయమై మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఇప్పటివరకూ ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ప్రజలెవరూ ఇలాంటి మనీ సర్క్యులేషన్ స్కీమ్‌ల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని హెచ్చరించారు.

వరసిద్ధుని సేవలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి



కాణిపాకం ఆలయంలో కుటుంబ సభ్యులతో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సురేంద్రగుప్త

కాణిపాకం(చిత్తూరు జిల్లా): కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని మంగళవారం సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సురేంద్ర గుప్త కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సిబ్బంది వాసు, విఘ్నేష్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు





తిరుమల ఆలయం వెలుపల గాయని పి.సుశీల, సినీనటి శ్రీలీల

తిరుమల: తిరుమల శ్రీవారిని సినీనటి శ్రీలీల, సంగీత దర్శకుడు తమన్, గాయకుడు కార్తీక్, గాయని పి.సుశీల మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

షరీఫ్ పుస్తకానికి విశాలాక్షి సాహిత్య పురస్కారం

- 2024 సంవత్సరానికి 'టీవీ ప్రకటనల్లో భాష' పుస్తకం ఎంపిక
- ఈ నెల 30న నెల్లూరులో పురస్కారం, నగదు బహుమతి ప్రదానం



రచయిత వేంపల్లి షరీఫ్

విజయవాడ కల్చరల్: వైఎస్సార్ జిల్లా వేంపల్లికి చెందిన కవి, రచయిత, పరిశోధకుడు షరీఫ్ రచించిన 'టీవీ ప్రకటనల్లో భాష' పుస్తకం 2024 సంవత్సరానికి గానూ విశాలాక్షి సాహిత్య పురస్కారానికి ఎంపికైంది. ఈ విషయాన్ని మంగళవారం ఓ ప్రకటనలో షరీఫ్ తెలిపారు. ఈ నెల 30వ తేదీన నెల్లూరులో జరిగే విశాలాక్షి 15వ వార్షికోత్సవంలో విశాలాక్షి సాహిత్య పురస్కారంతో పాటు నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకుల నుంచి సమాచారం అందినట్లు పేర్కొన్నారు. మనకు తెలియకుండానే మనపై ప్రభావం చూపి, మన అలవాట్లు అభిరుచుల్లో మార్పులు తెచ్చే శక్తి ప్రకటనలకు ఉంటుందని తెలిపారు. ఈ పుస్తకం ఇప్పటికే అనేక విశ్వవిద్యాలయాల్లో తెలుగు జర్నలిజం, ఎంబీఏ విద్యార్థులకు రిఫరెన్స్ పుస్తకంగా ఉందని పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు. కాగా, షరీఫ్ రచించిన కథలు కొన్ని భారతీయ భాషల్లోకి అనువాదం అయ్యాయి. జుమ్మా కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. గిడుగు రామ్మూర్తి పంతులు భాషా పురస్కారంతోపాటు 20పైగా పురస్కారాలను అందుకున్నారు. షరీఫ్ పుస్తకం విశాలాక్షి సాహిత్య పురస్కారానికి ఎంపికైన సందర్భంగా నగరానికి చెందిన పలు సాహిత్య సంస్థలు ఆయనను అభినందించాయి.

పలు రైళ్ల పునరుద్ధరణ

నర్సాపూర్–బెంగళూరు ప్రత్యేక రైలు పొడిగింపు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్‌లోని చాగల్లు–రాజమండ్రి సెక్షన్‌లో జరుగుతున్న ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా ఇటీవల రద్దు చేసిన పలు రైళ్లను పునరుద్ధరించనున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్వో నుస్రత్ మండ్రుప్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పునరుద్ధరించిన రైళ్లు..

రాజమండ్రి–విశాఖపట్నం (07466/07467), విజయవాడ–కాకినాడ పోర్టు (17257/17258), మచిలీపట్నం–విశాఖపట్నం (17219), గుంటూరు–విశాఖపట్నం (17239), గుంటూరు–విశాఖపట్నం (22702/22701), తిరుపతి–విశాఖపట్నం (22708/22707) రైళ్లు సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 15 వరకు పునరుద్ధరించారు. అదే విధంగా విశాఖపట్నం–మచిలీపట్నం (17220), విశాఖపట్నం–గుంటూరు (17240) రైళ్లను సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు పునరుద్ధరించారు.

నర్సాపూర్–బెంగళూరు పొడిగింపు..

ఇటీవల నర్సాపూర్–బెంగళూరు మధ్య ప్రవేశపెట్టిన ప్రత్యేక వారాంతపు రైలును ప్రయాణికుల డిమాండ్ మేరకు పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. నర్సాపూర్–బెంగళూరు (07153) ప్రత్యేక రైలు ఈ నెల 28 నుంచి ఆగస్టు 9 వరకు (ప్రతి శుక్రవారం), బెంగళూరు–నర్సాపూర్ (07154) ప్రత్యేక రైలు జూలై 6 నుంచి ఆగస్టు 10 వరకు (ప్రతి ఆదివారం) నడవనున్నట్లు అధికారులు తెలిపారు.

EDUCATION
■ B.Sc. DIGITAL FORENSICS / AI & ML / BIG DATA ANALYTICS; AGRICULTURE; BBA-AVIATION; B.VOC. DAIRYING & AH(Vet.Course)-LOYOLA-VJA.77999 34688.
[V- 2611]

దక్షిణ మధ్య రైల్వే
టెండరు ప్రకటన నం.G/E.29/Tr/ Tender Notice/07/2024-25
PUB/0611
దిగువ తెలిపిన పనుల కోసం భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ట్రాక్షన్/ గుంతకల్ వారు ఇ–టెండర్లు కోరుతున్నారు.
టెండర్ నం.:– GTL-TRD-29-eTN-11-2024-25, పని పేరు: గుంతకల్ డివిజన్: (i) DMM-PAK సెక్షన్‌లో కాలసముద్రం మరియు కదిరి స్టేషన్ల మధ్య రైల్వే km 62/3-4 వద్ద 2 లేన్ల ROB ప్రతిపాదిత నిర్మాణం (ii) ములకలచెరువు – తుమ్మనగుంట స్టేషన్ల మధ్య km 109/5-6 వద్ద LC No.67 స్థానంలో 60m బౌస్ట్రింగ్ గర్డర్ యొక్క 2 లేన్ల ROB మరియు సబ్‌వే (5.5x3.5) ప్రతిపాదిత నిర్మాణం (iii) DMM-PAK సెక్షన్‌లో ముదిగుబ్బ మరియు ములకవేముల స్టేషన్ల మధ్య రైల్వే km 37/11-12 వద్ద 2 లేన్ల ROB ప్రతిపాదిత నిర్మాణం (iv) DMM-PAK సెక్షన్‌లో మదనపల్లె నుండి పీలేరు వరకు నాలుగు లేన్ల ROB ప్రతిపాదిత నిర్మాణానికి సంబంధించి OHE కు మోడిఫికేషన్ పనులు–OHE మోడిఫికేషన్ పనులు. సుమారు విలువ: రూ. 41,14,482/– బయానా: రూ. 82,300/–
ముగింపు తేది మరియు సమయం: 17-07-2024న 15.00 గం.
గమనిక: 1.టెండరుదారులు టెండర్ డాక్యుమెంట్‌ను www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
టెండరుకు బిడ్ వేయుట మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in కు లాగిన్ కావలెను. ఏదేని సవరణ ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్, గుంతకల్

టెండరు నోటీసు నం. CRS-E-18-24-25
PUB/0612
దిగువ తెలిపిన పనుల కోసం భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్న ADEE/CRS/TPTY వారు ఇ–టెండర్లు కోరుతున్నారు. ముగింపు తేది: దిగువ తెలిపిన విధంగా 15.00 గం. వరకు. బిడ్డర్లు తమ ఒరిజినల్/సవరించిన బిడ్లను ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే దాఖలు చేయవలెను. ఈ టెండరుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అందిన ఏదేని అట్టి మాన్యువల్ ఆఫర్ తిరస్కరించబడును.
క్ర.సం.–1. పని పేరు: టెండరు నం. CRS-E-18-24-25. క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతిలో స్టోర్స్ బిల్డింగ్ రీ-ఆర్గనైజేషన్ కోసం విద్యుత్ నదుపాయాలు. సుమారు వ్యయం: రూ. 14,43,493/– బిడ్ సెక్యూరిటీ: రూ. 28,900/– పూర్తిచేయు కాలము: 30 రోజులు. ముగింపు తేది: 16.07.2024న 15.00 గం.
వెబ్‌సైట్ వివరాలు: – www.ireps.gov.in
టెండరు పూర్తి వివరాలు చూసేందుకు నోటీస్ బోర్డ్ గల ప్రదేశము: అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కార్యాలయం, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి
అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, CRS, తిరుపతి

ఇ-టెండరు ప్రకటన నం.G/C.206/GCT/ EGU/2024-25 Dt. 25th June 2024
PUB/0613
35 సంవత్సరాల కాలానికి ఇరనగల్లు స్టేషన్ వద్ద పూర్తిగా రైల్వే భూమిపై గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టర్మినల్ (GCT) అభివృద్ధి చేయుట కొరకు భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంతకల్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే వారు https://www.ireps.gov.in ద్వారా ఇ–టెండరు కోరుతున్నారు.
ఇరనగల్లు స్టేషన్ వద్ద పూర్తిగా రైల్వేభూమిపై గతిశక్తి మల్టీమోడల్ కార్గో టర్మినల్ (GCT) అభివృద్ధి చేయుట. (రెండు ప్యాకెట్ల టెండరు విధానం)
టెండరు ప్రకటన నం.02-2024-EGU-GCT, పని పేరు: 35 సంవత్సరాల కాలానికి మెయింటెనెన్స్ మరియు పూర్తిగా రైల్వే భూమిపై ఇరనగల్లు స్టేషన్ వద్ద గతిశక్తి మల్టీ-మోడల్ కార్గో టర్మినల్ (GCT) అభివృద్ధి చేయుట కొరకు కాంట్రాక్ట్. సవివరమైన అంచనా వ్యయం: రూ. 19,45,00,459/– బయానా: రూ. 1,94,50,100/–
టెండరు డాక్యుమెంట్‌ను టెండరుదార్లు http://www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండరుదారు/ బిడ్డర్లు క్లాస్ III డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి మరియు IREPS పోర్టల్‌పై తప్పనిసరిగా నమోదు కావాలి. నమోదైన టెండరుదారు/ బిడ్డర్లు మాత్రమే ఇ–టెండరింగ్‌లో పాల్గొనగలరు. అన్ని సంబంధిత పేపర్లను ఇ–టెండరింగ్‌లో పాల్గొనే సమయంలో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. మాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు. బయానాను నెట్‌బ్యాంకింగ్ లేదా పేమెంట్ గేట్‌వే ద్వారా ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలి.
గమనిక: టెండరుదారు డిజిటల్ సర్టిఫికెట్‌తో తగువిధంగా సంతకం చేసి సరిగ్గా పూర్తిచేసిన టెండరు ఫారాన్ని అప్‌లోడ్ చేయాలి.
ముఖ్యమైన తేదీలు:
బిడ్డింగ్ ప్రారంభ తేది: 02-07-2024, టెండర్ల ముగింపు: 16-07-2024న 15.00 గం. టెండర్లు తెరుచుట: 16-07-2024న 15.30 గం.
టెండరు కోరుతున్న అధికారి: సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం గుంతకల్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్ – 515801
తదుపరి వివరాల కొరకు బిడ్డర్లు ఏ పనిరోజునైనా దిగువ సంతకందారు కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. నోటిఫికేషన్ వెబ్‌సైట్ http://ireps.gov.in పై అప్‌లోడ్ చేయబడినది.
సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంతకల్
A0777
తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి, చీఫ్ ఇంజినీర్ ఆఫీస్
ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.04/D3/CE/TTD/2024-25 Dt:24/06/2024
TTD ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో నూట ఏడు (107) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి. SE-II, NIT నం.:41 నుండి 42/SE-II/2024-25 (2 పనులు). EE-II, NIT నం.:34 నుండి 47/EE-II/2024-25 (14 పనులు). EE-V, NIT నం.:45/EE-V/2024-25 (1 పని). EE-VI, NIT నం.:16 నుండి 25/EE-VI/2024-25 (10 పనులు). EE-VII, NIT నం.:10 నుండి 14/EE-VII/2024-25 (5 పనులు). EE-XI, NIT నం.:16 నుండి 18/EE-XI/2024-25 (3 పనులు). EE-XII, NIT నం.:52 నుండి 63/EE-XII/2024-25 (12 పనులు). EE-XIV, NIT నం.:49 నుండి 67/EE-XIV/2024-25 (19 పనులు). DE(Elec)-I, NIT నం.: 40 నుండి 48/DE(Elec)-I/2024-25 (9 పనులు). DE(Elec)-II, NIT నం.:52 నుండి 69/DE(Elec)-II/2024-25 (18 పనులు). DE(Elec)-TML, NIT నం.:79 నుండి 92/DE(Elec)-TML/2024-25 (14 పనులు). వివరాల కోసం www.tirumala.org కి లాగిన్ చేయండి మరియు పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.in కు లాగిన్ చేయండి.
TTD-40021(31)/1/2024-PRO SEC (Adv.No.44) Dt:25.06.2024 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

అసాంజ్‌కు ఎట్టకేలకు స్వేచ్ఛ!


లండన్ నుంచి విమానంలో మరియానా ద్వీపానికి బయలుదేరిన అసాంజ్

- నేరాంగీకారానికి అమెరికాతో ఒప్పందం
- బ్రిటన్ జైలు నుంచి విడుదలైన వికీలీక్స్ వ్యవస్థాపకుడు
- నేడు అమెరికా అధీనంలోని మరియానా ద్వీపంలో కోర్టు ముందుకు
- శిక్ష నుంచి మినహాయింపు, ఆ వెంటనే విడుదల!
- తర్వాత నేరుగా స్వదేశం ఆస్ట్రేలియాకు

వాషింగ్టన్: వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజ్‌కు ఎట్టకేలకు విముక్తి లభించనుంది. ఆయనను అమెరికాకు అప్పగించే విషయంపై బ్రిటన్ కోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఐదేళ్లుగా బ్రిటన్లో ఆయన జైలు జీవితం అనుభవిస్తున్నారు. అమెరికా న్యాయ విభాగంతో నేరాంగీకార ఒప్పందం కుదుర్చుకోవడంతో అసాంజ్ విడుదలకు మార్గం సుగమమయ్యింది. దాని ప్రకారం అమెరికా కోర్టులో విచారణకు హాజరయ్యేందుకు యూకే జైలు నుంచి ఆయన మంగళవారం ఉదయం విడుదలయ్యారు. చార్టర్డ్ విమానంలో ఉత్తర మరియానా ఐలాండ్స్‌లోని సైపన్ ద్వీపానికి బయల్దేరారు. అక్కడి అమెరికా ఫెడరల్ కోర్టులో బుధవారం ఉదయం (స్థానిక కాలమానం ప్రకారం) విచారణకు హాజరవుతారు. అమెరికా వెళ్లడానికి అసాంజ్ నిరాకరించడంతో ఆస్ట్రేలియా సమీపంలో అమెరికా అధీనంలో ఉండే ఈ ప్రాంతంలో విచారణ చేపడుతున్నారు. కోర్టుకు సమర్పించిన పత్రాల ప్రకారం... గూఢచర్య చట్టాన్ని అతిక్రమిస్తూ జాతీయ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పొందడం, వ్యాప్తి చేయడం వంటి ఆరోపణలను అసాంజ్ అంగీకరించనున్నట్లు సమాచారం. ఆయనపై మోపిన 18 అభియోగాలను కలిపి ఒకే కేసుగా విచారించనున్నట్లు తెలుస్తోంది. అసాంజ్ నేరాంగీకార వాంగ్మూలాన్ని న్యాయమూర్తి ఆమోదించాల్సి ఉంటుంది. అనంతరం ఆయనకు శిక్ష ఖరారు చేస్తారు. ఇప్పటికే బ్రిటన్‌లో అనుభవించిన ఐదేళ్ల శిక్షతో సరిపెట్టి విడుదల చేస్తారని సమాచారం. అదే జరిగితే ఆ వెంటనే అసాంజ్ నేరుగా స్వదేశం ఆస్ట్రేలియాకు వెళ్లనున్నారు.

ధ్రువీకరించిన వికీలీక్స్



అసాంజ్ విడుదలను వికీలీక్స్ సంస్థ ధ్రువీకరించింది. ఈ మేరకు సామాజిక వేదిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. "1,901 రోజుల జైలు జీవితం అనంతరం ఆయన జూన్ 24న విడుదలయ్యారు. అసాంజ్ విడుదల కోసం ప్రపంచవ్యాప్తంగా మద్దతిచ్చినవారికి కృతజ్ఞతలు" అని తెలిపింది.

ఇదీ నేపథ్యం

ఇరాక్, అఫ్గానిస్తాన్ తదితర చోట్ల అమెరికా సైన్యం పాల్పడ్డ తప్పిదాలు, చేపట్టిన తప్పుడు చర్యలకు సంబంధించిన లక్షలాది రహస్య పత్రాలను లీక్ చేసి అసాంజ్ సంచలనం సృష్టించడం తెలిసిందే. దాంతో ఆయన పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగింది. అసాంజ్ స్థాపించిన వికీలీక్స్ అమెరికా రక్షణ రంగ రహస్య పత్రాలెన్నింటినో విడుదల చేసింది. బాగ్దాద్‌పై 2010లో అమెరికా వైమానిక దాడిలో ఇద్దరు రాయిటర్ జర్నలిస్టులతో పాటు సామాన్యులు మృతి చెందిన వీడియో వంటివి వీటిలో ఉన్నాయి. అఫ్గాన్ యుద్ధానికి సంబంధించి 91,000కు పైగా పత్రాలనూ వికీలీక్స్ విడుదల చేసింది. తర్వాత ఇరాక్ యుద్ధాన్ని వివరించే 4,00,000 రహస్య సైనిక ఫైళ్లను విడుదల చేసింది. ఈ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపడంతో అసాంజ్‌పై అమెరికా తీవ్ర అభియోగాలు మోపింది. మరోవైపు లైంగిక నేరాల ఆరోపణలపై అసాంజ్ అరెస్టుకు స్వీడన్ కోర్టు 2010 నవంబర్‌లో ఆదేశించింది. ఆ ఆరోపణలను ఆయన ఖండించారు.

అరెస్టు... ఆశ్రయం జైలు

అసాంజ్ 2010 అక్టోబర్‌లో బ్రిటన్‌లో అరెస్టయ్యారు. తర్వాత బెయిలుపై విడుదలయ్యారు. అయితే ఆయన్ను స్వీడన్‌కు అప్పగించాలని 2011 ఫిబ్రవరిలో లండన్ కోర్టు ఆదేశించింది. దీనిపై బ్రిటన్ సుప్రీం కోర్టులో అప్పీలు చేసినా లాభం లేకపోయింది. దాంతో అసాంజ్ కొంతకాలం లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో రాజకీయ ఆశ్రయం పొందారు. 2019 ఏప్రిల్‌లో ఆ ఆశ్రయం రద్దయింది. అనంతరం బ్రిటన్ కోర్టు ఆయనకు 50 వారాల జైలు శిక్ష విధించింది. అమెరికాకు అప్పగింతపై విచారణ పెండింగ్‌లో ఉండటంతో శిక్ష పూర్తయ్యాక కూడా జైలులోనే ఉన్నారు. అసాంజ్ ఆత్మహత్య చేసుకునే ప్రమాదమున్నందున అమెరికాకు అప్పగించడం కుదరదని బ్రిటన్ కోర్టు 2021లో చెప్పింది.

ఉత్కంఠగా ఉంది భార్య

అసాంజ్ భార్య స్టెల్లా ఆస్ట్రేలియాలో మీడియాతో మాట్లాడారు. భర్త రాక కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నట్టు చెప్పారు. న్యాయవాది అయిన ఆమె అసాంజ్‌ను 2022లో ఆయన జైల్లో ఉండగానే పెళ్లాడారు. అసాంజ్ చార్టర్డ్ విమాన ప్రయాణ ఖర్చు 5 లక్షల డాలర్లని ఆయన అభిమానులు తెలిపారు. ఆ మొత్తాన్ని సేకరించడానికి ఫండ్ రైజింగ్ ప్రచారం మొదలుపెట్టామన్నారు.


చరిత్ర సృష్టించిన చాంగ్‌యీ–6


ఇన్నర్ మంగోలియాలో ల్యాండైన చాంగ్‌యీ–6 మాడ్యూల్

జాబిల్లి అవతలివైపు మట్టి సేకరణ

బీజింగ్: చైనా జాతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(సీఎన్ఎస్ఏ) సరికొత్త చరిత్ర సృష్టించింది. చందమామపై మనకు కనిపించని అవతలివైపు భాగం నుంచి మట్టి నమూనాలను విజయవంతంగా భూమిపైకి తీసుకొచ్చింది. చైనా ప్రయోగించిన లూనార్ ప్రోబ్ మాడ్యూల్ చాంగ్‌యీ–6 జాబిల్లి నుంచి మట్టిని మోసుకొని స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 2.07 గంటల సమయంలో ఉత్తర చైనాలోని ఇన్నర్ మంగోలియా ప్రాంతంలో క్షేమంగా దిగింది. చంద్రుడి అవతలి వైపు భాగంలోని మట్టిని భూమిపైకి సురక్షితంగా చేర్చిన మొట్టమొదటి దేశంగా చైనా రికార్డుకెక్కింది. చైనా అంతరిక్ష ప్రయోగాల్లో ఇదొక మైలురాయి అని నిపుణులు చెబుతున్నారు. చాంగ్‌యీ–6 మిషన్ పూర్తిస్థాయిలో విజయవంతమైందని సీఎన్ఎస్ఏ ప్రకటించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల చైనా అధినేత షీ జిన్‌పింగ్ హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్ష పరిశోధకులకు అభినందనలు తెలిపారు. చాంగ్‌యీ–6 వ్యోమనౌక ఈ ఏడాది మార్చి 3న జాబిల్లి దిశగా తన ప్రస్థానం ప్రారంభించింది. ఇందులో అర్బిటార్, ల్యాండర్, అసెండర్, రిటర్నర్ అనే భాగాలు ఉన్నాయి. 53 రోజుల పాటు అవిశ్రాంతంగా ప్రయాణం సాగించి, జూన్ 2న చందమామ దక్షిణ ధ్రువంలోని సౌత్‌పోల్–అయిట్‌కెన్(ఎస్‌పీఏ) ప్రాంతంలో సురక్షితంగా దిగింది. రోబోటిక్ హస్తం సాయంతో రెండు రోజులపాటు మట్టి నమూనాలను సేకరించిన అసెండర్ జూన్ 4న తిరుగు ప్రయాణం మొదలుపెట్టింది. జూన్ 6న భూకక్ష్యలోకి ప్రవేశించింది. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న ఆర్బిటార్–రిటర్నర్‌కు మట్టి నమూనాలను బదిలీ చేసింది. భూమిపై అడుగుపెట్టడానికి తగిన సమయం కోసం వేచి చూస్తూ ఆర్బిటార్–రిటర్నర్ 13 రోజుల పాటు కక్ష్యలోనే చక్కర్లు కొట్టింది. ఎట్టకేలకు మంగళవారం భూమిపైకి క్షేమంగా చేరుకుంది. అరుదైన మట్టి నమూనాలను తీసుకొచ్చింది. వీటిలో వేల ఏళ్ల నాటి అగ్నిపర్వత శిలలు కూడా ఉండొచ్చని సైంటిస్టులు అంచనా వేస్తున్నారు. అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికాకు దీటుగా చైనా దూసుకెళ్తోంది. 2030 నాటికి చంద్రుడిపైకి మనుషులను పంపించబోతున్నామని గతంలోనే ప్రకటించింది.





రాజ్యాంగం చేతబూని ఎంపీగా ప్రమాణం

'జైహింద్, జై సంవిధాన్' అని నినదించిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ ప్రత్యేక సమావేశాల్లో రెండో రోజు మంగళవారం పలు పార్టీల సభ్యులు ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ సభ్యుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు అఖిలేశ్ యాదవ్, డింపుల్ యాదవ్, బీజేపీ సభ్యుడు ఓం బిర్లా, బీజేపీ సభ్యురాలు హేమామాలిని, డీఎంకే నేత కనిమొళి, కేంద్ర మంత్రులు నారాయణ్ రాణే, ఎన్సీపీ(ఎస్పీ) నేత సుప్రియా సూలే, శివసేన(ఉద్ధవ్) సభ్యుడు అరవింద్ సావంత్ తదితరులు లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేశారు. రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ సహా పలువు ప్రతిపక్ష సభ్యులు రాజ్యాంగ ప్రతిని చేతబూని ప్రమాణం చేయడం విశేషం. ప్రమాణ స్వీకారం అనంతరం రాహుల్ గాంధీ 'జైహింద్, జై సంవిధాన్' అంటూ నినదించారు. స్వతంత్ర సభ్యుడు రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ 'నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి' అని రాసి ఉన్న టి–షర్టును ధరించి ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆజాద్ సమాజ్ పార్టీ(కాన్షీరామ్) ఎంపీ చంద్రశేఖర్ ప్రమాణం చేసిన తర్వాత 'జైభీమ్, జైభారత్, జై సంవిధాన్, జైమండల్, జైజోహార్, జైజవాన్, జైకిసాన్' అని నినాదాలు చేశారు.

విపక్షనేతగా రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యవహరించనున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో మంగళవారం రాత్రి జరిగిన ఇండియా కూటమి పక్ష నేతల సమావేశం అనంతరం రాహుల్‌ను విపక్ష నాయకుడిగా నియమించాలనే నిర్ణయం జరిగింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీ లోక్‌సభలో రాహుల్ గాంధీని ప్రతిపక్ష నాయకుడిగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఒక లేఖ ద్వారా ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్‌కు తెలియజేశారని కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఇతర నియామకాలపై తర్వాత నిర్ణయం జరుగుతుందన్నారు. రాహుల్ ఐదోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 18వ లోక్‌సభలో 98 మంది ఎంపీలతో కాంగ్రెస్ అతిపెద్ద విపక్ష పార్టీగా నిలిచింది. పదేళ్ల విరామం తర్వాత ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. కాంగ్రెస్‌కు నిర్ణీత 10 శాతం ఎంపీల బలం లేకపోవడంతో 2014, 2019లలో ప్రతిపక్ష హోదా దక్కలేదు. కాగా స్పీకర్ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ తమను సంప్రదించలేదన్న తృణమూల్ మంగళవారం రాత్రి ఖర్గే నివాసంలో జరిగిన ఇండియా కూటమి భేటీకి హాజరైంది.

ఇక సీబీఐ వంతు!

నేడు కేజ్రీవాల్ మళ్లీ అరెస్టు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను బుధవారం సీబీఐ అరెస్టు చేసే అవకాశం కన్పిస్తోంది. సీబీఐ వర్గాలు మంగళవారం తిహార్ జైల్లో ఆయనను విచారించి వాంగ్మూలం నమోదు చేసుకున్నాయి. బుధవారం ట్రయల్ కోర్టులో ప్రవేశపెట్టనున్నాయి. ఈ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై సుప్రీం కోర్టులో గురువారం విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో సీబీఐ చర్య ప్రధాని మోదీ కక్ష సాధింపులో భాగమేనని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. అందుకే కేజ్రీవాల్‌ను తప్పుడు కేసులో ఇరికించారన్నారు.

ఢిల్లీ హైకోర్టులో నిరాశే

మనీ లాండరింగ్ కేసులో బెయిల్ విషయంలో కేజ్రీవాల్‌కు మళ్లీ నిరాశే ఎదురయ్యింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన రెగ్యులర్ బెయిల్‌పై మధ్యంతర స్టే ఎత్తివేతకు ఢిల్లీ హైకోర్టు మంగళవారం నిరాకరించింది. ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరును సవాలు చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. వాదనలకు ఈడీకి ట్రయల్ కోర్టు సమయమివ్వలేదని ఆక్షేపించింది. కేజ్రీవాల్ ప్రమేయంపై సమర్పించిన పత్రాలను, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకోవడంలో, క్షుణ్నంగా పరిశీలించడంలో విఫలమైందని స్పష్టంచేసింది. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరుపై పూర్తిస్థాయిలో వాదనలు వినిపించడానికి ఈడీకి తగిన సమయమిచ్చి ఉండాల్సిందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బెయిల్ ఉత్తర్వుపై స్టేను రద్దు చేయడం లేదని తేల్చిచెప్పారు. కేజ్రీవాల్‌కు ఈ నెల 20న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ ఈడీ ఆ మర్నాడే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దాంతో బెయిల్‌పై మధ్యంతర స్టే విధిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పటికీ ఊరట దక్కలేదు. దాంతో ఆయన కనీసం మరిన్ని రోజుల పాటు తిహార్ జైలులో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రాజ్యాంగంపై ప్రేమను వ్యక్తీకరించే హక్కు మీకు లేదు

కాంగ్రెస్ నేతలపై ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం

న్యూఢిల్లీ: దేశ ప్రజలపై బలవంతంగా అత్యవసర పరిస్థితిని రుద్దినవారికి రాజ్యాంగం పట్ల ప్రేమను ప్రకటించే హక్కు లేదని ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి 49 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ మంగళవారం 'ఎక్స్'లో పలు పోస్టులు చేశారు. ప్రజల ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛను కాంగ్రెస్ సర్కారు కాలరాసిందని మండిపడ్డారు. దేశ ప్రజలంతా గౌరవించే రాజ్యాంగాన్ని అగౌరవపర్చిందని ధ్వజమెత్తారు. అప్పటి చీకటి రోజులు ఇప్పటికీ ప్రజల మదిలో సజీవంగా ఉన్నాయని పేర్కొన్నారు. "దేశంలో ఎమర్జెన్సీ విధించిన పార్టీ నాయకులే ఎన్నో సందర్భాల్లో ఆర్టికల్ 356 ప్రయోగించారు. పత్రికా స్వేచ్ఛను హరించేలా బిల్లులు తీసుకొచ్చారు. సమాఖ్య స్ఫూర్తిని ధ్వంసం చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన విలువలను ఉల్లంఘించారు. ఎమర్జెన్సీ విధించినవారి ఆలోచనా ధోరణి ఇంకా మారలేదు. రాజ్యాంగం పట్ల ఏహ్యభావాన్ని వారు దాచిపెట్టుకుంటున్నారు. అయినా ప్రజలకు ఎవరేమిటో బాగా తెలుసు. అందుకే ఎన్నికల్లో వారిని(కాంగ్రెస్) పదేపదే తిరస్కరిస్తున్నారు. గట్టిగా బుద్ధి చెప్పన్నారు. అప్పటి కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజాస్వామ్య సంప్రదాయాలను తుంగలో తొక్కింది. దేశాన్ని చెరసాలగా మార్చేసింది. కాంగ్రెస్ విధానాలను వ్యతిరేకిస్తే దారుణంగా హింసించారు. వేధింపులకు గురిచేశారు. బడుగు బలహీన వర్గాలను అణచివేశారు. అప్పటి సామాజిక తిరోగమన విధానాలతో ప్రజలు నష్టపోయారు. ఎమర్జెన్సీని ధైర్యంగా ఎదిరించి, పోరాడిన గొప్ప వ్యక్తులను మనం స్మరించుకోవాలి. వారికి ఘనంగా నివాళులర్పించాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

స్పీకర్ అభ్యర్థుల గురించి...

ఓం బిర్లా రికార్డుల స్పీకర్



61 ఏళ్ల ఓం బిర్లా 2019లో లోక్‌సభకు రెండోసారి ఎన్నికవుతూనే అనూహ్యంగా స్పీకర్‌గా అవకాశం దక్కించుకున్నారు. తద్వారా విపక్షాలనే గాక స్వపక్షమైన బీజేపీ నేతలనూ ఆశ్చర్యపరిచారు. ఈసారీ గెలిస్తే గత 20 ఏళ్లలో ఆ ప్రతిష్టాత్మక పదవిని వరుసగా రెండోసారి చేపట్టిన తొలి నాయకునిగా నిలుస్తారు. గత 20 ఏళ్లలో స్పీకర్‌గా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన తొలి నేత కూడా బిర్లానే. పూర్తి స్థాయి డిప్యూటీ స్పీకర్ లేకుండానే పదవీ కాలం పూర్తి చేసిన తొలి స్పీకర్ కూడా ఆయనే. రాజస్తాన్‌లోని కోటా లోక్‌సభ సభ్యుడైన బిర్లా 2019కి ముందు పెద్దగా వార్తల్లో లేరు. భారతీయ జనతా యువ మోర్చా నుంచి రాజకీయాల్లో ఎదిగారు. మూడుసార్లు లోక్‌సభ సభ్యునిగా గెలిచారు. 2003 నుంచి 2014 దాకా కోటా సౌత్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. రాజస్తాన్ ప్రభుత్వంలో సహాయ మంత్రి హోదాతో కూడిన పార్లమెంటరీ కార్యదర్శిగా పని చేశారు. లోక్‌సభ స్పీకర్‌గా అధికార పక్షానికి కొమ్ము కాశారంటూ విపక్షాల నుంచి తీవ్ర విమర్శలే ఎదుర్కొన్నారు. మహువా మొయిత్రా లోక్‌సభ సభ్యత్వం రద్దు, 100 మంది విపక్ష ఎంపీలను సెషన్ మొత్తానికి సస్పెండ్ చేయడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. 2014లో తొలిసారి ఎంపీగా గెలిచాక లోక్‌సభలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 671 ప్రశ్నలు అడగడంతో పాటు 163 చర్చల్లో పాల్గొన్నారు. బిర్లా స్పీకర్‌గా ఉండగానే పార్లమెంటు కొత్త భవనం రూపుదిద్దుకుంది.

కె.సురేశ్ ఓడి గెలిచారు



కొడికున్నిల్ సురేశ్ (62). లోక్‌సభ స్పీకర్ పదవికి 50 ఏళ్ల తర్వాత జరుగుతున్న పోటీలో విపక్ష కూటమి అభ్యర్థిగా దేశవ్యాప్తంగా ఒక్కసారి వార్తల్లో వ్యక్తిగా మారిపోయారు. కేరళకు చెందిన ఈ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏకంగా ఎనిమిదిసార్లు లోక్‌సభ సభ్యునిగా గెలిచారు. అయితే 2009లో ఆయన విజయం వివాదాస్పదంగా మారింది. క్రైస్తవుడైన సురేశ్ ఎస్సీనంటూ తప్పుడు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌తో మావలికర ఎస్సీ లోక్‌సభ స్థానం నుంచి నెగ్గారంటూ సమీప ప్రత్యర్థి కేరళ హైకోర్టులో కేసు వేశారు. దాంతో సురేశ్ ఎన్నికను కోర్టు రద్దు చేసింది. అనేకానేక మలుపుల తర్వాత చివరికి సుప్రీంకోర్టు ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించింది. ఎల్ఎల్‌బీ చేసిన సురేశ్ 1989లో తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అప్పటినుంచి 1998, 2004 మినహా ప్రతిసారీ గెలుస్తూ వస్తున్నారు. పీసీసీ చీఫ్‌గా, పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యునిగానే గాక కేంద్ర మంత్రిగా కూడా చేశారు. ప్రస్తుతం కేరళ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. 2009లో మావలికర లోక్‌సభ స్థానం ఏర్పాటైనప్పటి నుంచీ ఎంపీగా ఆయనే గెలుస్తూ వస్తున్నారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం ప్రత్యర్థిపై కేవలం 10 వేల ఓట్ల మెజారిటీతో నెగ్గారు.

ముగిసిన ఆతిశి నిరాహార దీక్ష

అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ఢిల్లీ మంత్రి



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నీటి సమస్యను పరిష్కరించాలంటూ ఈనెల 21వ తేదీ నుంచి మంత్రి ఆతిశి కొనసాగిస్తున్న నిరాహార దీక్ష అర్ధంతరంగా ముగిసింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమెను లోక్‌నాయక్ ఆస్పత్రిలో చేర్పించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న మంత్రి ఆతిశి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ కుమార్ తెలిపారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన మంత్రి ఆతిశి దాదాపు ఐదు రోజులుగా సాగిస్తున్న నిరాహార దీక్షను విరమించారని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ చెప్పారు. ఢిల్లీకి న్యాయబద్ధంగా అందాల్సిన నీటిని హరియాణా నుంచి విడుదల చేయించాలంటూ ప్రధానికి ఆప్ ఎంపీలు లేఖ రాస్తారన్నారు.

వచ్చే నెలలో రష్యాకు మోదీ?

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలైలో రష్యాకు వెళ్లనున్నట్లు సమాచారం. మోదీ పర్యటన ఖాయమని, ఆయన రాకకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రష్యా అధ్యక్షుడి సహాయకుడు యూరి ఉషకోవ్ చెప్పారు. కాగా, జూలై 8వ తేదీన మోదీ రష్యాలో ఒక రోజు పర్యటన చేపట్టేందుకు అవకాశాలున్నాయని, దీనిపై తుది నిర్ణయం ఇంకా జరగలేదని దౌత్య వర్గాలు అంటున్నాయి. పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీ మధ్య విస్తృత స్థాయి చర్చలు జరిగే అవకాశముందని భావిస్తున్నారు. మోదీ 2019లో చివరిసారిగా రష్యాకు వెళ్లారు. అప్పట్లో వ్లాదివోస్టోక్‌లో జరిగిన ఎకనామిక్ కాంక్లేవ్‌లో పాల్గొన్నారు.

ఉదయనిధికి బెయిలిచ్చిన బెంగళూరు కోర్టు



బెంగళూరు: సనాతన ధర్మాన్ని నాశనం చేయాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధికి బెంగళూరులోని ఓ కోర్టు బెయిలిచ్చింది. సామాజిక కార్యకర్త పరమేశ్ వేసిన పిటిషన్‌పై కోర్టు నోటీసులందడంతో ఉదయనిధి మంగళవారం ఉదయం బెంగళూరులోని 42వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరయ్యారు. విచారణ చేపట్టిన మేజిస్ట్రేట్ ఆయనకు రూ.లక్ష పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. తదుపరి విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేశారు. 2023 సెప్టెంబర్‌లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉదయనిధి.. సామాజిక న్యాయం, సమానత్వానికి వ్యతిరేకమైన సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలానికి కారణమయ్యాయి.

అయోధ్యలో ఆలయాల మ్యూజియం

రూ.650 కోట్లతో నిర్మించనున్న టాటా సంస్థ

లక్నో: బాలరాముడు కొలువైన అయోధ్యలో రూ.650 కోట్లతో 'ఆలయాల మ్యూజియం'ఏర్పాటు కానుంది. అంతర్జాతీయ స్థాయి ప్రత్యేకతలతో మ్యూజియంను నిర్మించేందుకు టాటా గ్రూపు సంస్థ ముందుకు వచ్చింది. ఇందుకు అవసరమయ్యే స్థలాన్ని కేవలం రూపాయికే 90 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు యూపీ ప్రభుత్వం అంగీకరించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల చరిత్ర, వాటి నిర్మాణ రీతులను ఇందులో వివరిస్తారు. మ్యూజియంలో లైట్ అండ్ సౌండ్ షో కూడా ఉంటుందని యూపీ మంత్రి జైవీర్ సింగ్ తెలిపారు.

కెన్యాలో ఆందోళనలు తీవ్రతరం

పార్లమెంట్ భవనానికి నిప్పు

నైరోబీ: వివాదాస్పద పన్నుల పెంపు బిల్లును వ్యతిరేకిస్తూ కెన్యాలో జరుగుతున్న ఆందోళనలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పన్ను పెంపు ప్రతిపాదనలపై మంగళవారం రాజధాని నైరోబీలోని పార్లమెంట్‌లో చర్చ జరుగుతోంది. నిరసనకారులు మంగళవారం పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో భవనంలోని కొంత భాగానికి నిప్పుపెట్టారు. దీంతో, భద్రతా బలగాలు లోపలున్న పార్లమెంట్ సభ్యుల్ని సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. బలగాలు జరిపిన కాల్పుల్లో కనీసం ఐదుగురు నిరసనకారులు ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయాలపాలైనట్లు రాయిటర్స్ తెలిపింది. కాగా, పన్ను ప్రతిపాదనల్ని వెనక్కి తీసుకోవాలంటూ దేశవ్యాప్తంగా వారం రోజులుగా సాగుతున్న ఆందోళనల్లో ఇద్దరు పౌరులు చనిపోయారు. బ్రెడ్, శానిటరీ టవల్స్, డైపర్స్ వంటి వాటిపై పన్నులు పెంచాలని ప్రభుత్వం ప్రయత్నించింది. తీవ్ర ప్రజాగ్రహం నేపథ్యంలో బ్రెడ్‌పై పన్ను ప్రతిపాదనల్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అయినప్పటికీ ఆందోళనలు చల్లారలేదు.

దుబాయ్‌లో ఏపీ వాసికి లాటరీ

దుబాయ్: దుబాయ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ వాసి బోరుగడ్డ నాగేంద్రం(46)ను అదృష్టం వరించింది. నేషనల్ బాండ్స్ ఇటీవల నిర్వహించిన లాటరీలో ఈయన 10 లక్షల దిర్హంలు(సుమారు రూ.2.25 కోట్లు) గెలుచుకున్నారు. బతుకుదెరువు కోసం 2017లో యూఏఈ వెళ్లిన నాగేంద్రం నేషనల్ బాండ్స్‌లో పొదుపు చేయడం ప్రారంభించారు. ఈయనకు 18 ఏళ్ల కుమార్తె, 14 ఏళ్ల కుమారుడు ఉన్నారు. లాటరీ సొమ్ముతో తన పిల్లలకు మంచి చదువులు చెప్పిస్తానని నాగేంద్రం తెలిపారు.

పోర్షే కారు ప్రమాదం కేసు... బాలుడి విడుదలకు బాంబే హైకోర్టు ఆదేశం

ముంబై: పుణేలో ఖరీదైన పోర్షె కారు నడిపి ఇద్దరి మృతికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 17 ఏళ్ల బాలుడిని అబ్జర్వేషన్ హోం నుంచి వెంటనే విడుదల చేయాలని బాంబే హైకోర్టు ఆదేశించింది. మే 19వ తేదీన రాత్రి వేళ మద్యం మత్తులో ఉన్న బాలుడు కారు నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మైనర్ కావడంతో అతడిని పోలీసులు జువెనైల్ జస్టిస్ బోర్డు(జేజేబీ) ఎదుట హాజరు పరిచారు. బాలుడిని తల్లిదండ్రులు, తాత పర్యవేక్షణలో ఉంచాలని బోర్డు ఆదేశాలిచ్చింది. అయితే, రెండు నిండు ప్రాణాలను బలి తీసుకున్న నిందితుడిని విడుదల చేయడమేంటంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో, పోలీసులు బెయిల్ ఆదేశాలను సవరించాలంటూ జేజేబీని ఆశ్రయించారు. ఈ మేరకు బోర్డు నిందితుడిని అబ్జర్వేషన్ హోంకు తరలించాలని ఆదేశించింది. ఈ పరిణామంపై బాలుడి మేనత్త బాంబే హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం వాదనలు విన్న డివిజన్ బెంచ్..అబ్జర్వేషన్ హోంకు రిమాండ్‌కు పంపుతూ జేజేబీ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది. బాలుడిని మేనత్త పర్యవేక్షణలో ఉంచాలని, మానసిక నిపుణుడి కౌన్సెలింగ్ కొనసాగించాలని స్పష్టం చేసింది.

బ్రిటన్లో బెట్టింగ్ లొల్లి... ఇద్దరు అభ్యర్థులపై వేటు

లండన్: బ్రిటన్‌లో ఎన్నికల వేళ ప్రధాని రిషి సునాక్‌కు తలనొప్పులు నానాటికీ పెరుగుతున్నాయి. ఇద్దరు అధికార కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల తేదీపై బెట్టింగ్‌కు పాల్పడటంపై మొదలైన రగడ నానాటికీ ముదురుతోంది. వారిపై విమర్శలతో విపక్షాలు ఇప్పటికే హోరెత్తిస్తున్నాయి. ఇద్దరినీ పోటీ నుంచి తప్పించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. దాంతో సదరు అభ్యర్థులు క్రెయిగ్ విలియమ్స్, లారా శాండర్స్‌కు పార్టీ మద్దతు ఉపసంహరిస్తూ సునాక్ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. వారు ఇక కన్జర్వేటివ్ అభ్యర్థులు కారంటూ పార్టీ అధికార ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీపరంగా అంతర్గత విచారణ జరిపిన మీదట ఈ నిర్ణయానికి వచ్చినట్టు వివరించారు. వీరిద్దరూ సునాక్‌కు సన్నిహితులే కావడం విశేషం! బ్రిటన్‌లో జూలై 4న ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఏడాది చివరిలోగా జరగాల్సి ఉండగా సునాక్ ఆకస్మికంగా ముందస్తు నిర్ణయం తీసుకున్నారు.


సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం ❘ 26 ❘ జూన్ ❘ 2024



యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

సముద్రతీరానికి అతి సమీపంలో ఉన్న కోడూరు మండలం మట్టి అక్రమ రవాణాకు కేంద్రంగా మారింది. యథేచ్ఛగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. -8లో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.30 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యాయి.

న్యూస్‌రీల్

కొండలమ్మ ఆలయంలో వివిధ హక్కులకు వేలం



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ ఆలయంలోని వివిధ హక్కులను పొందే పాటదారులకు మంగళవారం ఈఓ కానూరి సురేష్ వేలం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, జాకెట్లను సేకరించుకునేందుకు ఏడాదికి రూ.15.50లక్షలకు నారగాని శ్రీనివాసరావు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కును ఏడాదికి రూ.7.01లక్షలకు పరసా రవిశంకర్ శ్రీనివాస్ దక్కించుకున్నట్లు ఈఓ చెప్పారు. అమ్మవారి ప్రసాదాల తయారీకి కిరణా సరుకుల సరఫరా హక్కును మచిలీపట్నానికి చెందిన శ్రీ వెంకటేశ్వర జనరల్ స్టోర్స్, ప్రసాదాల ప్యాకింగ్ కవర్ల సరఫరా హక్కును అమరావతికి చెందిన అయ్యప్ప సూపర్ మార్కెట్ దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. శానిటేషన్ సామగ్రి సరఫరా టెండర్లకు ఎవరూ ముందుకు రాని కారణంగా వాయిదా వేసినట్లు సురేష్ తెలిపారు. ఈ ప్రక్రియను మచిలీపట్నం తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

బూదవాడలో ఇంటింటి సర్వే



బూదవాడ(జగ్గయ్యపేట): డయేరియా నేపథ్యంలో మంగళవారం గ్రామంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో ఇందుమతి పర్యవేక్షణలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికీ వెళ్లి డయేరియా లక్షణాలపై వివరాలు అడిగి తెలుసుకుని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీటి నిల్వలు ఉంచకూడదని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తదితర జాగ్రత్తలను వివరించారు. గ్రామంలో వాంతులు, విరేచనాలతో ఆరుగురు ఆరోగ్య ఉప కేంద్రానికి వచ్చారని వారికి వైద్యం అందించి ఇంటికి పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అనిల్‌కుమార్, వాసంతి, సూపర్‌వైజర్ లక్ష్మి, వెంకట్రావ్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేస్తున్నారు. మురుగు నీటి డ్రెయిన్‌లలో పూడిక తీత, మురుగు కాలువలపై బ్లీచింగ్ చల్లిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగు నీటి పరీక్షలు చేస్తున్నారు.

పాఠశాలలో షెడ్ నిర్మాణానికి రూ. 2లక్షల విరాళం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షెడ్ నిర్మాణానికి పాఠశాల పూర్వ విద్యార్థి (1988–89) ఎన్ఆర్ఐ భీమవరపు శివారెడ్డి రూ. 2లక్షల విరాళాన్ని అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును పాఠశాల హెచ్ఎం వజ్రాల భూపాల్‌రెడ్డికి మంగళవారం అందజేశారు. అమెరికాలో నివాసం ఉంటున్న శివారెడ్డి ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం నున్న వచ్చారు. ఈ సందర్భంగా ఆయన నున్న హైస్కూల్‌ను సందర్శించి పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తాను కూడా భాగస్వామ్యం కావాలన్న ఉద్దేశంతో నూతనంగా నిర్మించనున్న షెడ్ నిర్మాణానికి రూ. 2లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి నరెడ్ల సత్యనారాయణ రెడ్డితో కలిసి చెక్కును అందజేశారు. దాత శివారెడ్డి సతీమణి సుధారాణి కూడా ఇదే పాఠశాల విద్యార్థిని కావడం విశేషం.

ఏపీ టెంట్ హౌస్ సంఘ నూతన కార్యవర్గం



పటమట(విజయవాడతూర్పు): ఏపీ టెంట్ హౌస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక పటమటలోని ఆశా ఫంక్షన్ హాలులో మంగళవారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా షేక్ బాషా, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ వెంకటసుబ్బారావు, కార్యదర్శిగా వి.వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. టెంట్ హౌస్‌ను రాష్ట్రంలో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీగా గుర్తించాలని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని నూతన కార్యవర్గం తీర్మానించింది.

డి ఉంటేనే ఢీ!

ఆరోగ్యం కావాలంటే విటమిన్ డి తప్పనిసరి



- లోపిస్తే శరీరం రోగాలమయం
- సూర్యరశ్మి శరీరానికి తాకకపోవడంతో ఇబ్బందులు
- తగ్గుతున్న వ్యాధి నిరోధకశక్తి
- వైద్య పరీక్షల్లో వెలుగు చూస్తున్న వైనం
- కాస్త ఎండన పడండి.. అంటున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే విటమిన్ డి చాలా అవసరం. సూర్యకిరణాల నుంచి సహజంగా లభించే 'విటమిన్ డి'కి దూరమైతే మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది. అందుకే బద్ధకం వీడి ఉదయాన్నే లేవండి. కాస్త ఎండన పడండి, ఆరోగ్యంతో జీవించండి అంటూ వైద్యులు సూచిస్తున్నారు.

మారిన లైఫ్‌స్టైల్..

మారుతున్న కాలానుగుణంగా చదువు, ఉద్యోగాలు, వ్యాపారాలతో మనిషి జీవితం నిరంతరం బిజీ బిజీగా మారుతోంది. ఉదయం 8 గంటలైనా లేవక పోవడం, రాత్రి 12 దాటినా మేల్కొని ఉండటం, నగర వాసులకు నిత్యకృత్యమైంది. చాలా మంది నగర వాసులకు సూర్యోదయమే తెలియకుండా పోతోంది. తద్వారా డి విటమిన్‌కు దూరమై అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు తెల్లవారు జామున 5 గంటలకే నిద్రలేచి దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యే వారు. కానీ రోజులు మారాయి. సిటీ జనులు మాత్రం చాలా మంది ఉదయం 8 గంటల తర్వాతనే నిద్రలేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు చక్కబెట్టుకుని రోడ్డు మీదకు వచ్చేటప్పటికీ ఎండ మండుతోంది. దీంతో ఉదయపు వేళల్లో సూర్యరశ్మి కారణంగా శరీరానికి అందే విటమిన్ డి పొందలేక పోతున్నారు. ఇటీవల కాలంలో వైద్యుల వద్దకు విటమిన్ డి లోపం సమస్యలతో వస్తున్న వారి సంఖ్య పెరిగింది. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి అన్ని రకాల విటమిన్‌లు అందాలి. ఏ ఒక్క విటమిన్ తక్కువైనా శరీరం అనారోగ్యానికి గురవుతుంది. అందులో విటమిన్ డి చాలా ప్రధానమైంది. కండరాలు, ఎముకలు, ప్రతి ఒక్క భాగం ఆరోగ్యంగా ఉండాలంటే డి విటమిన్ తప్పనిసరి.

నవజాత శిశువులకు అవసరమే..


ఒకప్పుడు పుట్టిన బిడ్డని కాసేపు ఎండలో ఉంచే వారు. తద్వారా చిన్నారులకు డి విటమిన్ సమృద్ధిగా లభించేది. కానీ ప్రస్తుతం పిల్లలను ఎండలో తిప్పితే నల్లబడి పోతారని, ఇంటి నుంచి బయటకు తీసుకురావడమే లేదు. దీంతో చిన్నారులకు నేరుగా సూర్యరశ్మి అందే అవకాశం లేకుండా పోతోంది. విటమిన్ డి చిన్నారులకు సమృద్ధిగా అందితే బరువు పెరగడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

నీడపట్టున ఉద్యోగం అనుకుంటే..

నీడపట్టున కూర్చుని పనిచేసే ఉద్యోగం అంటే చాలా లగ్జరీగా భావిస్తారు. కానీ ఇదే వారి అనారోగ్యానికి కారణం అవుతోంది. ఎండ బారిన పడకుండా హాయిగా ఏసీ గదిలో కూర్చుని పనిచేసే వారికి విటమిన్ డి లోపం అధికంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆఫీస్ గదుల్లోనే ఉండే ఉద్యోగులు, షిఫ్ట్ ఉద్యోగులు, హెల్త్ కేర్ వర్కర్స్‌కు విటమిన్ డి లోపం ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

విటమిన్ డి తక్కువైతే..

శరీరంలో విటమిన్ డి తక్కువైతే తీవ్రమైన అలసట, బలహీనత, నీరసం, నడుంనొప్పి, బలహీనమైన కండరాలు, ఆలోచన శక్తి తగ్గిపోవడం, డిప్రెషన్, మానసిక స్థితిలో తేడా కనిపిస్తుంది. తరచూ ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడతారు. తరచుగా ఎముకలు విరగడం, పగుళ్లు రావడంతో పాటు, జుట్టు రాలడం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మెదడు పనితీరుపైనా తీవ్ర ప్రభావం ఉంటుంది. వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది. పిల్లల్లో రికెట్స్, పెద్దల్లో కీళ్ల వ్యాధులు వస్తాయి. ఇన్సులిన్‌పై ప్రభావం చూపుతుంది. దీంతో రక్తంలోని గ్లూకోజ్ త్వరగా ఖర్చుకాకపోవడంతో సుగర్ వస్తుంది. మహిళల్లో మోనోపాజ్ తర్వాత సహజంగా కాల్షియం తగ్గుతుంది. కాల్షియం తగ్గితే క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ.



విటమిన్ డి అవసరం..



శరీరానికి డి విటమిన్ ఎంతో అవసరం. విటమిన్ డి లోపంతో కండరాల, ఎముకలు బలహీన పడతాయి. ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధకశక్తిని పెంచుకునేందుకు విటమిన్ డి అవసరం. ఇది సహజంగా సూర్యరశ్మి ద్వారా లభిస్తుంది. ఎండలో కొద్దిసేపు గడపడంతో పాటు వైద్యుల సూచనలు పాటిస్తే డి విటమిన్ లోపాన్ని అధిగమించవచ్చు. ఇటీవల కాలంలో విటమిన్ డి లోపం ఉన్న వారిని ఎక్కువగా చూస్తున్నాం.

– డాక్టర్ కె. సుధాకర్, ఆర్థోపెడిక్ నిపుణుడు, జీజీహెచ్

వీటిల్లో విటమిన్ డి పుష్కలం..



చేపలు, లివర్, కాడ్‌లివర్ ఆయిల్, కోడిగుడ్లు, ఆర్గాన్ మీట్స్, పాలు, పన్నీరు, నెయ్యి, వెన్న, పుట్టగొడుగుల్లో విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఆహారంలో ఈ పదార్థాలను తప్పక చేర్చుకోవాలి. తరచూ వీటిని తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ఆహారం కంటే ముఖ్యంగా పైసా ఖర్చులేకుండా ఉదయం ఎండలో కాసేపు గడిపితే విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది.

– గర్రే హరిత, న్యూట్రీషియన్

సీఎం సభా ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలన



కానూరులో సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్

పెనమలూరు: సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా కానూరు 100 అడుగుల రోడ్డులో సభ ఏర్పాట్లను సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు మంగళవారం సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సభాప్రాంగణం వద్ద సీఎం కాన్వాయ్ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలన్నారు. సభకు వచ్చే వారికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. 27న వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీఐపీ, మీడియా పాస్‌లు జీఏడీ ప్రొటోకాల్ విభాగం సిద్ధం చేయాలన్నారు. డ్యూటీ పాస్‌లు ఉయ్యూరు ఆర్డీఓ జారీ చేయాలని తెలిపారు. అగ్నిమాపక దళంతో పాటు అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంపత్ కుమార్, జిల్లా ఎస్పీ అద్నాన్‌నయీమ్ అస్మి, నగర పాలక కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్, జీఏడీ ప్రొటోకాల్ అదనపు డైరెక్టర్ వాణి, సీఆర్డీఏ అదనపు కమిషనర్ అలీంబాషా పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పరిశీలన

కానూరు 100 అడుగుల రోడ్డులో పారిశుద్ధ్యాన్ని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం పరిశీలించారు. ఈ నెల 27వ తేదీన సీఎం నారా చంద్రబాబునాయుడు కానూరు 100 అడుగుల రోడ్డులో రామోజీరావు సంస్మరణ సభకు వస్తుండటంతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా జేసీ గీతాంజలిశర్మ, ఆర్డీఓ డి.రాజు పలువురు అధికారులతో కలిసి కలెక్టర్ 100 అడుగుల రోడ్డులో పర్యటించారు.

'స్వచ్ఛంద' చైతన్యం.. సేవాతత్వం

- అనాథలకు దాతల చేయూత
- స్వచ్ఛంద సంస్థల ద్వారా బాలలకు ఆశ్రయం
- వృద్ధులు, దివ్యాంగులకూ ఆసరా
- ఆదర్శంగా నిలుస్తున్న యువత



గిరిజనతండాల్లో తిరువూరు పరిపూర్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం(ఫైల్)



తిరువూరు ఐడియాస్ సేవా సంస్థలో బాలలకు అన్నదానం(ఫైల్)

తిరువూరు: తమ పిల్లల పుట్టిన రోజులు, పెళ్లిరోజులను కుటుంబ సభ్యులతో ఆర్భాటంగా జరపడం కంటే.. నా అనే వారు లేని అనాథ బాలలు, వృద్ధుల నడుమ జరుపుకోడానికి ఇటీవల పలువురు ఆసక్తి చూపుతున్నారు. తిరువూరు నియోజకవర్గంలోని అనాథాశ్రమాలు, వృద్ధులు, దివ్యాంగుల సహాయ కేంద్రాల్లో ఆశ్రయం పొందిన వారికి దాతలు తమవంతు సహాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న యువతీ యువకులు తాము అనాథబాలలకు సాయం చేయడమే కాకుండా తమకు తెలిసిన వారి ద్వారా కూడా చేయూతనందిస్తున్నారు. తిరువూరు, విస్సన్నపేట, పెనుగొలను, ఏ.కొండూరులలో 15కి పైగా స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు తల్లిదండ్రులను కోల్పోయిన బాలల్ని చేరదీసి వారి అవసరాలు తీరుస్తున్నాయి.

ఉన్నతాశయాలతో సేవా కార్యక్రమాలు..

తిరువూరులో 25 సంవత్సరాలుగా ఐడియాస్ సేవా సంస్థ నిర్వహిస్తున్న అవ్వారి శౌరి అనాథ బాలలకు ఆశ్రయం ఇవ్వడంతో పాటు వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, దుస్తులు, ఇతర సదుపాయాలు కల్పించడానికి దాతల సహాయం తీసుకుంటున్నారు. బెంగళూరుకు చెందిన ఈలోక్ విద్యా సంస్థ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలతో పాటు విదేశాల్లో ఉంటున్న విద్యారంగ నిపుణులతో ఆన్‌లైన్ తరగతులు బోధించడానికి ఐడియాస్ సంస్థ కృషి చేస్తోంది. తిరువూరు చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలోని కల్లూరు, సత్తుపల్లి, వీఎం బంజర్, వేంసూరు మండలాల్లో కూడా ఈలోక్ విద్యా సంస్థ ఆన్‌లైన్ తరగతులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. మురికివాడల్లో, శివారు ప్రాంతాల్లో ఉంటున్న పేద విద్యార్థులకు, బడి మానేసిన పిల్లలకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించడం, వారి చదువుకు, ఇతర అవసరాలకు కావలసిన నిధులను విరాళాల రూపంలో సేకరించడం తదితర కార్యక్రమాలను కూడా ఐడియాస్ సేవాసంస్థ నిర్వహిస్తోంది.

గిరిజనుల అభ్యున్నతి కోసం..

తిరువూరులోని పరిపూర్ణ స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకుడు సిరికొండ నాగేశ్వరరావు ఖమ్మం జిల్లాలోని గిరిజన తండాలలో దాతల సహకారంతో దుస్తులు, దుప్పట్లు, నిత్యావసర సరుకులను అందిస్తూ వారి జీవన శైలిలో మార్పునకు ప్రయత్నిస్తున్నారు. సామాజిక సేవాభిలాష ఉన్న వ్యక్తుల సహకారంతో అనాథ బాలలు, వీధిబాలలు, వృద్ధులు, దివ్యాంగులకు పరిపూర్ణ స్వచ్ఛంద సంస్థ ద్వారా అన్నదాన నిర్వహణ తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. పట్టణంలోని రమణమహర్షి ఆశ్రమం, జ్యోతి ఆశ్రమం, ఆర్‌కే స్వచ్ఛంద సంస్థలు కూడా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

దాతలు సహకరించాలి..



పేదలు, అనాథ బాలలు, వృద్ధులు, దివ్యాంగులకు కనీస సదుపాయాలు సమకూర్చడానికి కృషిచేసే స్వచ్ఛంద సంస్థలకు దాతలు చేయూతనందించాలి. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు తాగునీరు, వైద్యం, విద్య సదుపాయాల కల్పనకు కృషి చేస్తాం.

– సిరికొండ నాగేశ్వరరావు, పరిపూర్ణ సేవాసంస్థ నిర్వాహకుడు, తిరువూరు

బాలల హక్కుల పరిరక్షణ ధ్యేయం



బడి ఈడు పిల్లలు పనులకు వెళ్లడం తగదని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ గత 25 ఏళ్లుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి కృషి చేస్తున్నాం.

– అవ్వారి శౌరి, డైరెక్టర్, ఐడియాస్ సేవాసంస్థ

ఉత్సవాలకు నెలవు

ఇంద్రకీలాద్రిపై 6 నుంచి ఆషాఢ మాసోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి ఆషాఢ మాసోత్సవాలకు ముస్తాబవుతోంది. జూలై 6 నుంచి ప్రారంభమయ్యే ఆషాఢమాసం ఆగస్టు 4వ తేదీతో ముగుస్తుంది. నెల రోజుల పాటు నిర్వహించే ఆషాఢ మాసోత్సవాలలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి తరలిరానున్నారు. దుర్గమ్మ వారు తమ ఇంటి ఆడపడుచుగా భావించి చీర, సారె, పూజా సామగ్రిని సమర్పిస్తారు. నెల రోజుల పాటు అమ్మవారి ఆలయం సారె సమర్పించేందుకు విచ్చేసే భక్త బృందాలు, దేవస్థాన కమిటీలు, సేవా బృందాలతో కళకళలాడనుంది.

14న తెలంగాణ బోనం

14వ తేదీ దుర్గమ్మకు హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పించనున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని కోరుతూ ఏటా అమ్మవారికి బోనాలను సమర్పించడం ఆనవాయితీ.

19 నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు..

జూలై 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు నిర్వహించే శాకంబరీదేవి ఉత్సవాలలో అమ్మవారి మూలవిరాట్‌ను ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతో మూడు రోజుల పాటు అలంకరిస్తారు. ఇక అమ్మవారికి అలంకరించిన కూరగాయలు, ఆకుకూరలతో తయారు చేసే కదంబం ప్రసాదం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహిస్తారు. 19వ తేదీ విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, మండపారాధన జరుగుతాయి. 21వ తేదీ ఉదయం మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి. ఉత్సవాలలో ప్రతి రోజూ సుమారు 70 నుంచి 80 వేల మంది భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

■ కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 53,183 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 51,353 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,700 వరకు లభించింది.

అడ్మిషన్లు జరుగుచున్నవి
త్రివేణి కాలేజెస్
Top in Academics... Best in Placements...
DEGREE: B.Sc (Comp.Science), B.Sc., (Data Science) B.Com., (Computers), INTER: MPC, MEC, CEC
బాలికల క్యాంపస్: NSM స్కూల్ రోడ్డు, పటమట. 8897313456, 8790466755
బాలికల క్యాంపస్: సీతారామపురం సిగ్నల్ దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ సెల్: 9393955566, 9393975566.
బాలుర క్యాంపస్: దుర్గామహల్ దగ్గర, పటమట. 8897813456, 8790466766
THINK OF PLACEMENTS - JOIN IN TRIVENI

టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా అనన్య



అనన్యను అభినందిస్తున్న సిస్టర్ ఫాతిమాపావని

భవానీపురం(విజయవాడపశ్చిమ): సౌత్ ఇండియా టెన్నిస్ స్టేట్ (సిట్) చాంపియన్‌షిప్ పోటీలో అట్కిన్‌సన్ (గొల్లపూడి) హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యాధరపురం గుప్తా సెంటర్‌కు చెందిన చిన్నారి శ్రవణం అనన్య రన్నరప్‌గా నిలిచింది. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో యూత్ స్పోర్ట్స్ రిక్రియేషనల్ ట్రస్ట్ సెక్రటరీ సింగంశెట్టి దుర్గా కుమార్ ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో అండర్–10 కేటగిరీలో చిన్నారి అనన్య ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా అట్కిన్‌సన్ స్కూల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా పావని అనన్యను అభినందిస్తూ పోటీలో సాధించిన కప్, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చిన్న వయసులోనే అనన్యను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు శ్రవణం బాలసుబ్రహ్మణ్యం(బాలు), దీపిక, అలాగే అనన్యకు శిక్షణ ఇస్తున్న కేపీ అకాడమీ నిర్వాహకుడు షేక్ నాగూర్ వలీ అభినందనీయులని కొనియాడారు.

ప్రాణం ఖరీదు రూ.2 లక్షలు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): రోడ్డు పక్కన నిద్రిస్తున్న వ్యక్తి మీదుగా ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు రంగంలోకి దిగి మృతుడి ప్రాణాలకు రెండు లక్షల రూపాయలు వెల కట్టి ఆ పేద కుటుంబాన్ని నోరెత్తకుండా చేశారు. ఈ ఘటన బందరు మండలం గోపువానిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు.. మచిలీపట్నం ఆర్టీసీ డిపో నుంచి రోజూ రాత్రి 10.30 గంటలకు ఓ బస్సు గోపువానిపాలెం గ్రామానికి చేరుకుంటుంది. తిరిగి తెల్లవారుజామున ఉద్యాన పంటలు సాగుచేసే రైతులను ఎక్కించుకుని రైతు బజారుకు చేరుకుంటుంది. ఎప్పటిలానే సోమవారం రాత్రి ఆ బస్సు గ్రామంలోకి వెళ్తూ చల్ల గాలి కోసం తన ఇంటికి కొద్దిదూరంలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న బత్తిన రాంబాబు (50)పై నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రాంబాబు ఆర్టీసీ బస్సు టైర్ల కింద నలిగి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటనపై పోలీసు కేసు నమోదవకుండా అధికార పార్టీ నాయకులు కొందరు రంగంలోకి దిగారు. ఆర్టీసీ డ్రైవర్‌ను కేసు నుంచి తప్పించేందుకు మృతుడి కుటుంబంతో మంతనాలు జరిపారు. మృతుని కుటుంబ సభ్యులు నిరక్షరాస్యులు, పేదలు కావడంతో కేసు పెట్టకుండా ఉండేందుకు రూ.2 లక్షలు ఇప్పిస్తామని ఒప్పించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేయలేదని తెలుస్తోంది.



క్లుప్తంగా

ఎంఎంసీ ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొల్లు, బాలశౌరి

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ ఎక్స్ అఫీషియో సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర గనులు, భూగర్భ, ఆబ్కారీ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరిని వ్యవహరించేందుకు ఎంపిక చేసుకున్నారని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై వీరిద్దరూ నగరపాలక సంస్థ ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగుతారని పేర్కొన్నారు.

బీమా మొత్తాన్ని వడ్డీతో చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారుడికి వడ్డీతో బీమా మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యురాలు శ్రీలక్ష్మి రాయల మంగళవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నం నగరానికి చెందిన కె.శ్రీనివాసరావు తన భార్య కె.రమాదేవి పేరున 2021 ఫిబ్రవరి 15వ తేదీన లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఆధార్ షీలా పాలసీ రూ.3 లక్షల తీసుకున్నారు. ఈ పాలసీ నిమిత్తం రూ.18,624 ప్రీమియం చెల్లించారు. దురదృష్టవశాత్తు 2021 డిసెంబరు 20వ తేదీన రమాదేవి గుండెపోటుతో మృతి చెందారు. శ్రీనివాసరావు క్లెయిమ్ కోసం ఎల్ఐసీలో దరఖాస్తు చేసుకోగా వారు తిరస్కరించారు. దీంతో శ్రీనివాసరావు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యురాలు శ్రీలక్ష్మి రాయల ఈ కేసు పూర్వాపరాలను విచారించిన బీమా మొత్తం రూ.3 లక్షలను 2022 ఆగస్టు 26వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని, మానసిక వేదన కలిగించినందుకు రూ.15 వేలు, ఖర్చుల నిమిత్తం మరో రూ.10 వేలను తీర్పు వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.

ముంబాయి పోలీసులమంటూ రూ.6.50 లక్షలు స్వాహా

పెనమలూరు: మనీ ల్యాండరింగ్ చేశావంటూ ఒక చార్టెడ్ అకౌంటెంట్‌ను సైబర్ మోసగాళ్లు బెదిరించి అతని బ్యాంకు ఖాతాలో రూ.50 లక్షలు స్వాహా చేశారు. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ టి.వి.వి.రామారావు కథనం మేరకు.. కానూరు సనత్‌నగర్‌లో చార్టెడ్ అకౌంటెంట్ డి.వెంకటరామకృష్ణప్రభాకర్ నివసిస్తున్నారు. అతనికి ఈ నెల 23వ తేదీన ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాము ముంబాయి పోలీసులమని, వెంకటరామకృష్ణప్రభాకర్ ఆధార్‌కార్డు నంబర్‌తో ముంబాయి నుంచి ఇరాన్‌కు మనీ ల్యాండరింగ్ చేస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. అనంతరం మరొకరు ముంబాయి పోలీసు అధికారినంటూ ఫోన్ చేశాడు. వెంకటరామకృష్ణప్రభాకర్‌కు చెందిన మూడు బ్యాంకు ఖాతాల నుంచి మనీ ల్యాండరింగ్ చేసినందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేశామని బెదిరించాడు. వెంకటరామకృష్ణ ప్రభాకర్‌ను భయపెట్టి నెట్ బ్యాంకింగ్ ద్వారా అతని ఖాతాలో రూ.6.5 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. ఆ నగదును అతని ద్వారానే తమ బ్యాంక్ ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. విచారణ అనంతరం నగదును వెనక్కు ఇస్తామని నమ్మించారు. నగదు బదిలీ అయిన తరువాత వారి నుంచి స్పందన లేకపోవడంతో మోసం జరిగిందని తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

- కోడూరు మండలం కేంద్రంగా సాగుతున్న మట్టి దందా
- రోజూ 200 టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు తరలింపు
- రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే మట్టి రవాణా!

కోడూరు: సముద్రతీరానికి అతి సమీపంలో ఉన్న కోడూరు మండలం మట్టి అక్రమ రవాణాకు కేంద్రంగా మారింది. మట్టి మాఫియా నిర్వాహకులు తీరప్రాంత గ్రామాలను కేంద్రంగా చేసుకొని యథేచ్ఛగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మండలంలోని మందపాకల శివారు పాదాలవారిపాలెం గ్రామం నుంచి పగలు, రాత్రి అన్న తేడా లేకుండా రోజూ 200 భారీ టిప్పర్లలో మట్టిని రవాణాచేస్తున్నారు. పాదాలవారిపాలెం గ్రామంలోని పంటకాలువ పక్కన భారీ యంత్రాలతో మట్టిని తవ్వి డంపింగ్ చేస్తున్నారు. డంపింగ్ చేసిన మట్టిని టిప్పర్లతో బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. రెండు రోజుల నుంచి ఈ మట్టి దందా తారస్థాయి చేరింది. మట్టి తరలించే ప్రాంతాల్లో భారీ గుంతలు పెట్టడంతో పాటు మట్టి రవాణాకు పొలాల మధ్య నుంచి బాట ఏర్పాటు చేశారు. రామకృష్ణాపురం, ఊటగుండం గ్రామాల నుంచి కూడా మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మట్టి మాఫియా నిర్వాహకులు కోడూరులోని రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో భారీ మొత్తంలో మట్టిని డంపింగ్ చేసి, ఇక్కడ నుంచే రవాణా చేస్తున్నారు.

టిప్పర్ మట్టి రూ.10 వేలకు పైనే..

మట్టి మాఫియా నిర్వాహకులు టిప్పర్ మట్టిని రూ.10 వేలకు పైగానే విక్రయిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పంట పొలాలను ఇళ్లస్థలాలుగా మార్చుకొనేవారు అధిక మొత్తంలో నగదు చెల్లించి మట్టిని కొనుగోలు చేస్తున్నారు. రెండు, మూడు ఎకరాల మాగాణి పొలాలను కూడా ప్లాట్లుగా మారుస్తున్న ఘటనలు జరుగుతున్నాయి. మట్టిమాఫియా కారణంగా సామాన్య ప్రజలకు మట్టి దొరకడం గగనంగా మారింది. ట్రాక్టర్ బుసక మట్టిని రూ.1500లకు విక్రయిస్తున్నారు. పంట పొలాల్లో మెరకలు తీసుకొనేందుకు కూడా సవాలక్ష ఆంక్షలు విధించే రెవెన్యూ అధికారులు భారీ మొత్తంలో మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



పాదాలవారిపాలెంలో మట్టి లోడింగ్ కోసం వచ్చిన టిప్పర్లు



టిప్పర్‌లో మట్టిలోడు చేస్తున్న పొక్లెయిన్

రెవెన్యూ సిబ్బందికి ముడుపులు!

మట్టి అక్రమ రవాణాకు రెవెన్యూ అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ రెవెన్యూ అధికారి బాహాటంగానే మట్టి మాఫియా నిర్వాహకులతో సమావేశం నిర్వహించారన్న విమర్శలు ఉన్నాయి. జేసీబీ, ట్రాక్టర్ల యాజమానులు కూడా రెవెన్యూ సిబ్బందిని ప్రసన్నం చేసుకొని ఈ మట్టిని దందాను నిర్వహిస్తున్నారని సమాచారం.

దెబ్బతింటున్న సహజవనరులు

తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు ఇప్పటికే తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టి అక్రమ తవ్వకాలు, అక్రమ చెరువులతో ఇప్పటికే భూగర్భ జలాలు మొత్తం ఉప్పగా మారి నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. సహజవనరులు సైతం దెబ్బతిని భూములు చౌడుబారుతున్నాయి. కనీసం ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకోకుండా రెవెన్యూ అధికారులు మట్టి దందాను ప్రోత్సహించడంపై ప్రజలు మండిపడుతున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లను ఇష్టానుసారంగా నడపడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాపోతున్నారు. పగలు, రాత్రి వేళల్లో యథేచ్ఛగా ట్రాక్టర్లు, టిప్పర్లుతో తోలకాలు జరపడంతో వాటి మోతకు నిద్ర కూడా ఉండడం లేదని పై గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని మైనింగ్ అధికారులు

మట్టిని తవ్వడానికి మైనింగ్ అనుమతులు తప్పనిసరి. అయితే మాఫియా నిర్వాహకులు ఏ విధమైన మైనింగ్ అనుమతులూ లేకుండా ఈ దందా నిర్వహిస్తున్నారు. ఈ శాఖ అధికారులను కూడా మాఫియా నిర్వాహకులు ప్రసన్నం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా కూడా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో అక్రమ మట్టిరవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదురుగా మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్

అంబటి పోరాటాలే ఏపీయూడబ్ల్యూజే స్ఫూర్తి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఐజేయూ నేత అంబటి ఆంజనేయులు పోరాటాల స్ఫూర్తితో ఏపీయూడబ్ల్యూజే ముందుకు సాగాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రెస్‌క్లబ్‌లో అంబటి మొదటి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. తొలుత యూనియన్ ప్రతినిధులు అంబటి ఆంజనేయులు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, యూనియన్ పటిష్టత కోసం అంబటి ఆంజనేయులు చేసిన సేవలను గుర్తు చేశారు. 2430 జీఓను రద్దు చేయాలని కోరారు. భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యలను కచ్చితంగా వ్యతిరేకించాలని స్పష్టం చేశారు. సంస్థాగతంగా యూనియన్‌ను బలోపేతం చేయాలని, త్వరలో రాష్ట్ర మహాసభ కూడా జరుపుకోవాలని సూచించారు. అనంతరం పూతలపట్టు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీనియర్ పాత్రికేయుడు, ఏపీయూడబ్ల్యూజే నేత డాక్టర్ కె.మురళీమోహన్‌ను రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఘనంగా సత్కరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, ఎం.ప్రసాద్, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే అతిసారకు మందు

- తాజా ఆహారం తీసుకోవాలి
- కాచి, చల్లార్చిన నీటిని తాగాలి
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



డాక్టర్ సుగుణావతి

గుడ్లవల్లేరు: వర్షాకాలంలో అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలు ఎక్కువ. ఈ వ్యాధి బారినపడిన వారు నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయానికి దారితీస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు, తాజా, వేడి ఆహార పదార్థాలను భుజించడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలను పాటిస్తే వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సీహెచ్.సుగుణావతి సూచించారు. ఈ వ్యాధి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆమె మాటల్లోనే...

- ఈ వ్యాధి ప్రబలే కాలంలో క్లోరిన్ కలిపిన నీటినే విధిగా తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగినా మంచిదే.
- కుండ లేక బిందెల్లో చేతులు ముంచి మంచి నీటిని తాగకూడదు. కాడ గిన్నెతో నీటిని గ్లాసులో పోసుకుని తాగడాన్ని అలవాటు చేసుకోవాలి.



పరిశుభ్రమైన వేడి వేడి ఆహారాన్ని భుజించాలి

- కలుషితమైన నీరు తాగకూడదు. మంచినీటి పైపులైన్ల పగుళ్లను విధిగా రిపేరు చేయించుకోవాలి.
- మంచినీటిని విధిగా క్లోరినేషన్ చేయాలి.
- పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం.
- చేతి పంపులు, కుళాయిల చుట్టూ పళ్లెల ఆకారంలో ప్లాట్‌ఫారాలను నిర్మించుకోవాలి.
- వేడివేడి ఆహార పదార్థాలను తినే మంచి అలవాటును చేసుకోవాలి.
- నిల్వ ఉన్న మాంసాహారంతో పాటు ఎలాంటి పదార్థాలను అసలు తినకూడదు.
- ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలి.
- భోజనానికి ముందు, మల విసర్జనకు తర్వాత విధిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి.
- ఇంటి పరిసరాలతో పాటు బహిరంగ మల విసర్జన చేయకూడదు.
- ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడటాన్ని అలవాటు చేసుకోవాలి.
- మంచినీటి చెరువులో, మంచినీటి బావులు, బోర్ల వద్ద బట్టలు ఉతకడం, పశువులు కడగటం వంటివి చేయకూడదు.
- ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- సూక్ష్మ క్రిములు చేరకుండా పరిసరాల్లో చెత్త కుప్ప, పేడ నిల్వ ఉంచరాదు.
- ఈగలతో పాటు ఇతర కంటికి కనబడని కీటకాలు సైతం చేరకుండా ఉండేందుకు వంట పాత్రలపై మూతలు ఉంచాలి.
- మాంసం, కూరగాయలు, ఫలాలు వినియోగించేందుకు ముందు కడగాలి.
- వ్యక్తిగత, పరిశుభ్రత చాలా ముఖ్యం. వంట చేసే ముందు, భోజనం వడ్డించేందుకు ముందు కూడా సబ్బుతో గోళ్లతో సహా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- గోళ్లను ఎక్కువగా పెరగనివ్వకూడదు.
- ఏ ప్రాంతంలో అయినా అతిసార ఉన్నట్లయితే ఆ ప్రాంత ప్రభుత్వాస్పత్రి వైద్యులకు సమాచారం అందించాలి.
- అప్పుడే వైద్యులు తక్షణం బాధితులకు వైద్య సేవలు అందించి రోగులను కాపాడతారు.

వెటర్నరీ విద్యార్థుల ఆందోళన

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ వైఖరికి నిరసనగా విద్యార్థులు మంగళవారం ఆందోళన బాటపట్టారు. తరగతులను బహిష్కరించి కళాశాల ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. కొంత మంది విద్యార్థులు కళాశాల భవనంపైకి ఎక్కి అసోసియేట్ డీన్ డాక్టర్ పి.వి.ఎస్.కిషోర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నేతలు పునీత్, అజయ్, భాను, మనోహర్, అమూల్య, సుస్మిత, ఫణిశ్రీ మాట్లాడుతూ.. అసోసియేట్ డీన్ అనుచిత వైఖరి వల్ల విద్యార్థులు అందరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. తమ సమస్యలను చెప్పుకునేందుకు ఆయన వద్దకు వెళ్తే అవమానకరంగా మాట్లాడడంతో పాటు తమ ఫొటోలు తీసి, ఐడీ, తల్లిదండ్రుల వివరాలు అడుగుతున్నారని ఆరోపించారు. తమ తల్లిదండ్రుల పెంపకాన్ని కించపరుస్తున్నారని వివరించారు. దీంతో ఆయన వద్ద సమస్యలను ప్రస్తావించడానికి విద్యార్థులు జంకుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థినులపై అసోసియేట్ డీన్ అపనిందలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల వసతి గృహంలో పాములు సంచరిస్తున్నాయని మొరపెట్టుకున్న వారిని కించపరుస్తూ వెకిలిగా మాట్లాడటం బాధాకరమన్నారు. వసతి గృహం చుట్టూ ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలు తొలగించాలని కోరగా పాముకాటు వేస్తే యాంటీ వెనం వ్యాక్సిన్ ఇప్పిస్తానని అసోసియేట్ డీన్ బదులు ఇచ్చారని ఆరోపించారు. క్రీడా సామగ్రి కొనుగోలుకు నిధులు కేటాయించకపోవడం, బయట వ్యక్తులు వచ్చి కళాశాల విద్యార్థినులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చెప్పినా అసోసియేట్ డీన్ పట్టించుకునే వారు కాదన్నారు. ఆయన వైఖరిపై శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు. అందుకే ఆందోళన బాటపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

యార్లగడ్డను కలిసిన ఎయిర్‌పోర్ట్ నిర్వాసిత రైతులు

గన్నవరం: విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన రైతులు మంగళవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో ల్యాండ్ పూలింగ్ సమస్యల పరిష్కారంపై చర్చించారు. గతంలో ప్రభుత్వ హామీ మేరకు ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో విమానాశ్రయ విస్తరణకు 730 ఎకరాలు భూములు ఇచ్చినట్లు రైతులు తెలిపారు. భూములు ఇచ్చిన అందరికీ అమరావతి రాజధానిలో ఎకరానికి 1,450 గజాల చొప్పున ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కౌలు పరిహారం బకాయిలను మంజూరు చేయాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యార్లగడ్డ హామీ ఇచ్చారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సమస్యలపై త్వరలో కలెక్టర్‌తో చర్చిస్తానని, భూములు కోల్పోయిన రైతులు అందరికీ న్యాయం చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీటి సరఫరా తదితర సమస్యలపై ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు.



యార్లగడ్డకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

లోకో రన్నింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న లోకో పైలట్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు కోరారు. ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో రన్నింగ్ స్టాఫ్ కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లపై 24 రోజులుగా ఏఐఎల్ఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో సదరన్ రైల్వేలో చేస్తున్న ఆందోళనకు మద్దతుగా విజయవాడ డివిజన్ లోకో రన్నింగ్ కార్మికులు నల్లబ్యాడ్జీలు, సంఘీభావ ప్రదర్శనలు, సదస్సులు చేపట్టినట్లు తెలిపారు. భారతీయ రైల్వేలో అందరి కార్మికులకు ఇచ్చినట్లుగానే లోకో రన్నింగ్ సిబ్బందికి కూడా 46 గంటల విశ్రాంతి ఇవ్వాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, రాత్రి డ్యూటీని వరుసగా రెండు రాత్రులకు పరిమితం చేయాలని, విధులు చేపట్టిన సిబ్బందిని 48 గంటల్లోపు తిరిగి హెడ్ క్వార్టర్స్‌కు పంపించాలని, పెండింగ్‌లో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీఐటీయూ తరఫున ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎల్ఆర్ఎస్ఏ విజయవాడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశన్, కె.రామకృష్ణ, నాయకులు వై.ఎస్.బాబు, ఎస్.గురుమూర్తి, పలువురు లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకోపైలట్‌లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ మురళీమోహన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ మురళీ మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ తీగలను చోరీ చేసినా, విద్యుత్ లైన్లకు తీగలు తగిలించి చౌర్యం చేసినా, మీటరులో విద్యుత్ వినియోగం నమోదు కాకుండా చేసినా, సర్వీసు నంబరు లేకుండా మీటరు బిగించి విద్యుత్ వాడినా, దొంగ మీటర్లు బిగించి చౌర్యానికి పాల్పడినా చర్యలు తప్పవని స్పష్టంచేశారు. విద్యుత్ చౌర్యం గురించి తెలిసిన వారు ఆ సమాచారాన్ని విజిలెన్స్ అధికారులకు తెలపాలని కోరారు. సీఐ డి.గంగాభవాని (94408 11790), ఎస్ఐ వెంకటేశ్వరరావు (94938 95862) నంబర్లకు ఫోన్ చేసి విద్యుత్‌చౌర్యానికి పాల్పడే వారి వివరాలు తెలపాలని సూచించారు. తమకు సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

కంకిపాడు: బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. అరెస్టయిన వారిలో ఒకరు మైనరు. నిందితుల వద్ద నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ డి.సందీప్ ఈ కేసు వివరాలను మంగళవారం విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో ఈ నెల 22న బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాలతో, డీఎస్పీ జయసూర్య, సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్ఐ డి.సందీప్, అదనపు ఎస్ఐ తాతాచార్యులు, సిబ్బంది దర్యాప్తు బృందాలుగా ఏర్పడ్డారు. మంగళవారం ఉదయం ఈడుపుగల్లు శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిలో ఒకరు కనుమూరు గ్రామానికి చెందిన మల్లాడ వంశీ, మరొకరు పెనమలూరు మండలం గోసాల గ్రామానికి చెందిన బాలుడు. వారు ఈడుపుగల్లు గ్రామంతో పాటు కంకిపాడు, పునాదిపాడు, పెనమలూరులో ఒక్కొక్క ద్విచక్రవాహనం చోరీ చేసినట్లు అంగీకరించారు. బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితుడిని మీడియాకు చూపుతున్న ఎస్ఐ సందీప్

వృద్ధురాలిపై చైన్‌స్నాచర్ల దాడి

మూడు కాసుల బంగారు గొలుసు చోరీ

పామర్రు: వృద్ధురాలిపై చైన్‌స్నాచర్లు దాడి చేసి మూడు కాసుల బంగారు గొలుసు అపహరించిన ఘటన పామర్రులో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నిడుమోలు గ్రామానికి చెందిన వృద్ధురాలు సీత పామర్రు వెళ్లేందుకు మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిపై వేచి వుంది. ఇంతలో మచిలీపట్నం వైపు నుంచి వచ్చిన ఆటోను ఆపి పామర్రు వెళ్తుందా అని సీత అడిగింది. ఆ ఆటోలో డ్రైవర్‌తోపాటు ఒక ప్రయాణికుడు మాత్రమే ఉన్నాడు. నిడుమోలులో బయలుదేరిన ఆటోను పామర్రు మండలం, కంచర్లవానిపురం (14వ మైలు రాయి) వద్ద రోడ్డు పక్కన డ్రైవర్ ఆపాడు. ఎందుకు ఆపారని సీత ప్రశ్నిస్తుండగానే ఆటోలో ప్రయాణికుడిలా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా ఆమె కళ్లలో కారంచల్లి తన వద్ద ఉన్న రాడ్‌తో తలపై, చేతులపై ఇష్టం వచ్చినట్టు కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. ఆమె మెడలో ఉన్న మూడు కాసుల బంగారు గొలుసును లాక్కొని ఆటోను వదిలి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి డ్రైవర్‌తో కలిసి పారిపోయాడు. గాయపడిన వృద్ధురాలిని ఆ మార్గంలో ప్రయాణిస్తున్నవారు గుర్తించి పామర్రు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హుటాహుటిన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. ఇదే సమయంలో పొలాల్లోకి పారిపోయిన ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు విజయవాడకు చెందిన వారిగా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు సీతను స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన సీత

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని హెడ్‌వాటర్ వర్క్స్ ప్రాంతం వద్ద కృష్ణా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. నదిలో మంగళవారం వృద్ధుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహం వద్ద అతని వివరాలు తెలిపే ఆధారాలు లభించలేదు. మృతుడి వయసు 60 ఏళ్లు ఉంటుంది. ఒంటిపై తెల్ల లాల్చి, తెల్ల పంచె ఉన్నాయి. పోలీసులు మృత దేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ శ్రీనివాస టెక్నోస్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

REAL ESTATE
FLAT FOR SALE
■ విజయవాడ,బందర్ రోడ్, గంగూరులో 1237, 1270 చ.అ.ల 2 BHK ఫ్లాట్స్ మరియు 1803, 1805 చ.అ.ల 3 BHK ఫ్లాట్స్ అమ్మకమునకలవు. ఫుల్ ఫినిష్. బ్యాంక్‌లోన్ సౌకర్యం కలదు. AP RERA No. P06180044432. ✆ 97016 89312

SERVICES
BUSINESS OFFER
■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్డ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ ✆ 99516 86858
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

WANTED
■ బజాజ్ ఫైనాన్స్ అనుబంధ సంస్థ నందు అనుభవం గల ఫిమేల్ టెలీకాలర్స్ కావలెను. Salary + Incentive. Ph: 94947 45219
■ DTP ఆపరేటర్స్: శ్రీ అమా పబ్లికేషన్స్ వారి బుక్ వర్క్ చేయుటకు అనుభవజ్ఞులైన అభ్యర్థులు అధిక జీతంతో మాచవరం, VJA నందు పని చేయుటకు కావలెను. ✆ 96409 99794
■ ప్రముఖ బ్యాంకు అనుబంధ సంస్థలో పని చేయటకు రిటైర్డు, VRS,టీచర్స్ కావలెను. Qly. SSC To PG, Fixed Salary, + PF + ESI + Medical Benefits ✆ 8790254105
■ సెక్యూరిటీ గార్డులు, ఫీల్డ్ ఆఫీసర్, హౌస్ కీపింగ్ వర్కర్లు, సూపర్‌వైజర్లు, ఆయాలు కావలెను, మంచి జీతం. సంప్ర॥ ✆ 94927 95141
■ Wanted Lady Teachers from Nursery to 10th Classes for all Subjects & PRO's Chess. St. Thomas E.M High School, 1 Town, VJA ✆ 98853 77263
■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-20 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217
■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోమ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15-25 వేలు, మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 79934 59404
■ మా సంస్థ నందు పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ వర్క్ చేయుటకు యువతీ/ యువకులు కావలెను. ఆకర్షణీయమైన సంపాదన. Cont: 70328 56389
■ శ్రీమంతుల ఇళ్ళలో పనిచేయుటకు పెద్దవారిని, పిల్లలను, పేషంట్లను 24/7 చూసుకొనుటకు వర్కర్స్ & ANM, GNM కావలెను. జీ: 15K-18K, భోజనము, రూము ఉచితం ✆ 9154802910, 9154802911,14.
■ VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ :15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyb. 6309020999
■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, వంట/ఇంటిపనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 20K. ఫోన్: 8977639662 / 8977639663

www.sakshi.com

7995092112 9010131135 9505507329 9010577706 9010210382
రూ.600/ రూ.150/ + 5% GST

క్లుప్తంగా

నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందిన ఉప్పుగళ్ల సాయిమహేష్ అలియాస్ నాని నగర బహిష్కరణను మరో ఆర్నెల్లు పొడిగిస్తూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ మత్తు పదార్థాలు తీసుకుని అల్లర్లకు పాల్పడే నేపథ్యం ఉన్న సాయిమహేష్ గతంలో పలుమార్లు జైలు జీవితం అనుభవించాడని, అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గతంలోనే నగరం నుంచి బహిష్కరించామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బహిష్కరణలో ఉన్నప్పటికీ అతని ప్రవర్తన సజావుగా లేదని వచ్చిన సమాచారం మేరకు ప్రజా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని సాయిమహేష్ నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు.

నగర బహిష్కరణ ఉల్లంఘన : సస్పెక్ట్ షీటర్ అరెస్టు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగర బహిష్కరణను ఉల్లంఘించిన సస్పెక్ట్ షీటర్‌ను కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సారంగం రోడ్డులోని కటికల మస్తాన్ వీధికి చెందిన షేక్ సలీం(32) చికెన్ షాపులో పని చేస్తుంటాడు. చెడు వ్యసనాలకు బానిసైన సలీంపై కొట్లాటలు, గంజాయి అక్రమ రవాణా వంటి 17 కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది డిసెంబర్ 29న సలీంకు నగర పోలీస్ కమిషనర్ నగర బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది రోజుల కిందట సారంగం రోడ్డులోని ఇంటికి వచ్చిన సలీం మళ్లీ ఇంటి వద్ద గొడవ చేయడంతో పాటు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సలీంను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అప్పులు ఎక్కువ కావడంతో తన భర్త కనిపించకుండా పోయాడని భార్య కొత్తపేట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన కొండేటి పావని, వెంకట సాయిబాబు భార్యభర్తలు. వీరిది ప్రేమ వివాహం. వీరికి ఒక పాప సంతానం. సాయిబాబు వన్‌టౌన్‌లోని ఓ షాపులో పని చేస్తుంటాడు. గత కొద్ది రోజులుగా తనకు అప్పులు ఎక్కువయ్యాయని సాయిబాబు ఇంట్లో చెప్పి బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య పావని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట సప్తగిరి బ్యాంక్ సమీపంలో ఓ కుటుంబానికి చెందిన యువతి(20) ఇంటర్ మీడియెట్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన మేనమామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మరో యువతి...

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతి అదృశ్యంపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం హెచ్‌బీ కాలనీ ఎంఐజీకి చెందిన యువతి బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ చదువుతోంది. మెడికల్ ట్రైనింగ్ నిమిత్తం కొత్త ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వస్తోంది. ఈ క్రమంలో ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్ పి.రాజేష్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. రాజేష్‌కుమార్‌ను ప్రేమిస్తున్నట్లు తన అన్నకు తెలిపింది. రెండు నెలలుగా అతను మాట్లాడడం లేదని, తనను పట్టించుకోవడం లేదని, నమ్మించి మోసం చేశాడని తనలో తాను బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ఆమెకు నచ్చచెపుతూ వచ్చారు. ఈ క్రమంలో ఈనెల 23వ తేదీ సాయంత్రం యువతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో యువతి అన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేష్‌కుమార్‌తో ప్రేమ వ్యవహారం ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై భవానిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణపతికి పంచామృత అభిషేకాలు


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మంగళవారం గణపతికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీలక్ష్మీ గణపతి విగ్రహం వద్ద గణపతి స్వామి వారి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అర్చన, గణపతి మంత్ర హవనంను ఆలయ వైదిక కమిటీ నిర్వహించింది. స్వామి వారికి నిర్వహించిన అభిషేకాలు, అర్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొని తమ పేరిట పూజలు జరిపించుకున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పాతటైర్లు నిలువపెడుతున్న వ్యాపారులు
- తరచుగా ప్రమాదాలకు కారణభూతమవుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న స్థానికులు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



నెల రోజుల క్రితం రెండవ క్రాస్ మూడవ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తగులబడుతున్న టైర్లు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద భారీ సంఖ్యలో నిలువ ఉంచిన పాత టైర్లు

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదం పొంచి ఉంటోంది. పలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పాత టైర్లు పెట్టడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూతా వీటిని పెడుతున్నారు. అప్పుడప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు నిప్పులు వస్తుంటాయి. మూడు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద టైర్లు పెట్టడం వల్ల తగులపడి విద్యుత్ తీగలన్నీ కాలిపోయాయి. అక్కడ ఉన్న టైర్లు అన్నీ కాలి బూడిదయ్యాయి. ప్రతి ఏడాది ఏదో ఒక చోట ఇలాంటి ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. గతంలో పలు చోట్ల ఇలాంటి సంఘటనలు జరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూతా వీటిని పెడుతున్నారు. అప్పుడప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. ఈ కారణంగా మధ్యమధ్యలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ప్రతి వేసవి కాలంలో ఇలాంటి ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయి. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గాను విద్యుత్ అధికారుల ముందస్తు చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పాత టైర్లు ఉంచకుండా చర్యలు తీసుకుంటే ప్రమాదాలను తగ్గించవచ్చని స్థానికులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా ఆటోనగర్‌లోని రెండవ క్రాస్‌రోడ్డు మూడవ రోడ్డు, 4వరోడ్డు, 5వ క్రాస్‌రోడ్డు, ఫేస్ టూ రోడ్డులో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఇవి కాకుండా పలు ప్రాంతాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి. విద్యుత్ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



చెట్ల మధ్యలో నుంచి వెళ్లిన విద్యుత్ వైర్లు



మూడవ క్రాస్ రోడ్డులో ...



తగులపడిన ట్రాన్స్‌ఫార్మర్

ఇరుకు రోడ్లలో ప్రయాణికుల అవస్థలు

- రహదారులపైనే వాహనాల పార్కింగ్
- నిత్యం ట్రాఫిక్ జామ్
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



జనశిక్షణ సంస్థాన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం(ఫైల్)

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అది మొగల్రాజపురం ప్రాంతం. ఈ ప్రాంతం మొత్తం చాలా వరకు కొండ ప్రాంతం. ఇక్కడ ఉన్న ఇరుకు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించడానికి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

- నిమ్మతోట సెంటర్ నుంచి సిద్ధార్థ జంక్షన్‌కు వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉంటుంది. ఈ రోడ్డుపైనే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఈ రోడ్డులో నివాసం ఉండే వారి అపార్ట్‌మెంట్‌లో కార్లకు పార్కింగ్ స్థలాలు ప్రత్యేకంగా ఉన్నా కూడా రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళ ట్రాఫిక్ జామ్‌లు జరుగుతున్నాయి. ప్రధాన రహదారులు, రద్దీ కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ప్రాధాన్యం ఇస్తున్నారే కాని అంతర్గత రహదారులపై కనీసం ఒక్కసారి కన్నెత్తి చూడటం లేదు.
- బోయపాటి మాధవరావు రోడ్డులోనూ ఇదే పరిస్థితి. బందులదొడ్డి సెంటర్, చంద్ర రాజేశ్వరరావు నగర్, భాలభాస్కరనగర్, ధనకొండ, సీఎస్ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చి, సీఎస్ఐ స్కూల్ ప్రాంతాల్లోని నివాసితులు అందరూ ఈ రోడ్డులో నుంచే నగరంలోకి చేరుకోవాలి. అంత ప్రాధాన్యత ఉన్న ఈ రోడ్డుపై కూడా వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌తో కొంత భాగం ఆక్రమించుకుంటే మరికొంత భాగం దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటిని దాటుకుని వాహనాలు వెళ్లాలంటే వాహనచోదకులకు సర్కస్ ఫీట్లు తప్పడం లేదు.
- జమ్మిచెట్టు సెంటర్ నుంచి శివాలయం రోడ్డు మీదుగా మొగల్రాజపురంలోకి వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ కూడా రోడ్డుపై కార్లు పార్కింగ్ చేస్తున్నారు.
- మధు చౌక్ నుంచి పిన్నమనేని వారి వీధి, దాసరి లింగయ్య, వీధి, రత్నమాంబ వీధుల్లో కూడా ఇదే విధమైన పరిస్థితి.
- రహదారులపై పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించడం వల్ల ట్రాఫిక్ స్తంభించే సమస్యను కొంతవరకు పరిష్కరించవచ్చు. ఆ దిశగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాల్సిందిగా వాహనదారులు కోరుతున్నారు.

డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పొట్టి శ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇ.కోటేశ్వరరావు అన్నారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విలువలతో ఉండాలని, కుటుంబ విలువలు, శారీరక, మానసిక ఆరోగ్యాల ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని అడుగులు వేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. మాదకద్రవ్యాలు జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తాయో, ఎటువంటి పతనావస్థకి చేరుస్తాయో ముందుగానే తెలుసుకొని సక్రమమైన మార్గంలో జీవించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాలభవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ ఒ.నజ్మా మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు విజయవాడ, పరిసర ప్రాంతాలలో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. కాంటెస్ట్‌లో గెలుపొందిన విజేతకు రూ.5వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు అంతఃకరణ శుద్ధితో పాటుపడతామని, విజయవాడ సిటీని డ్రగ్ ఫ్రీ సిటీగా ఉంచటానికి సహకరిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ వి.రవికాంత, అధ్యాపకులు గురుదేవి, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ జ్యోతి చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి

రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



మంత్రి పార్థసారథిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేసి ప్రజలకు సేవలందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, అసోసియేషన్ సభ్యులతో కలిసి మంగళవారం మంత్రి కొలుసు పార్థసారథిని నగరంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తనను కలిసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి పార్థసారధి పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు కృషిచేయాలన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రం దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలంటే ఉద్యోగుల సహకారం ఎంతో అవసరం అన్నారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి రావలసిన ప్రతి ప్రయోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఉద్యోగి సంతోషంగా విధులు నిర్వహించేలా, సంతృప్తికర స్థాయిలో ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. మంత్రి పార్థసారథిని కలిసిన వారిలో కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.రమేష్, కోశాధికారి వి.సతీష్, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి దిలీప్, శివలీల, నగర శాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, కార్యదర్శి షేక్ నజీరుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమూరి ప్రసాద్, ఉపాధ్యక్షులు పి.మధుసూదన రావు, కేసర్ గణేష్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు అక్కిరాజు, నాలుగవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, సహాధ్యక్షుడు పి.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం నాగాయలంకకు చెందిన నటరాజ డ్యాన్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై గిరీష్‌కుమార్ శిష్య బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

మంత్రిని సత్కరించిన ఆర్‌ఎంపీ సంఘం నేతలు



పెనమలూరు: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని రాష్ట్ర ఆర్‌ఎంపీ సంక్షేమ సంఘ నేతలు(ఆర్‌ఎంపీడబ్ల్యూఏ) సత్కరించారు. కానూరు మంత్రి కార్యాలయంలో మంగళవారం సంఘ నేతలు మంత్రి పార్థసారథిని కలిసి శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఉస్మాన్, సంఘ సభ్యులు అయోధ్య సత్యనారాయణ, పి.సత్యనారాయణ, ఆర్.విద్యాసాగర్, బర్కతుల్లా, బి.వి.శ్రీనివాస్, బి.మోహన్, లక్ష్మీకాంత్, గురువర్మ, ఇనయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సీటు భర్తీకి రేపు ప్రవేశ పరీక్ష

గన్నవరంరూరల్: గురుకులంలో సీటు భర్తీకి ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వీరపనేనిగూడెం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోగా పాఠశాలలో దరఖాస్తులు అందించాలని సూచించారు. 6వ తరగతిలో ఎస్సీ కేటగిరికి ఒక సీటు ఖాళీ ఉందన్నారు.

సెమీ కండక్టర్ రంగంలో అద్భుతమైన ప్రగతి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతదేశం సెమీ కండక్టర్ రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని కేఎల్ విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈసీఈ ఆచార్యుడు డాక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సీమన్ మెన్స్ ఇంటిగ్రేటెడ్ సెన్సార్ టెక్నాలజీ అంశంపై ఐదు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ మంగళవారం ఆ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో సాంకేతిక ప్రగతి పరుగులు తీస్తోందన్నారు. ఆ క్రమంలో అనేక రంగాలు సైతం అభివృద్ధి బాట పడుతున్నాయన్నారు. దేశంలో సెమీ కండక్టర్ రంగంలోనూ వేగవంతమైన ప్రగతి చోటు చేసుకుందన్నారు. సెమీ కండక్టర్ రంగంలో ఉత్పత్తి దేశంలో చాలా తక్కువగా ఉందన్నారు. అవసరం మేరకు ఉత్పత్తి లేకపోవటంతో ఇతర అనుబంధ రంగాల్లో ప్రగతి కుంటుపడుతుందన్నారు. ఈ రంగంలో అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని చెప్పారు. మరో వక్తగా హాజరైన అమృత స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆచార్యులు డాక్టర్ పి.దీపక్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సెమీకండక్టర్స్ సాంకేతికతపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలువాది మల్లికార్జునరావు, చిట్టా ఆమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు వారివారి రంగాల్లో చోటు చేసుకున్న ప్రగతిని, నూతన ఆవిష్కరణలను వారికి తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు తమ రంగంలో ప్రగతిని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోశాధికారి కె.రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

పీడీఎస్‌యూ వినతి



వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు ఐ.రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని డీఈవో కార్యాలయంలో సహాయ సంచాలకురాలు జి.రాజేశ్వరికి మంగళవారం ఈమేరకు వినతిపత్రం అందజేశామని రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం మొదలైనా ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఇప్పటివరకు పాఠ్య పుస్తకాలు పూర్తిగా అందించలేదని పేర్కొన్నారు. 6,7 తరగతులు చదువుతున్న విద్యార్థులకు కొన్ని పాఠ్య పుస్తకాలు మాత్రమే అందించారని, దీనివల్ల పాఠాలు అర్థం కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. జిల్లా పరిషత్, కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులందరికీ తక్షణమే పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందివ్వాలని కోరారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యాన్ని మరింత మెరుగుపరచాలని, ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టుల్ని ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులపై కూడా విద్యాశాఖాధికారుల నియంత్రణ ఉండాలని, పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫారాలు, టర్మ్ ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలను తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నాయని వీటిని నియంత్రించాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు ఎల్.శివ, బి.గణేష్, ఎస్.వెంకట్ వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

ఘనంగా సంకట హరచతుర్థి పూజలు



శ్రీశివజ్ఞాన పీఠంలో స్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన మంగళవారం సంకట హరచతుర్థి పురస్కరించుకుని వినాయకునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి విశేషంగా పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

శ్రీశివజ్ఞాన పీఠంలో..

శ్రీశివజ్ఞాన పీఠంలో మంగళవారం సంకట హరచతుర్థి పురస్కరించుకుని లోక కల్యాణార్థం గణపతికి కొబ్బరి నీళ్లు, చెరుకు రసం, తేనె, మామిడి పండ్లతో అభిషేకం నిర్వహించారు. స్వామివారికి పీఠాధిపతి శివాచార్య స్వామి విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పేద కుటుంబానికి దీవెన ఫౌండేషన్ వితరణ



నాగలక్ష్మి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న రామచంద్రరావు, పోలీసులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలిక, దివ్యాంగుడైన ఆమె సోదరుడి కుటుంబానికి విజయవాడ దీవెన ఫౌండేషన్ వితరణ చేసింది. ఏలూరు జిల్లా ముదినేపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి కాలువగట్టుపై నివసిస్తూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమెకు 13 సంవత్సరాల వయసు కలిగిన పుష్పలత, పదేళ్ల వయసుగల యశ్వంత్ సంతానం ఉన్నారు. పుష్పలత కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, యశ్వంత్ మెంటల్లీ డిజార్డెడ్ కావడంతో మంచంమీదే ఉంటున్నారు. ఒక వైపు పిల్లల అనారోగ్యం మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో రోజు గడవటం కూడా కష్టతరం కావడంతో వారు సాయం కోసం దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. తక్షణమే స్పందించిన ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు, సభ్యులు కలిసి కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతోపాటు రూ.4వేలు నగదు వితరణ చేశారు. వాటిని మండవల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామచంద్రరావు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ మంగళవారం నాగలక్ష్మి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఇంటికి మగ దిక్కు లేక నిస్సహాయ స్థితిలో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకున్న దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారికి నాగలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినీ సంగీత విభావరి కార్యక్రమంలో పాల్గొన్న కె.రాజు, దేవిడ్ రాజు, చిట్టిబాబు తదితరులు

విజయవాడకల్చరల్: సినీ సంగీత వారోత్సవాల్లో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద మంగళవారం ప్రణవీ మ్యూజిక్ అకాడమీ, పల్లెంకొండ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయకులు మారేపల్లి జోషి, సింధూ, శ్రీనివాసరావు, సుహాసిని తదితరులు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కే డేవిడ్‌రాజు, సీహెచ్ చిట్టిబాబు, కే రాజు పాల్గొన్నారు. నిర్వాహకుడు చిట్టిబాబు మాట్లాడుతూ బుధవారం కార్యక్రమాన్ని తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వారు నిర్వహించనున్నట్లు తెలిపారు.



క్లుప్తంగా...

మాజీ వలంటీర్‌పై టీడీపీ నాయకుల దాడి


గాయపడిన స్వామినాయుడు

మెంటాడ: విజయనగరం జిల్లా మెంటాడ మండలం జక్కువ గ్రామానికి చెందిన మాజీ వలంటీర్ గుణుపూరి స్వామి నాయుడుపై టీడీపీ నాయకులు మంగళవారం దాడి చేశారు. మాజీ వలంటీర్లు గుణుపూరి స్వామినాయుడు, కర్రి బాలరాజు విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రానికి వెళ్లారు. విత్తనాల కోసం వ్యవసాయ సహాయకుడిని వాకబు చేసే సమయంలో ఇక్కడ మీకేం పని అంటూ టీడీపీ నాయకులు వానిపల్లి సత్యం (డీలర్), కృష్ణ వాగ్వాదానికి దిగారు. విత్తనాలకు డబ్బులు కట్టామని, తీసుకునేందుకు వచ్చామని మాజీ వలంటీర్లు చెప్పినా వినిపించుకోకుండా అక్కడే ఉన్న కుర్చీతో స్వామినాయుడు తలపై బలంగా కొట్టారు. స్వామినాయుడుకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు మెంటాడ పీహెచ్‌సీకి తరలించారు. వలంటీర్ల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నీతులు చెబుతూ దాడులను ప్రోత్సహిస్తున్నారు

సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ సీఎం చంద్రబాబు నీతులు చెబుతూనే దాడులను ప్రోత్సహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం లోక్‌సభ సభ్యుడిగా తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కడప నియోజకవర్గం నుంచి వరసగా మూడోసారి గెలుపొందడంపై సంతోషం వ్యక్తం చేస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కడప ప్రజల మద్దతు, కార్యకర్తల కష్టంతోనే తాను విజయం సాధించానని చెప్పారు. టీడీపీ మద్దతుతో కేంద్రంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం ఉందని.. అయినప్పటికీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్ చేయకపోవడం ప్రజా ద్రోహమన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఎవరిపైనా దాడులు చేయలేదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఎవరూ పార్టీని వీడే ప్రసక్తే లేదని, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని, జగన్ వెంటే తామంతా ఉంటామని స్పష్టం చేశారు.

గంజాయి పేరుతో గిరిజన యువతకు వేధింపులు

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్


డీజీపీకి వినతిపత్రం అందిస్తున్న శంకర్‌నాయక్

సాక్షి, అమరావతి: గంజాయి పేరుతో గిరిజన యువతను పోలీసులు నిరంతరం వేధిస్తున్నారని, కేసులు పెట్టి రోజుల తరబడి జైలులో పెడుతున్నారని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు దృష్టికి తెచ్చారు. మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం డీజీపీని కలిసిన శంకర్ నాయక్ వినతిపత్రం సమర్పించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో గంజాయి రవాణా కోసం నిరుద్యోగ గిరిజన యువతను కొందరు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. మానవతా దృక్పథంతో క్షేత్ర స్థాయిలో వాస్తవాలు పరిశీలించి గిరిజన యువతపై వేధింపులకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన నిరుద్యోగ యువత పోలీస్ శాఖలో పనిచేయాలనే ఆకాంక్షతో ఉన్నారని, పోలీసు శాఖలోని బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని శంకర్ నాయక్ కోరారు.

వైఎస్సార్‌సీపీ నేతల షాపులు కూల్చివేత


యనమలకుదురులో దుకాణాలు కూల్చేస్తున్న అధికారులు

పెనమలూరు: కృష్ణా జిల్లా యనమలకుదురులో వైఎస్సార్‌సీపీ నాయకుల దుకాణాలను తాడిగడప మునిసిపాలిటీ అధికారులు మంగళవారం కూల్చివేశారు. వైఎస్సార్‌సీపీ నేత, గౌడ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, ఈడే గోపాలకృష్ణకు చెందిన దుకాణాలను అధికారులు దౌర్జన్యంగా జేసీబీతో కూల్చివేశారు. యనమలకుదురు కొండ వెనుక ఉన్న దుకాణాలకు అనుమతులు లేవని అధికారులు ఈ చర్యకు పాల్పడ్డారు. ఇదే ప్రాంతంలో టీడీపీకి చెందిన వారి దుకాణాల జోలికి మాత్రం వెళ్లకపోవడం గమనార్హం. తమ దుకాణాలను కావాలనే అధికారులతో టీడీపీ నేతలు కూల్చివేయించారని ఈడే గోపాలకృష్ణ ఆరోపించారు.

మా ఆస్తులనే అమ్ముకుంటున్నాం

హైకోర్టుకు విశాఖ ఉక్కు యాజమాన్యం నివేదన • స్టేటస్ కో ఉత్తర్వులు సవరించాలని అభ్యర్థన



సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన భూములు, ఇతర ఆస్తుల విక్రయాల విషయంలో యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని విశాఖ ఉక్కు యాజమాన్యం (ఆర్‌ఐఎన్ఎల్) మంగళవారం హైకోర్టును కోరింది. స్టీల్ ప్లాంట్ ఆర్థిక అవసరాల నిమిత్తం సొంత ఆస్తులను విక్రయించుకునే హక్కు తమకు ఉందని, స్టేటస్ కో ఉత్తర్వుల వల్ల విక్రయాల ప్రక్రియ నిలిచిపోయిందని ఆర్‌ఐఎన్ఎల్ తరఫు సీనియర్ న్యాయవాది శ్రీనివాస్ నివేదించారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం తాము సొంతంగా ఏపీఐఐసీ, హౌసింగ్ బోర్డు నుంచి భూములు కొన్నామని, కేంద్ర ప్రభుత్వం కూడా భూ సేకరణ ద్వారా పెద్ద మొత్తంలో భూములు సేకరించిందని తెలిపారు. కేంద్రం సేకరించిన భూముల జోలికి తాము వెళ్లడం లేదని, తాము కొనుగోలు చేసిన 24.99 ఎకరాల భూమినే అమ్ముకుంటున్నామని పేర్కొన్నారు.

భూముల విక్రయానికి వేలం ప్రక్రియ కూడా మొదలైందని, 170 మంది బిడ్డర్లు పాల్గొనగా 72 మందిని హెచ్-1 బిడ్డర్లుగా ప్రకటించినట్లు చెప్పారు. హెచ్-1 బిడ్డర్ల నుంచి రూ.243 కోట్లు రావాల్సి ఉండగా, రూ.45 కోట్లు ఇప్పటికే జమ చేశారన్నారు. స్టేటస్ కో ఉత్తర్వుల వల్ల మిగిలిన మొత్తాన్ని జమ చేయకుండా నిలిపివేయడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. స్టేటస్ కో ఉత్తర్వుల విషయంలో స్పష్టత కోసం హైకోర్టులో దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించారు. అనుబంధ పిటిషన్‌లో కోరిన విధంగా స్టేటస్ కో ఉత్తర్వులను సవరించడం వల్ల ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వుల సవరణ కోసం ఆర్‌ఐఎన్ఎల్ అనుబంధ పిటిషన్‌పై కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లందరినీ ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గా ప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రైవేటీకరణపై ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు..

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాజీ ఐపీఎస్ జేడీ లక్ష్మీనారాయణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌తో పాటు సువర్ణరాజు అనే వ్యక్తి కూడా వేర్వేరుగా పిల్స్ దాఖలు చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

అమ్మకం కాదు.. పెట్టుబడుల ఉపసంహరణ

కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) బి.నరసింహశర్మ వాదనలు వినిపించారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం భూ సేకరణ ద్వారా 21 వేల ఎకరాలు సేకరించామన్నారు. ఇవి కేంద్ర ప్రభుత్వానికి చెందుతాయన్నారు. మిగిలిన భూములు ఆర్‌ఐఎన్ఎల్‌కే చెందుతాయన్నారు. అసలు తాము విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మడం లేదని, కేంద్ర ప్రభుత్వానికి ఉన్న 100 శాతం పెట్టుబడులను ఉపసంహరిస్తున్నామని తెలిపారు. ఇదే రీతిలో దేశవ్యాప్తంగా 8 యూనిట్లల్లో పెట్టుబడులను ఉపసంహరిస్తున్నామన్నారు. ఆర్‌ఐఎన్ఎల్ ఆస్తులతో తమకు సంబంధం లేదన్నారు. వాళ్ల ఆస్తులను వాళ్లు అమ్ముకోవచ్చునన్నారు.

మూడు రోజులు వానలు!

నేటి నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షాలకు అవకాశం

రాయలసీమలో తేలికపాటి వానలు!

గంటకు 40-50 కి.మీ.ల వేగంతో గాలులు..



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం చురుకుగా మారాయి. మరోవైపు రాష్ట్రంపైకి దిగువ ట్రోపోస్ఫిరిక్ స్థాయిలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రానున్న మూడు రోజులు ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. బుధ, గురు, శుక్రవారాల్లో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని పేర్కొంది. అదేసమయంలో గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతోపాటు కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడతాయని వివరించింది. ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా, మంగళవారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, కాకినాడ, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు అనకాపల్లి జిల్లా కొక్కిరాపల్లిలో 7.3 సెం.మీ.ల భారీ వర్షం కురిసింది. అడ్డతీగల (అల్లూరి సీతారామరాజు) 5.2, సాలూరు (పార్వతీపురం మన్యం) 4.7, పెందుర్తి (విశాఖపట్నం) 4.5, హరిపురం (శ్రీకాకుళం) 4.5, డి.పోలవరం (కాకినాడ) 4.1, దత్తిరాజేరు (విజయనగరం) 3.8 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది.

విధ్వంసం... అరాచకం..


తాళ్లపాలెంలో ధ్వంసం చేసిన గ్రామ సచివాలయ భవన నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకం

సాక్షి నెట్‌వర్క్: టీడీపీ కార్యకర్తల విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రగతి పనులకు సంబంధించిన శిలాఫలకాలను పలుచోట్ల ధ్వంసం చేశారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తాళ్లపాలెం సచివాలయ భవన నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన శిలాఫలకాన్ని టీడీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు, మండల ప్రజాప్రతినిధుల పేర్లతో ఈ శిలాఫలకాన్ని ఏర్పాటుచేయగా.. దానిని పగులగొట్టారు. టీడీపీ నాయకుడు, సర్పంచ్ యర్రా రామకృష్ణ ఇంటి ముందు రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేశారు.

జెండా దిమ్మె ధ్వంసం


చంద్రగిరికోటలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె

తిరుపతి జిల్లా చంద్రగిరికోటలో వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను మంగళవారం తెల్లవారుజామున టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చంద్రగిరిలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని పోలీసులను వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.

జగనన్న కాలనీలో రాళ్లు ధ్వంసం

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం కొత్తపూసలమర్రులో టీడీపీ నాయకులు దాష్టీకానికి తెగబడ్డారు. జగనన్న కాలనీలో సరిహద్దు రాళ్లు ధ్వంసం చేశారు. పైప్‌లైన్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. గ్రామ టీడీపీ నాయకులు కొల్లాటి గోవిందరాజు, బస్వాని పోతురాజు, బర్రి నాగరాజు, జల్లా బుజ్జి, బొమ్మిడి పోతురాజు, ఒడుగు సామేరు, కొయ్యలగడ్డ బాలాజీ తదితరులు వచ్చి పైప్‌లైన్ పనులను అడ్డుకున్నారని గ్రామస్తులతోపాటు అభివృద్ధి కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వలేదని, జగనన్న ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇస్తే పనులను అడ్డుకుంటున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.


కొత్తపూలసమర్రులో సరిహద్దు రాళ్లను ధ్వంసం చేస్తున్న టీడీపీ నాయకుడు బస్వాని పోతురాజు


జగనన్న కాలనీలో నిలిపివేసిన పైపులైన్ పనులు

వైఎస్సార్‌సీపీ బీసీ నేత పొగాకు బ్యారన్‌ల ధ్వంసం

ప్రకాశం జిల్లాలో టీడీపీ నేతల ఒత్తిడితో నోటీసు ఇచ్చిన గంటలోపే కూల్చివేత


జేసీబీతో బ్యారన్‌లు కూల్చేస్తున్న దృశ్యం

టంగుటూరు: ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు అరాచకం సృష్టించారు. వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడికి చెందిన పొగాకు బ్యారన్‌లను గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసు ఇచ్చిన గంటలోనే జేసీబీలతో కూల్చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు మార్పూరి వెంకట్రావు 519 సర్వే నంబరులో 61వ ప్లాటులో మూడు పొగాకు బ్యారన్‌లు నిర్మించుకుంటున్నాడు. మార్పూరి వెంకట్రావు పంచాయతీకి చెందిన స్థలంలో అక్రమంగా పొగాకు బ్యారన్‌లు నిర్మిస్తున్నారంటూ గ్రామానికి చెందిన టీడీపీ సర్పంచ్ కుమారులు వెంకట్రావు, శ్రీను గతంలో హైకోర్టుకు వెళ్లారు. నిర్మాణం నిలిపేయాలని కోరారు. అయితే సదరు సర్వే నంబరులో 61వ ప్లాటులో తనకు పట్టా ఉందని.. అందుకే అందులో పొగాకు బ్యారన్‌లు నిర్మించుకుంటున్నానని మార్పూరు వెంకట్రావు కోర్టుకు విన్నవించాడు. దీంతో కోర్టు సదరు నిర్మాణాలపై ఎటువంటి చర్యలు తీసుకోరాదంటూ ఈ నెల 2వ తేదీ నుంచి 6 వారాల పాటు స్టే విధించింది. ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో మంగళవారం ఉదయం 10.30 గంటలకు పంచాయతీ స్థలంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని, స్థలాన్ని ఖాళీ చేయాలంటూ పంచాయతీ కార్యదర్శి బాషా నోటీసు ఇచ్చి.. గంట వ్యవధిలోనే పోలీసుల సమక్షంలో జేసీబీలు తెచ్చి మరీ బ్యారన్‌లను కూల్చేశారు.

అధికారం ఇచ్చింది అరాచకాలు చేయటానికి కాదు: మాజీ మంత్రి సురేష్

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు అధికారం ఇచ్చింది అరాచకాలు చేయటానికి కాదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల మీద దాడులకు దిగుతూ, వారి ఆస్తులు ధ్వంసం చేస్తూ ఉంటే కళ్లు తెరిచి చూస్తున్నారే తప్ప ఎక్కడా పోలీస్ వ్యవస్థ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు కక్ష సాధింపు నోటీసులు


నరసరావుపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నోటీసు అతికించి ఫొటో తీసుకుంటున్న అధికారులు


ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని నిర్మాణంలో ఉన్న కార్యాలయానికి అతికించిన నోటీసులు


పార్వతీపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి నోటీసు అతికించిన సచివాలయ సిబ్బంది

- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న దాష్టీకాలు
- ఏడు రోజుల్లో కట్టడాలు తొలగించాలంటూ హెచ్చరిక

ఉండి/పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ కార్యాలయాల మీద కక్షసాధింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలోని వైఎస్సార్ విగ్రహాలు, ప్రభుత్వ భవన శిలాఫలకాలను ఓవైపు ధ్వంసం చేస్తుండగా.. మరోవైపు పార్టీ కార్యాలయాలను తొలగించాలంటూ నోటీసులు జారీ చేస్తూ రాక్షసానందం పొందుతున్నారు. దీనిలో భాగంగానే మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ నిర్మాణం, పార్వతీపురం జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయానికి నోటీసులు ఇచ్చారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కార్యాలయానికి సంబంధించి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పేరిట నోటీసులు ఈ నెల 22న, 25న జారీ చేసినట్లు ప్రస్తుత, పాత తేదీల్లో ముద్రించి నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయం గోడలకు అతికించారు. నోటీసులు అందుకున్న ఏడు రోజుల్లో కట్టడాలను కూల్చాలని, లేదంటే తామే కూల్చివేస్తామని హెచ్చరిక జారీ చేశారు. అయితే పార్టీ కార్యాలయాల నిర్మాణం ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు.

పల్నాడు జిల్లా కార్యాలయానికి నోటీసులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట లింగంగుంట్ల కాలనీలో సుమారు 1.5 ఎకరాల రెవెన్యూ స్థలంలో నిర్మించిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ అధికారులు మంగళవారం నోటీసులు అంటించారు. తమ శాఖ ముందస్తు అనుమతులు తీసుకోకుండా పరిమితికి మించి భవన నిర్మాణం చేశారని, ఏడు రోజుల్లోగా సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో ఈ నిర్మాణాన్ని తొలగిస్తామని ప్లానింగ్ అధికారి భాస్కర్ పేరుతో ఉన్న నోటీసును పొడా అధికారి రఘురామ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ అంటించారు. ఎన్నికల ముందే భవన నిర్మాణం పూర్తికాగా, ఎన్నికల కోడ్ అడ్డు రావటంతో కార్యాలయాన్ని ప్రారంభించలేదు. ఇప్పుడు నోటీసులు ఇవ్వడం కేవలం కక్ష సాధింపులో భాగమేనని వైఎస్సార్‌సీపీ నాయకులు భావిస్తున్నారు.

టీడీపీ, జనసేన నేతల వీరంగం


పంచాయతీ కార్యాలయంలో ధ్వంసం చేసిన మాజీ సీఎంలు వైఎస్సార్, జగన్ చిత్రపటాలు


విధులు బహిష్కరించి పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేస్తున్న సిబ్బంది


పంచాయతీ కార్యాలయానికి కట్టిన టీడీపీ జెండా

- కార్లలో సైరన్ మోగించుకుంటూ ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వద్ద హడావుడి
- బాణసంచా కాల్చి కార్యాలయానికి టీడీపీ జెండా కట్టిన వైనం
- సర్పంచ్ రూమ్‌లో మాజీ సీఎంలు వైఎస్సార్, జగన్ చిత్రపటాలు ధ్వంసం
- కేక్ కట్‌చేసి గోడలకు, టేబుల్‌కు పులిమి రాక్షసానందం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ, జనసేన నాయకులు బరితెగించి విధ్వంసం సృష్టించారు. ఉదయం సుమారు 11 గంటల సమయంలో 11 మంది కార్లలో సైరన్ మోగించుకుంటూ వచ్చి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. పార్టీ జెండాలు పట్టుకుని టీడీపీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ పంచాయతీ కార్యాలయం కింద బాణసంచా కాల్చి హడావుడి చేశారు. బలవంతంగా కార్యాలయం పైకి చేరుకున్నారు. సర్పంచ్ రూమ్‌లోకి చొరబడి గోడకు ఉన్న మాజీ ముఖ్యమంత్రులు వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలను ధ్వంసం చేశారు. మరోపక్క ఫ్లెక్సీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చిత్రపటాన్ని పీకి పడేశారు. సర్పంచ్ టేబుల్‌పై కేక్ కట్‌చేసి టేబుల్‌కు, గోడలపైన పులిమారు. కార్యాలయం భవనానికి టీడీపీ జెండా కట్టి నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు దౌర్జన్యకాండ చేస్తున్న సమయంలో పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, కొందరు సిబ్బంది ఉన్నారు. కార్యాలయంలో విధ్వంసం గురించి సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, వార్డు, ఎంపీటీసీ సభ్యులకు సిబ్బంది సమాచారం అందించారు. వెంటనే కార్యాలయానికి చేరుకున్న సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పట్టపగలు ప్రభుత్వ కార్యాలయంలో ఈ విధంగా ప్రవర్తించడంపై భయాందోళనలకు గురైన సిబ్బంది విధులు నిర్వర్తించలేమంటూ కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న ఏసీపీ భాస్కరరావు, పటమట పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం : సర్పంచ్ పూర్ణచంద్రరావు

పంచాయతీ కార్యాలయంలో టీడీపీ నాయకులు చెలరేగి ప్రవర్తించడంపై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న ఎనికేపాడు గ్రామంలో ఈ విధంగా గొడవలు సృష్టించి ప్రజలను భయపెడుతున్నారని చెప్పారు. పంచాయతీ కార్యాలయం గోడలపై మాజీ సీఎంలు వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలతోపాటు వేరే పార్టీలకు చెందిన నాయకుల ఫొటోలు కూడా ఉన్నాయని తెలిపారు. కానీ వైఎస్సార్‌సీపీ నాయకులను రెచ్చగొట్టే విధంగా వైఎస్సార్, జగన్ చిత్రపటాలను, మాజీ ఎమ్మెల్యే వంశీ ఫ్లెక్సీని ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ సమయంలో కార్యాలయంలో ఉంటే తనపైనా దాడిచేసేవారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నాయకులు రాజకీయంగా ఎదగడాన్ని జీర్ణించుకోలేక ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలా దాడులు చేస్తుంటే పంచాయతీ కార్యాలయంలో విధులు ఎలా నిర్వర్తించాలని ప్రశ్నించారు. ఈ ఘటనపై వెంటనే విచారించి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కక్ష సాధింపులో భాగమే నోటీసులు

- నరసరావుపేటలోని వైఎస్సార్‌సీపీ ఆఫీసుకు అన్ని అనుమతులు ఉన్నాయి
- 'పొడా' నోటీసులపై హైకోర్టును ఆశ్రయించాం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి వెల్లడి



నరసరావుపేట: కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయాల నిర్మాణాలు అక్రమమంటూ ప్రభుత్వం నోటీసులు ఇస్తోందని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక లింగంగుంట్లలోని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి మంగళవారం పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పొడా) అధికారులు నోటీసులు ఇచ్చారు. తమ అనుమతులు లేకుండా పార్టీ కార్యాలయం నిర్మించారని, వారం రోజుల వ్యవధిలో తగిన సమాధానం ఇవ్వాలని పేర్కొంటూ నోటీసులను కార్యాలయానికి అంటించారు. డాక్టర్ గోపిరెడ్డి ఆ నోటీసులను పరిశీలించిన అనంతరం అక్కడే విలేకరుల సమావేశం నిర్వహించి వాస్తవాలను వివరించారు. 'మా కార్యాలయ నిర్మాణానికి చట్టప్రకారం అన్ని అనుమతులు తీసుకున్నాం. ఈ కార్యాలయ నిర్మాణం చేపట్టే నాటికి పొడా ఏర్పాటుకాలేదు. అందువల్ల పంచాయతీ తీర్మానం ప్రకారం భవన నిర్మాణం చేపట్టాం. ప్రభుత్వ భూములకు స్వల్పంగా డబ్బులు చెల్లించి 33 ఏళ్లు, 99 ఏళ్లకు లీజుకు తీసుకోవచ్చని 2015లో టీడీపీ ప్రభుత్వం జీవో నంబర్ 279ని జారీ చేసింది. దానిని అనుసరించే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా మా పార్టీ జిల్లా కార్యాలయానికి స్థలం కేటాయించింది. నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నిర్మించిన భూమి పుష్పగిరి పీఠాధిపతుల వారి నుంచి ప్రభుత్వానికి సంక్రమించిన రెవెన్యూ భూమి. 3.5 ఎకరాలు ఉన్న ఈ భూమిని ఆదాయపుపన్ను శాఖ కార్యాలయ నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వమే ఇచ్చింది. తొమ్మిదేళ్లుగా ఆ శాఖ తన కార్యాలయ నిర్మాణం చేపట్టకపోవడంతో రెవెన్యూ శాఖ ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. జీవో నంబర్ 364 ద్వారా వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి 1.5ఎకరాలు లీజుకు, ఏడు సెంట్లను డ్రగ్స్ కార్యాలయానికి, 15 సెంట్లను బీసీ భవన్ నిర్మాణానికి కేటాయించింది. దీనిపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని 2022, మే 2వ తేదీన ఏ-1 నోటీసు కూడా బహిరంగంగా ఇవ్వటం జరిగింది. లింగంగుంట్ల పంచాయతీలో కూడా ఆమోదించి ప్రత్యేక సమావేశంలో భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. భవన నిర్మాణం అనుమతి కోసం రూ.1,49,800 చెల్లించాం. ప్రభుత్వానికి 33ఏళ్ల లీజుకు సంబంధించిన నగదు రూ.49,500లను చలానా రూపంలో చెల్లించాం. ఈ భవనం 350 చదరపు మీటర్లకంటే ఎక్కువగా ఉన్నందున పొడా అనుమతి తీసుకోవాల్సి ఉందని ఇప్పుడు నోటీసులు ఇచ్చారు. 2022లో పొడా లేదు కాబట్టి దాని నుంచి అనుమతి తీసుకోలేదు. అవసరమైతే పొడా చెప్పినట్లుగా బిల్డింగ్ రెగ్యులరైజేషన్‌కు అవసరమైన ఫీజు చెల్లించేందుకు కూడా మా పార్టీ సిద్ధంగా ఉంది. పార్టీ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయింది. ఎన్నికల కోడ్ రావడం వల్ల ప్రారంభించలేకపోయాం. మాకు అన్ని అనుమతులు ఉన్నందున దీనిపై న్యాయ పోరాటం చేస్తాం. ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించాం. గుంటూరులో టీడీపీ కార్యాలయం వాగుపోరంబోకు, కుంట భూమిలో నిర్మించారు. కానీ, దానిని మాత్రం పట్టించుకోవడం లేదు.' అని గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 26-6-2024

**వీధి చివర బంకుల్లో మత్తు చాక్లెట్లు
కాలేజీ క్యాంపస్‌లో గంజాయి పొగ
పబ్‌లో మాదకద్రవ్యాలు
బుద్ధిగా చదువుకోవాల్సిన
టీనేజ్ పిల్లల్ని మత్తులోకి
లాగడానికి పొంచి ఉన్న డేగలు.
జాగ్రత్త... తల్లిదండ్రులూ.. జాగ్రత్త.
పిల్లలు తెలిసీ తెలియక చిక్కుకుంటారు.
గమనించాలి. చర్చించాలి.
కాపాడుకోవాలి.**



మత్తు డేగ ఎగురుతోంది... జాగ్రత్త

స్కూల్ వయసు పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా హర్యాణ రాష్ట్రంలో పోలీసులు ఆయా స్కూళ్లకెళ్లి వారిని చైతన్యపరిచే కార్యక్రమాలు చేస్తున్నారు. 'క్యాచ్ దెమ్ యంగ్' అనేది ఈ కార్యక్రమం పేరు. అంటే చిన్న వయసులోనే పిల్లల దృష్టిని ఆకర్షించి వారిని డ్రగ్స్ దుష్ప్రభావాల గురించి చెప్పాలి. ఇందుకు వారు అంబాలలోని ఒక ప్రయివేటు స్కూల్‌లో ప్రయోగాత్మకంగా ఒక ప్రయత్నం చేశారు. దాని పేరు 'చక్రవ్యూహ్'. వరుసగా ఉన్న ఐదు గదుల్లో రకరకాల పజిల్స్ ఇచ్చి ఒక గదిలో నుంచి మరో గదిలోకి కేవలం తెలివితేటల ఆధారంగా తలుపు తెరుచుకుని ప్రవేశిస్తూ అంతిమంగా బయట పడాలి. 'ఇది ఒక అద్భుత ప్రయోగం' అని విద్యార్థులు అంటున్నారు.

చక్రవ్యూహ్ ప్రయోగం

చక్రవ్యూహ్ అనేది ఒక పజిల్ గేమ్. ఆటోమేటిక్ తాళాలు ఉన్న గదుల్లోకి నలుగురు విద్యార్థుల బృందాన్ని పంపిస్తారు. ఆ బృందం అక్కడ తమ జీవితంలో ఎదురయ్యే రకరకాల సమస్యలను పజిల్స్ రూపంలో ఎదుర్కొంటుంది. అంటే పరీక్షలో ఫెయిల్ కావడం, మంచి ర్యాంక్ రాకపోవడం, నిరుద్యోగం, ఒంటరితనం, తల్లిదండ్రుల కొట్లాట... ఇలాంటి సమయంలో ఆ సమస్యలను ఎలా దాటాలో అక్కడే క్లూస్ ఉంటాయి. ఆ క్లూస్ ద్వారా ముందుకు సాగితే తర్వాతి గదిలోకి తలుపు తెరుచుకుంటుంది. ఇదంతా సీసీ టీవీల ద్వారా అధ్యాపకులు గమనిస్తూ ఉంటారు. అయితే ఈ ప్రతి సవాలు ఎదుర్కొనే సమయంలో ఆ సమస్య నుంచి పారిపోయి డ్రగ్స్‌ను ఎంచుకునే ఆప్షన్ కూడా ఉంటుంది. కాని ఈ మొత్తం చక్రవ్యూహ్‌లో కలిగే అవగాహన ఏమిటంటే నిజ జీవిత సమస్యల్ని తల్లిదండ్రుల, స్నేహితుల సాయంతో దాటితే వచ్చే కిక్కు డ్రగ్స్ తీసుకొని జీవితాన్ని నాశనం చేసుకోవడంలో లేదని తెలియడం. ఇలాంటి చక్రవ్యూహ్ ప్రయోగాన్ని హర్యాణలోని స్కూళ్లల్లో విస్తృతంగా నిర్వహించాలని పోలీసులు భావిస్తున్నారు. జీవితపు చక్రవ్యూహంలో చిక్కుకుంటే బయటపడే దారి ఉంటుంది గాని డ్రగ్స్‌లో చిక్కుకుంటే దారి ఉండదు అని తెలియడం వల్ల విద్యార్థులు చిన్న వయసులోనే గట్టి సందేశం అందుకుంటారు.

కుతూహలం, సాంగత్యం

టీనేజీ పిల్లలు అయితే కుతూహలం కొద్దీ లేదా దుష్ట సాంగత్యంలోని ఒత్తిడి వల్ల డ్రగ్స్‌ను ట్రై చేస్తున్నారని డీ అడిక్షన్ థెరపిస్టులు అంటున్నారు. పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని తల్లిదండ్రులు గమనించే లోపు వారి ప్రవర్తన పూర్తిగా మారిపోయి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. సరదా షికార్లు, స్లీప్ ఓవర్ల సమయంలో సరదా కొద్ది సీనియర్లో స్నేహితులో డ్రగ్స్ ఇస్తున్నారు. మొదటి ఒక రకం డ్రగ్స్ తీసుకున్నాక మెదడు ఇంకా 'హై' కావాలని కోరుకుంటుంది. దాంతో పిల్లలు ఇంకా ఎన్ని రకాల డ్రగ్స్ ఉన్నాయో చూద్దామని వెతుకులాట సాగిస్తారు. ఇక అంతటితో వారి చదువు, ఆరోగ్యం, ఏకాగ్రత, వ్యక్తిత్వం మొత్తం ధ్వంసమైపోతాయని డ్రగ్స్‌కు బానిసలైన టీనేజ్ విద్యార్థులను పరిశీలిస్తున్న డీ అడిక్షన్ థెరపిస్టులు తెలియచేస్తున్నారు.

ఎలా గుర్తించాలి?

మీ టీనేజ్ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని ఎలా గుర్తించాలి?

1. చాలా మూడీగా తయారవుతారు
2. సరిగా భోజనం చేయరు
3. సడన్‌గా కొత్త కొత్త స్నేహితులు ప్రత్యక్షమవుతుంటారు. తరచూ ఏవో పార్టీలున్నాయని వెళుతుంటారు.
4. గతంలో కంటే ఎక్కువ డబ్బు అడుగుతారు
5. పొడి పెదిమలు
6. ఎర్రబడ్డ కళ్లు
7. వాదనలకు దిగి ఆధిపత్యం ప్రదర్శించడం
8. కుటుంబంతో కలివిడిగా లేకపోవడం
9. అర్థం పర్థం లేని నిద్రా సమయాలు.

బయట పడేయాలి

డ్రగ్స్‌కు అలవాటు అయ్యారని తెలియగానే తల్లిదండ్రులు పిల్లల్ని మందలించడానికి చూస్తారు. వెంటనే ఆ పిల్లలు 'మీరిలా తిడితే ఇల్లు విడిచి వెళ్లిపోతాం' అని బ్లాక్‌మెయిల్ చేస్తారు. వీరిని చాలా ఓర్పుతో థెరపీల ద్వారా తిరిగి మామూలు మనుషుల్ని చేయాల్సి వస్తుంది. పోలీసుల గమనింపు ప్రకారం 18 నుంచి 25 ఏళ్ల లోపు వారిని డ్రగ్ పెడలర్స్ లక్ష్యం చేసుకున్నా నేడు 14 ఏళ్ల పిల్లలతో మొదలు ప్రతి టీనేజ్ అమ్మాయి అబ్బాయి డ్రగ్స్ డేగ రెక్కల కింద ఉన్నట్టే లెక్క.

నెగెటివ్ కుటుంబ వాతావరణం

టీనేజ్ పిల్లలు డ్రగ్స్ వైపు మొగ్గు చూపడంలో ప్రధానంగా నెగెటివ్ కుటుంబ వాతావరణం ఒక ముఖ్యకారణమని నిపుణులు అంటున్నారు. తల్లిదండ్రులు ఘర్షణతో ఉన్నా పిల్లలతో మంచి అనుబంధం ఏర్పరచుకోకపోయినా ఆత్మీయంగా వారితో సమయం గడపకపోయినా 'మనం పట్టని తల్లిదండ్రుల' కంటే 'మనకు కిక్ ఇచ్చే డ్రగ్స్ మేలు' అనే భావనలో భ్రష్ట సాంగత్యాలలోకి పిల్లలు వెళతారు. ఆ సంగతి తెలియనివ్వరు. చదువుతో పాటు క్రీడలు, ప్రకృతి ప్రేమ, బంధుమిత్రులు, క్రమశిక్షణ గల ఆర్థిక పరిస్థితి, భావోద్వేగాలకు అయినవారు ఉన్నారన్న భరోసా, విలువలు లేదా ఏదో ఒక ఆధ్యాత్మిక ఆలంబన... ఇవి టీనేజ్ పిల్లల రోజువారీ జీవనంలో ఉంటే వారు డ్రగ్స్ బారిన ఏ మాత్రం పడరు. తల్లిదండ్రులూ బహుపరాక్.

అల్ట్రా రన్నర్ మీనల్

● 6 రోజులు .. 680 కిలోమీటర్ల పరుగు

ఆమె ఖాతాలో అనేక రేస్‌లు పూర్తి చేసిన రికార్డులు ఉన్నాయి. భారతదేశపు అగ్రశ్రేణి అల్ట్రా రన్నర్‌గా పేరొందింది. పేరు మీనల్ కొటక్, గుర్గావ్‌వాసి. ఇటీవల 680కి పైగా కిలోమీటర్ల పరుగును 6 రోజుల్లో అంటే 144 గంటల్లో కవర్ చేసి సరికొత్త రికార్డ్‌ను నెలకొల్పిన మొదటి భారతీయ మహిళగా నిలిచింది. తనను తాను మెరుగుపరుచుకోవాలనే సంకల్పంతో అల్ట్రారన్‌లలో పాల్గొంటున్నాను అని చెబుతోంది మీనల్ కొటక్.


మీనల్ కొటక్

''పురుషుల రికార్డ్ ఇప్పటి వరకు 574.5 కిలోమీటర్లు ఉంటే, నా రికార్డ్ 680 కిలోమీటర్ల పరుగును పూర్తి చేసింది. మిగతావారికంటే ఉన్నతంగా ఉండేలా నన్ను నేను మెరుగుపరుచుకోవాలన్నదే నా సంకల్పం. కిందటేడాది అమెరికాలోని మిల్వాకీలో జరిగిన అల్ట్రామారథాన్‌లో భారతదేశం తరపున పాల్గొన్న మల్టీ డే రికార్డ్ అసాధారణమైంది. ఇటీవల జరిగిన ఆరు రోజుల ఈవెంట్‌లోనూ నేనే ముందున్నాను. ఈ రేసుతో ఆసియాలో టాప్ 5 యాక్టివ్ రన్నర్‌గా, ప్రపంచంలో టాప్ 12 యాక్టివ్ 6-డే ఉమెన్ అల్ట్రారన్నర్‌లలో ఒకరిగా ఉన్నాను. నా మనుగడ కోసం మొండిగా పోరాడతాను. సుదీర్ఘమైన చలి, ఒంటరితనం దేనినీ లెక్కచేయను. చాలా కఠినమైన సాధన. నా ఎమోషన్స్ అన్నీ సమం చేసుకుంటూ ప్రయత్నం చేశాను. చివరకు నా సంకల్పం మనసు, శరీరంపై గెలిచింది.

మార్చిన పరుగు

2014లో ఒక ట్రెడ్‌మిల్ పరుగు నా రన్నింగ్ సామర్థ్యాన్ని, శక్తిని గ్రహించేలా చేసింది. నా బలాన్ని గుర్తించిన సరైన వ్యక్తుల సహాయంతో ఢిల్లీ హాఫ్ మారథాన్‌లో పరుగెత్తాను. 34 సంవత్సరాల వయసులో వృత్తిపరమైన రన్నింగ్ అనుభవం లేకుండా పాల్గొన్న ఆ మారథాన్ నా జీవిత గమనాన్ని మార్చింది. ఆ సమయంలోనే మహిళా అల్ట్రారన్నర్లు చాలా తక్కువ మంది ఉన్నారని తెలిసి, ఆసక్తి కలిగింది. మారథాన్‌లకు భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించి, చరిత్ర సృష్టించాలనుకున్నాను. 2017లో 24 గంటల పరుగు విభాగంలో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించాను. అక్కడ నుంచి అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నా సామర్థ్యాన్ని గుర్తించింది. వారు నాకున్న రికార్డులన్నీ పరిశీలించారు. అలా 2017లో బెల్‌ఫాస్ట్‌లో తొలిసారిగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాను. ఆ తర్వాత 2018లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను.

డిప్రెషన్ నుంచి కోలుకొని...

2019లో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి కొంత కాలానికి ముందు కాలికి తీవ్ర గాయమైంది. అనేక కారణాల వల్ల డిప్రెషన్ బారిన పడ్డాను. నా కెరీర్ పీక్‌లో ఉన్న సమయంలో బెడ్‌రెస్ట్‌లో ఉండటం వల్ల చాలా బాధపడ్డాను. మొత్తానికి ఆ ఒత్తిడిని జయించి ఇప్పుడు నా 44 ఏళ్ల వయసులో 680 కిలోమీటర్ల పరుగును సాధించేంతగా ఎదిగాను. ఏడాది కిందట అమెరికాలో 72 గంటల్లో 379 కిలోమీటర్లు పరుగును పూర్తి చేశాను. మూడేళ్లుగా ఈ రేసులను ట్రాక్ చేస్తున్నాను. ఇక్కడ ఆటలో మనసు శక్తి ఎంతటిదో తెలుసుకున్నాను.

ప్రణాళికతో దినచర్య

మల్టీడే రేసులు 24 గంటల రేసుల కంటే భిన్నంగా ఉంటాయి. ఒక క్రీడాకారుడు ఇక్కడ రోజుల తరబడి పరిగెత్తడంలో ఎన్నో ప్రణాళికలను అమలు పరచాల్సి ఉంటుంది. దీంతో గతంలోకంటే ఎక్కువ ప్రేరణ, మద్దతు అవసరం అవుతుంది. ఈ రేసులోకి వెళ్లడానికి మొదటి మూడు రోజులు ఆలోచించాను. ఒకసారి శిక్షణ మొదలుపెట్టాక ఇక ప్రణాళికలను అనుసరించేలా నా దినచర్య మారిపోయింది. రన్నింగ్ కోసం మాత్రమే కాదు ఒక రేసర్‌గా మిమ్మల్ని మీరు ఆవిష్కరించు కోవాలంటే పోషకాహారం వంటి అనేక ఇతర అంశాలు ప్రణాళికాబద్ధంగా ఉండాలి. ఒక గంట లేదా రెండు గంటలు నిద్ర, బట్టలు మార్చుకోవడం, ఆహారం తీసుకోవడం, కాళ్లకు బొబ్బలు రాకుండా చూసుకోవడం... వీటన్నింటిపైనా శిక్షణ ప్రారంభించనప్పటి నుండే శ్రద్ధ వహించాలి. మల్టీ డే రేసింగ్ ఆరోగ్య పోటీగా కూడా మార్చుకోవచ్చు.

ఇప్పటివరకు భారత దేశం నుండి ఏ మహిళ కూడా మల్టీ డే మారథాన్‌లో పాల్గొనలేదు. ఈ విషయం నన్ను ఆలోచించేలా, రికార్డ్‌ను సాధించేలా చేసింది. అల్ట్రారన్ రేస్‌లో మొదటి భారతీయ మహిళను నేనే అవుతానని అనుకోలేదు. మానవ పరిమితులన్నీ అధిగమించడానికి ఒక అడుగు ముందుకు వేసినందుకు సంతోషంగా ఉన్నాను. నా భర్త సచిన్ ఉద్యోగి అయినప్పటికీ నా ముఖ్యమైన రన్నింగ్‌రేసులన్నింటికీ తప్పక హాజరై, నన్ను జాగ్రత్తగా చూసుకుంటాడు'' తన విజయపరంపరను వెనకాల ఉన్న రహస్యాలను వివరించింది మీనల్ కొటక్.

● అక్కా చెల్లెళ్లు

కల నిజం చేసుకున్నారు

ప్రతి కృషికి తగిన ఫలితం ఉంటుంది. ఇది నూటికి నూరుపాళ్లు నిజమని నిరూపిస్తున్నారు అనుజా గుప్తా, ప్రతాంక్షా గుప్తా అనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు. ఢిల్లీవాసులైన వీరిద్దరూ ఐదేళ్ల క్రితం లక్షరూపాయలతో చికన్‌కారీ కుర్తీల వ్యాపారం మొదలుపెట్టారు. ఇప్పుడు 45 మంది ఉద్యోగులతో, ఐదుకోట్ల టర్నోవర్‌తో వ్యాపారాన్ని నడుపుతున్నారు. ఒడిదొడుకులను అధిగమిస్తూ వ్యాపారంలో మైలురాళ్లను అధిగమిస్తున్నారు.

అనుజా గుప్తా మాట్లాడుతూ ''మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, పెరిగిన అక్కాచెల్లెళ్లం. మా వ్యాపారం ఇన్‌స్టాగ్రామ్ పేజీ నుంచి మొదలైంది. 2020లో కోవిడ్ కారణంగా మా వ్యాపార కలలు కూడా కనుమరుగవుతాయనుకున్నాం. చాలా వ్యాపార సంస్థలు లాక్‌డౌన్ సమయంలో మూలనపడ్డాయి. మేం మా వ్యాపారాన్ని నలభై చికన్‌కారీ కుర్తీలు, పలాజోలు, చీరలతో మొదలు పెట్టాం. మా వెంచర్ పేరు 'చౌకట్'. కోవిడ్ కాలంలో చాలామంది వద్ద డబ్బు లేదు. కాబట్టి మా దుస్తులు అమ్ముడవుతాయన్న గ్యారెంటీ మాకు లేదు. అలాగని మా వ్యాపారాన్ని మూసేయడానికి మేం సిద్ధంగా లేం. మా నిర్ణయం సరైనదేనని ఆ తర్వాత అర్థమైంది.


అనుజా గుప్తా


ప్రతాంక్షా గుప్తా

పెరిగిన ఆర్డర్లు

అమ్మకానికి ఉంచిన డ్రెస్సులు హాట్‌కేక్‌లుగా అమ్ముడయ్యాయి. మొదటి నెలలోనే 34 ఆర్డర్లు వచ్చాయి. దాంతో మా ఆత్మవిశ్వాసం రెట్టింపయ్యింది. మరిన్ని ఆర్డర్లు వచ్చిన తర్వాత ఒక లాజిస్టిక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాం. చికన్‌కారీ కుర్తీలు ఖరీదైనవి అనే అభిప్రాయాన్ని వారితో మాట్లాడి, మార్చగలిగాం. నాణ్యత విషయంలో రాజీపడకుండా తక్కువ ధరకే చికన్‌కారీ కుర్తీలు అందించ వచ్చని నిరూపించాం. ఈ నమ్మకం వల్లనే లాక్‌డౌన్ ప్రకటించిన ఇరవై రోజుల తర్వాత నుంచి కూడా మా 'చౌకట్' నుంచి దుస్తులు అమ్ముడు పోవడం పెరిగింది. కోవిడ్ కారణంగా డిజైనర్ల దగ్గరకు వెళ్లి, సరైనవి ఎంచుకునే పరిస్థితి లేదు. అలాంటప్పుడు మేమిద్దరం సొంతంగా డిజైన్ చేయాలని నిర్ణయించుకున్నాం. ఇది కూడా మరో మైలురాయిలా నిలిచింది.

అభిరుచులు వేరైనా సృజన ఒక్కటే

ఇప్పుడు మా సంస్థలో 45 మంది ఉద్యోగులు ఉన్నారు. దేశంలో 5 వేల మంది నేత కార్మికులతో భాగస్వామ్యం కలిగి ఉన్నాం. మా సంస్థకు విదేశాలలో కూడా క్లయింట్లు ఉన్నారు. డెబ్భైశాతానికి పైగా ఆర్డర్లు ఆన్‌లైన్‌లో డెలివరీ చేయబడతాయి. అక్కచెల్లెళ్లమే అయినా ఇలా కలిసి వ్యాపారం చేస్తామని కలలో కూడా అనుకోలేదు. మా ఇద్దరు చదువులు వేరు, అభిరుచులు వేరు. కానీ, మా ఇద్దరి ఆలోచన ఒక్కటిగా ఉన్నది 'చౌకట్' సృష్టించడంలో. నేను జర్నలిజంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేశాను. ప్రతాంక్షా గుప్తా ఫ్యాషన్/అప్పేరల్ డిజైన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. మా అమ్మానాన్నలు మాకు పూర్తి సహకారం అదించడంతో నేడు మా కంపెనీ ఐదుకోట్ల టర్నోవర్‌కు చేరుకుంది'' అని వివరిస్తారు ఈ సోదరీమణులు.


'చౌకట్' టీమ్

బ్యూటిప్



స్నానం చేయడానికి అర గంట ముందుగా కొబ్బరి పాలను ముఖానికి, దేహానికి పట్టించి మర్దన చేయాలి. దీనివల్ల చర్మం యవ్వనంగా ఉంటుంది.

యూత్ పల్స్



శతకోటి సూర్యప్రభా భాసిత... వీరాధివీరా

- వెల్‌కమ్ టు గేమ్ జోన్

పురాణాలు ఇప్పుడు కాలక్షేపం కోసం కాదు. వయసు మళ్లిన వారి కోసం మాత్రమే కాదు. మిలీనియల్స్ నుంచి జెన్ జెడ్ వరకు యువతరం పురాణాలను ఇష్టపడుతోంది. అయితే అది చదువు రూపంలో కాదు. గేమింగ్ రూపంలో. ఇండియన్ మైథలాజికల్ గేమ్స్‌ను ఆడడానికి గేమర్స్‌లో 82 శాతం మంది ఇష్టపడుతున్నట్లు చెబుతోంది గేమింగ్ అండ్ ఇంటరాక్టివ్ మీడియా ఫండ్ సంస్థ లుమికై. అర్జునుడి నుంచి కర్ణుడి వరకు రకరకాల పురాణపాత్రలలో 'ప్లేయర్' రూపంలో పరకాయ ప్రవేశం చేస్తోంది యువతరం...

అహ్మదాబాద్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని శాన్వీకి గేమింగ్ అంటే బోలెడంత ఇష్టం. ఎక్కువ సమయాన్ని టెక్స్ట్‌బుక్స్‌తోనే గడిపే శాన్వీ కాసేపు వీడియో గేమ్స్ ఆడడం ద్వారా రిలాక్స్ అవుతుంది.

కొన్ని సంవత్సరాల క్రితం 'డెత్స్ డోర్' నుంచి 'మాన్‌స్టర్ హంటర్' వరకు ఎన్నో గేమ్స్ ఆడింది.

అయితే ఒక ఫ్రెండ్ సలహా ప్రకారం కొన్ని నెలల క్రితం తొలిసారిగా ఇండియన్ మైథలాజికల్ గేమ్ ఆడింది. ఇక అప్పటి నుంచి అలాంటి గేమ్స్ మాత్రమే ఆడుతోంది.

'మైథలాజికల్ గేమ్స్‌కు ఇతర గేమ్స్‌కు తేడా ఏమిటో తొలిసారిగా తెలుసుకున్నాను. ఇవి కేవలం కాలక్షేప ఆటలు కావు. పురాణ జ్ఞానాన్ని, తార్కిక శక్తిని పెంచుతాయి' అంటుంది శాన్వీ.

'చిన్న పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలలో కూడా స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడంతో గేమ్స్ ఆడేవారి సంఖ్య పెరిగింది. మన దేశంలో పెద్ద గేమింగ్ కన్స్యూమర్ బేస్ ఉంది. గతంతో పోల్చితే వచ్చిన మార్పు ఏమిటంటే మన సాహిత్యం, సంస్కృతితో ముడిపడి ఉన్న పాత్రలను యువ గేమర్స్ ఇష్టపడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వరల్డ్-క్లాస్ టెక్నాలజీతో మన వైన పాత్రలను ఇండియన్ స్టూడియోలు డెవలప్ చేస్తున్నాయి' అంటుంది 'విన్‌జో గేమ్స్' కో-ఫౌండర్ సౌమ్య సింగ్ రాథోడ్.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మన పురాణాలు, చరిత్ర, సంస్కృతి, జానపద సాహిత్యంలోని పాత్రల ఆధారంగా మరిన్ని గేమ్స్ ఆన్‌లైన్ గేమింగ్ సెక్టార్ నుంచి రానున్నాయి అంటుంది సౌమ్య.

'పురాణాలను గేమింగ్‌తో మిళితం చేయడంతో ప్లేయర్స్ కొత్త రకం అనుభూతికి గురవుతున్నారు. అన్ని వయసుల వారిని ఈ గేమ్స్ ఆకట్టుకుంటున్నాయి' అంటున్నాడు 'ఇన్‌ఫోఎడ్జ్ వెంచర్స్' ఫౌండర్ చిన్మయ్ శర్మ.

'మన పురాణాల్లో దాగున్న ఎన్నో ఇతివృత్తాలు డెవలపర్‌లను ఆకర్షిస్తున్నాయి. ఆ పాత్రలు యూత్‌ను ఆకట్టుకునేలా గేమ్‌ను డిజైన్ చేస్తున్నారు' అంటున్నాడు యుగ్ మెటావర్స్ సీయీవో ఉత్కర్ష్ శుక్లా.

మైథలాజికల్ గేమ్స్ అనేవి ఎక్కువగా ఫస్ట్-పర్సన్ షూటర్(ఎఫ్‌పీఎస్) గేమ్స్. మెయిన్ క్యారెక్టర్‌లోకి పరకాయ ప్రవేశం చేసి ఆడే గేమ్స్.

'టెస్ట్ యువర్ స్కిల్స్ ఇన్ దిస్ ఎపిక్ స్ట్రాటజీ గేమ్' అంటూ ఆహ్వానించిన 'కురుక్షేత్ర: అసెన్షన్' ఢిల్లీకి చెందిన సజనికి బాగా నచ్చింది. ఈ వీడియో గేమ్‌లో అర్జునుడు, భీముడు, కర్ణుడు లాంటి ఎన్నో పాత్రలు ఉంటాయి.

'మైథలాజికల్ గేమ్స్ మనల్ని మన మూలాల్లోకి తీసుకువెళతాయి. మన పురాణాలు, జానపదాల ఆధారంగా గేమ్స్‌ను రూపొందించే అద్భుత అవకాశం ఇప్పుడు గేమ్ డెవలపర్‌లకు వచ్చింది. దేవ, దానవుల మధ్య యుద్ధానికి సంబంధించి సెకండ్ గేమ్‌ను రూపొందిస్తున్నాం' అంటున్నాడు 'కురుక్షేత్ర' గేమ్‌ను రూపొందించిన 'స్టూడియో సిరా' కో-ఫౌండర్ అభాస్ షా.

'కురుక్షేత్ర'ను తక్కువ సమయంలో ఆరు లక్షలమంది డౌన్‌లోడ్ చేసుకున్నారు.

మన దేశంలోనే కాదు ఆగ్నేయాసియా దేశాలలో కూడా భారతీయ పురాణాల ఆధారంగా రూపొందించిన గేమ్స్‌ను ఆడడానికి ఇష్టపడుతున్నారు. ఇష్టాన్ని క్యాష్ చేసుకోవడం అని కాకుండా ఈ గేమ్స్ ద్వారా యువతలో నైతిక విలువలు పాదుకొల్పే, ఆత్మస్థైర్యం పెంచగలిగే ప్రయత్నం చేస్తే భవిష్యత్ కాలంలో వాటికి మరింత ఆదరణ పెరుగుతుంది.

రాజీ పడకుండా...

నోడింగ్ హెడ్స్ గేమ్స్ కంపెనీ రూపొందించిన 'రాజీ యాన్ ఏన్షియెంట్ ఎపిక్' మనల్ని మన పురాణ ప్రపంచంలోకి తీసుకువెళుతుంది. మన దేవాలయాల సౌందర్యం నుంచి ఇతిహాస కళ వరకు ఈ గేమ్‌లో ప్రతిఫలిస్తుంది. కంపెనీ ప్రారంభం నుంచి మన పురాణాల ఆధారంగా గేమ్‌ను రూపొందించాలని కల కన్నది పుణేకు చెందిన 'నోడింగ్ హెడ్స్ గేమ్స్' కంపెనీ ఫౌండర్ శృతి ఘోష్ 'రాజీ' రూపంలో తన కలను నిజం చేసుకుంది.

'గ్రీకు ఇతర పురాణాలు సినిమాలు, గేమ్స్ రూపంలో మనల్ని ఆకట్టుకున్నాయి. అయితే ఆ స్థాయిలో మన పురాణాలు గుర్తింపు పొందలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మన పురాణాల ఆధారంగా రాజీ గేమ్‌కు రూపకల్పన చేశాం. ఇది ఎంతో మంది డెవలపర్‌లకు స్ఫూర్తిని ఇచ్చింది. ఎంత చెప్పినా మన పురాణాల్లో నుంచి చెప్పడానికి ఇంకా ఎంతో ఉంటుంది' అంటుంది శృతి ఘోష్.


శృతి ఘోష్

“సెమీస్‌కు చేరడం కలగా ఉంది. ఇంకా నమ్మలేకపో తున్నాను. న్యూజిలాండ్‌పై గెలుపుతో మాలో ఆత్మ విశ్వాసం పెరిగింది. మేం చేసింది తక్కువ స్కోరని తెలుసు. కానీ గట్టిగా పోరాడాలని నిర్ణయించుకున్నాం. మా ప్రణాళిక లను సమర్థంగా అమలు చేశాం. జట్టులో ప్రతీ ఒక్కరు తమ పాత్ర సమర్థంగా పోషించారు. ఇది పెద్ద ఘనత మా దేశంలో ప్రజలకు సంతోషం పంచాలని కోరుకున్నాం. అక్కడ ఇప్పుడు సంబరాలు జరుగుతున్నాయి. మా ఆనందాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు. -రషీద్ ఖాన్, అఫ్గానిస్తాన్ కెప్టెన్

10 అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రపంచకప్ (వన్డే/టి20) టోర్నీల చరిత్రలో సెమీఫైనల్ దశకు చేరిన పదో జట్టుగా అఫ్గానిస్తాన్ గుర్తింపు పొందింది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా (1975), ఇంగ్లండ్ (1975), న్యూజిలాండ్ (1975), వెస్టిండీస్ (1975), పాకిస్తాన్ (1979), భారత్ (1983), దక్షిణాఫ్రికా (1992), శ్రీలంక (1996), కెన్యా (2003) జట్లు ఉన్నాయి.

1 ప్రపంచకప్ టోర్నీల్లో బంగ్లాదేశ్‌పై అఫ్గానిస్తాన్ తొలిసారి విజయం అందుకుంది. గతంలో బంగ్లాదేశ్‌తో జరిగిన నాలుగు ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో (టి20: 2014లో...వన్డే వరల్డ్‌కప్: 2015, 2019, 2023) అఫ్గానిస్తాన్ ఓడిపోయింది.

9 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌ల్లో ఇన్నింగ్స్‌లో నాలుగు అంతకన్నా ఎక్కువ వికెట్లు తీయడం రషీద్ ఖాన్‌కిది తొమ్మిదిసారి. షకీబ్ అల్ హసన్ (8 సార్లు) పేరిట ఉన్న రికార్డును రషీద్ బద్దలు కొట్టాడు.

న్యూజిలాండ్, ఆస్ట్రేలియావంటి జట్లను ఓడించి సెమీస్ వరకు సాగిన మీ ప్రయాణం అద్భుతం. మీ శ్రమకు, పట్టుదలకు ఫలితమే ఈ విజయం. మిమ్మల్ని చూసి గర్విస్తున్నా. దీనిని ఇలాగే కొనసాగించండి. - సచిన్ టెండూల్కర్

మైదానంలో దృశ్యాలు చాలా గొప్పగా కనిపిస్తున్నాయి. అఫ్గాన్‌కు గొప్ప విజయమిది. తొలిసారి సెమీస్ చేరిన పఠాన్లలో భావోద్వేగాలు బలంగా కనిపిస్తున్నాయి. అత్యుత్తమ క్రికెట్ ప్రదర్శన ఇది. -యువరాజ్ సింగ్”



అఫ్‘గన్’ పేలింది

టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో అఫ్గానిస్తాన్

తొలిసారి ఐసీసీ టోర్నీలో సెమీఫైనల్‌కు

- చివరి మ్యాచ్‌లో 8 పరుగులతో బంగ్లాదేశ్‌పై విజయం
- గెలిపించిన రషీద్, నవీన్, గుర్బాజ్
- గురువారం దక్షిణాఫ్రికాతో సెమీస్ పోరు

కన్నీళ్లు ఆగడం లేదు... భావోద్వేగాలను నియంత్రించుకోవడం సాధ్యం కావడం లేదు... పట్టరాని ఆనందాన్ని ప్రదర్శించేందుకు పదాలు దొరకడం లేదు... ఒకరు కాదు, ఇద్దరు కాదు అందరి ఆటగాళ్లది ఇదే పరిస్థితి... తాము సాధించిన ఘనత ఎంత అసాధారణమైనదో వారికి తెలుస్తున్నా ఇంకా నమ్మశక్యంగా అనిపించని స్థితి... సొంత దేశంలో క్రికెట్ మైదానంలో అడుగు పెట్టడమే కష్టంగా మారిపోగా... జట్టు సభ్యులంతా కలిసి సాధన చేసే అవకాశం లేకపోగా... ఎప్పుడో టోర్నీకి ముందు కలిసి ప్రాక్టీస్ చేయడమే... కానీ తమ పోరాటం, పట్టుదల ముందు వాటన్నింటినీ చిన్న విషయాలుగా మార్చేసింది. అగ్రశ్రేణి జట్లు క్రికెట్‌ను శాసిస్తున్న చోట అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ అసాధారణ ఆటను చూపించింది... అద్భుత ఆటతో సత్తా చాటుతూ ప్రపంచకప్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది.

టోర్నీకి ముందు అంచనాలు లేవు... అండర్‌డాగ్ కిందే లెక్క... కానీ లీగ్ దశలో న్యూజిలాండ్‌పై భారీ విజయం గాలివాటం కాదని, సూపర్–8లో ఆస్ట్రేలియాను చిత్తు చేసిన వైనం అదృష్టం వల్ల కాదని అఫ్గానిస్తాన్ నిరూపించింది... గత టి20 వరల్డ్‌కప్‌లో ఒక్క విజయానికి కూడా నోచుకోని జట్టు ఇప్పుడు ఏకంగా సెమీస్ చేరింది. బంగ్లాదేశ్‌తో చివరి సూపర్–8 పోరులో విజయం దోబూచులాడింది. 115 పరుగులు మాత్రమే చేసి దానిని కాపాడుకోవడం అంత సులువు కాదు. కానీ అఫ్గాన్ ఆటగాళ్లంతా ప్రాణాలు పణంగా పెట్టినట్లు మైదానంలో పోరాడారు... మళ్లీ మళ్లీ పలకరిస్తూ వచ్చిన వర్షంతో కూడా పోటీ పడాల్సి వచ్చింది... చివరకు తాము అనుకున్నది సాధించారు. బంగ్లాపై పైచేయి సాధించి తొలిసారి ఓ ఐసీసీ టోర్నీలో సగర్వంగా సెమీస్ స్థానాన్ని ఖాయం చేసుకోగా, తాము ఎప్పటికీ మారమన్నట్లుగా బంగ్లాదేశ్ ఆటగాళ్లు నిష్క్రమించారు.

కింగ్స్‌టౌన్ (సెయింట్ విన్సెంట్): ‘కమాన్ బంగ్లాదేశ్’... భారత్‌తో ఓటమి తర్వాత ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ మాట ఇది. ఆల్‌టైమ్ గ్రేట్ జట్టు కూడా మరో టీమ్ ప్రదర్శనను నమ్ముకుంటూ అదృష్టం పలకరిస్తుందేమోనని ఆశపడింది. బంగ్లాదేశ్ గెలిస్తే తాము సెమీఫైనల్ చేరవచ్చని కంగారూలు కలగన్నారు. కానీ అఫ్గానిస్తాన్ ఆ అవకాశం ఇవ్వలేదు. మంగళవారం జరిగిన గ్రూప్–1 చివరి సూపర్–8 మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 8 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. **భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం జరిగే తొలి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో అఫ్గాన్ టీమ్... రాత్రి జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడతాయి.**

టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 115 పరుగులు మాత్రమే చేయగలిగింది. రహ్మనుల్లా గుర్బాజ్ (55 బంతుల్లో 43; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. బంగ్లాదేశ్ స్పిన్నర్ రిషాద్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ మధ్యలో వర్షం రావడంతో ఒక ఓవర్ తగ్గించి లక్ష్యాన్ని 19 ఓవర్లలో 114 పరుగులుగా నిర్దేశించారు. అయితే బంగ్లాదేశ్ 17.5 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. లిటన్ దాస్ (49 బంతుల్లో 54 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) పోరాటం వృథా కాగా... జట్టులో నలుగురు డకౌటయ్యారు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ నవీన్ ఉల్ హక్ (4/26), కెప్టెన్ రషీద్ ఖాన్ (4/23) ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు. తాజా ఫలితంతో గ్రూప్–1 నుంచి 2 విజయాలతో 4 పాయింట్లు సాధించిన అఫ్గానిస్తాన్ రెండో స్థానంతో సెమీస్ చేరింది. బంగ్లాదేశ్ ఓటమితో ఆస్ట్రేలియా జట్టు కూడా ‘సూపర్–8’ దశలోనే ఇంటిదారి పట్టింది.



కాబూల్ వీధుల్లో అభిమానుల సంబరాలు

ఆద్యంతం ‘డ్రామా’ సాగి...

స్వల్ప స్కోర్ల ఈ మ్యాచ్ పలు మలుపులతో ఆసక్తికరంగా సాగింది. పదే పదే వాన అంతరాయం కలిగించడంతో విజయం దోబూచులాడింది. అఫ్గాన్ ఇన్నింగ్స్‌లో గుర్బాజ్ మినహా అంతా విఫలమయ్యారు. అతను కూడా తన శైలికి భిన్నంగా చాలా నెమ్మదిగా ఆడాడు. చివర్లో రషీద్ ఖాన్ (10 బంతుల్లో 19 నాటౌట్; 3 సిక్స్‌లు) మెరుపులతో స్కోరు 100 పరుగులు దాటింది. రన్‌రేట్‌లో అఫ్గాన్, ఆసీస్‌లను దాటి సెమీస్ చేరాలంటే 12.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించాల్సిన స్థితిలో బంగ్లాదేశ్ మైదానంలోకి దిగింది. అయితే సెమీస్ సంగతేమో కానీ ఆ జట్టు మ్యాచ్ గెలిచే అన్ని అవకాశాలను కూడా వృథా చేసుకుంది. ఫజల్ తన తొలి ఓవర్లోనే తన్జీద్ (0)ను అవుట్ చేయగా, నవీన్ వరుస బంతుల్లో నజ్ముల్ (5), షకీబ్ (0)లను అవుట్ చేయడంతో స్కోరు 23/3 వద్ద నిలిచింది. ఈ దశలో వాన వచ్చి ఆగిన తర్వాత రషీద్ వరుస ఓవర్లలో సౌమ్య సర్కార్ (10), తౌహీద్ (14)లను వెనక్కి పంపించాడు. అయినా సరే చేతిలో 5 వికెట్లతో 56 బంతుల్లో 36 పరుగులు చేయాల్సిన బంగ్లాదేశ్ గెలిచే స్థితిలో నిలిచింది. కానీ రషీద్ మళ్లీ వరుస బంతుల్లో రెండు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను తమ చేతుల్లోకి తెచ్చుకున్నాడు. 81/7 నుంచి బంగ్లా డక్‌వర్త్ లూయిస్ స్కోరుతో పోటీ పడుతూ వచ్చింది. ఒక ఎండ్‌లో నిలిచిన దాస్ ఎంతో ప్రయత్నించినా... మరోవైపు మిగిలిన మూడు వికెట్లు తీసేందుకు అఫ్గాన్ బౌలర్లకు ఎక్కువ సమయం పట్టలేదు. ముస్తఫిజుర్‌ను నవీన్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేయడంతో అఫ్గాన్ ఆటగాళ్లు, అభిమానుల సంబరాలతో మైదానం హోరెత్తిపోగా... అక్కడి నుంచి దాదాపు 12 వేల కిలోమీటర్ల దూరంలో కాబూల్‌లో కూడా ఆ విజయధ్వానం బ్రహ్మాండంగా వినిపించింది!

ఉత్తమ నటుడు గుల్బదిన్!



11.4 ఓవర్ల తర్వాత బంగ్లా స్కోరు 81/7 వద్ద వానతో మ్యాచ్ ఆగినప్పుడు ఒక ఆసక్తికర ఘటన జరిగింది. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఆ సమయానికి బంగ్లా 2 పరుగులు వెనుకబడి ఉంది. అక్కడే మ్యాచ్ ముగిసిపోతే అఫ్గాన్ గెలుస్తుంది. ఈ దశలో పరిస్థితి మెరుగ్గా ఉంది, తొందరపడ వద్దన్నట్లుగా డ్రెస్సింగ్ రూమ్ నుంచి అఫ్గాన్ కోచ్ జొనాథన్ ట్రాట్ సైగ చేశాడు. అప్పటి వరకు స్లిప్‌లో చక్కగా ఫీల్డింగ్ చేస్తున్న గుల్బదిన్ ‘అలా అయితే ఓకే’ అన్నట్లుగా ఒక్కసారిగా కండరాలు పట్టేశాయంటూ కుప్పకూలిపోయాడు. ఆ వెంటనే పిచ్‌పై కవర్లు వచ్చేశాయి. అయితే ఆ తర్వాత మళ్లీ చక్కగా మైదానంలోకి దిగిన గుల్బదిన్ తర్వాతి వికెట్ కూడా తీశాడు. దాంతో ఇదంతా నటన అంటూ అన్ని వైపుల నుంచి విమర్శలు వచ్చాయి. మ్యాచ్ తర్వాత రషీద్ మాత్రం తన ఆటగాడికి మద్దతుగా నిలిచాడు. నిజానికి అక్కడే మ్యాచ్ ముగిసి ఉంటే వివాదం జరిగేదేమో కానీ ఆట కొనసాగి ఆలౌట్ వరకు వెళ్లడంతో ఇది సమస్యగా మారలేదు.

‘వెల్‌డన్’

- అంతర్జాతీయ క్రికెట్‌లో అఫ్గానిస్తాన్ ప్రస్థానం అసాధారణం
- అగ్రశ్రేణి జట్లకు దీటుగా ఎదిగిన వైనం

‘మిమ్మల్ని నిరాశపర్చము, మీ నమ్మకాన్ని నిలబెడతాం’... టి20 వరల్డ్‌కప్ ప్రారంభానికి ముందు జరిగిన వెల్‌కమ్ పార్టీలో క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారాతో రషీద్ ఖాన్ అన్న మాట ఇది. ఎందుకంటే ఈ టోర్నీలో సెమీస్ చేరే నాలుగు జట్ల పేర్లు చెప్పమని మాజీలు, విశ్లేషకులతో అడిగితే ఒక్క లారా మాత్రమే అఫ్గానిస్తాన్ పేరు చెప్పాడు. వారి ఆటపై అతనికి ఉన్న నమ్మకాన్ని ఇది చూపించింది. రేపు ట్రినిడాడ్‌లోని బ్రియాన్ లారా స్టేడియంలోనే రషీద్ బృందం సెమీఫైనల్ మ్యాచ్ ఆడబోతోంది! గత కొన్నేళ్లుగా అటు వన్డే, ఇటు టి20 ఫార్మాట్‌లలో నిలకడైన ప్రదర్శన కనబరుస్తూ వచ్చిన అఫ్గానిస్తాన్ ఇప్పుడు ‘సంచలనాల’ జట్టు నుంచి సమర్థమైన జట్టుగా ఎదిగింది. ప్రస్తుతం ఆ దేశంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా జట్టు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కేంద్రంగానే తమ హోం మ్యాచ్‌లు ఆడుతోంది. ఆటగాళ్లంతా కూడా అక్కడే దాదాపుగా స్థిరపడ్డారు. 2023లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లోనే అఫ్గానిస్తాన్ పదును ఏమిటో ప్రపంచానికి తెలిసింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్, పాకిస్తాన్‌లను ఓడించిన టీమ్, ఆస్ట్రేలియాను కూడా ఒకదశలో 91/7తో ఓటమి దిశగా నెట్టింది. ఆసీస్ అదృష్టవశాత్తూ మ్యాక్స్‌వెల్ అద్భుత ఇన్నింగ్స్ జట్టును గెలిపించినా... ఇప్పుడు టి20 వరల్డ్‌కప్ లో నాటి పనిని అఫ్గాన్ పూర్తి చేసింది. -సాక్షి క్రీడా విభాగం



నబీ

15 ఏళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్‌లో ఆ జట్టు ప్రస్థానం ప్రారంభమైంది. ఆరంభంలో ఐసీసీ వరల్డ్ క్రికెట్ లీగ్–డివిజన్–5లో జపాన్, బోట్స్‌వానా వంటి జట్లతో తలపడిన టీమ్ ఇప్పుడు ఆసీస్, కివీస్, విండీస్, పాక్‌లను దాటి వరల్డ్ కప్ సెమీస్‌లోకి అడుగు పెట్టడం అసాధారణం. అఫ్గానిస్తాన్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ నబీ 15 ఏళ్లుగా జాతీయ జట్టుకు ఆడుతున్నాడు. అఫ్గాన్ పురోగతికి అతను ప్రత్యక్ష సాక్షి. అఫ్గాన్ తరఫున ఏకంగా 45 ప్రత్యర్థి దేశాలపై విజయం సాధించిన టీమ్‌లలో అతను భాగస్వామి. ‘ఆరంభంలో మేం ఎదుర్కొన్న సమస్యలను దాటి ఇక్కడికి రావడం ఎంతో గొప్పగా అనిపిస్తోంది. మా ఘనతల వెనక ఎన్నో కష్టాలు, త్యాగాలు ఉన్నాయి. అవి ఇప్పుడు ఫలితాన్ని అందించాయి’ అని నబీ చెప్పాడు. ఈ టోర్నీలో అఫ్గాన్ టీమ్ ప్రదర్శనలతో పలువురు కీలక పాత్ర పోషించారు.



రషీద్ ఖాన్: కెప్టెన్‌గా జట్టుకు అన్నీ తానే, అంతటా తానే అయి నడిపిస్తున్నాడు. తన పదునైన లెగ్‌స్పిన్‌తో టోర్నీలో 16 వికెట్లు పడగొట్టిన రషీద్... బ్యాటింగ్‌లోనూ మెరుపులతో తన పాత్ర పోషించాడు. బంగ్లాతో మ్యాచ్‌లో అతని మూడు సిక్సర్లే చివరకు కీలకంగా మారాయి. ఆసీస్‌తో మ్యాచ్‌లో బౌలర్లను మార్చిన తీరులో అతని నాయకత్వ సామర్థ్యం కూడా కనిపించింది. 25 ఏళ్ల రషీద్ ఇప్పటి వరకు 92 టి20లు ఆడి 152 వికెట్లు తీయడంతోపాటు 452 పరుగుల సాధించాడు.



గుర్బాజ్: ఓపెనర్‌గా అతని దూకుడైన ఆట జట్టుకు మంచి ఆరంభాలను అందించి విజయానికి బాటలు వేసింది. 281 పరుగులతో ప్రస్తుతం టోర్నీ టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. ముఖ్యంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున ఐపీఎల్ అనుభవంతో ఇటీవల అతని బ్యాటింగ్ మరింత పదునెక్కింది. 22 ఏళ్ల గుర్బాజ్ ఇప్పటి వరకు 62 టి20లు ఆడి 1657 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 10 అర్ధ సెంచరీలు ఉన్నాయి.



నవీన్ ఉల్ హక్: ప్రధాన పేసర్‌గా జట్టుకు కీలక సమయాల్లో వికెట్లు అందించి పైచేయి సాధించేలా చేశాడు. టోర్నీలో 13 వికెట్లు తీసిన అతను బంగ్లాదేశ్‌పై ఆరంభంలో తీసిన 2 వికెట్లే విజయానికి బాటలు వేశాయి. ట్రవిస్ హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన అతని అవుట్‌స్వింగర్ టోర్నీకే హైలైట్‌గా నిలిచింది. 24 ఏళ్ల నవీన్ 44 టి20లు ఆడి 59 వికెట్లు పడగొట్టాడు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పలు ఫ్రాంచైజీ లీగ్‌లలో రెగ్యులర్‌గా ఆడుతున్నాడు.

‘మీరు బాగా ఆడితే గెలిస్తే చాలు...అదే నాకు ఫీజు. పారితోషికం’ - అజయ్ జడేజా (వన్డే వరల్డ్ కప్‌లో టీమ్‌కు మెంటార్‌గా పని చేసిన జడేజా అఫ్గాన్ బోర్డు నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకునేందుకు నిరాకరించాడు)



డ్వేన్ బ్రేవో (బౌలింగ్ కన్సల్టెంట్): 573 టి20 మ్యాచ్‌లు, 625 వికెట్లతో అపార అనుభవం ఉన్న విండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రేవోను ఈ టోర్నీ కోసం అఫ్గాన్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా నియమించుకుంది. అతడి నియామకాన్ని జట్టు సమర్థంగా వాడుకుంది. ముఖ్యంగా అఫ్గాన్ పేసర్ల బౌలింగ్‌లో ఆ తేడా కనిపించింది. టి20ల్లో స్లో బంతులను వాడే విషయంలో బ్రేవో సూచనలు, వ్యూహాలు అద్భుతంగా పని చేశాయి.

జొనాథన్ ట్రాట్: ఇంగ్లండ్ మాజీ ఆటగాడైన ట్రాట్ హెడ్ కోచ్‌గా జట్టు పురోగతిలో కీలక పాత్ర పోషించాడు. జూలై 2022 నుంచి అతను కోచ్‌గా కొనసాగుతున్నాడు. గత ఏడాదే పదవీ కాలం పూర్తయినా మళ్లీ అతడినే అఫ్గాన్ కొనసాగించింది. ట్రాట్ శిక్షణ, ప్రణాళికలు కొత్త తరహా టీమ్‌ను ప్రపంచానికి పరిచయం చేశాయి. ఇప్పుడు సరైన ఫలితాలు అందిస్తున్నాయి.



స్పెయిన్ ‘హ్యాట్రిక్’



ఫెరాన్ టోరెస్

డుసెల్‌డార్ఫ్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ స్పెయిన్ జట్టు ‘హ్యాట్రిక్’ విజయం నమోదు చేసింది. గ్రూప్ ‘బి’లో భాగంగా అల్బేనియాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో స్పెయిన్ 1–0 గోల్ తేడాతో గెలిచింది. ఆట 13వ నిమిషంలో స్పెయిన్ జట్టుకు ఫెరాన్ టోరెస్ ఏకైక గోల్ అందించాడు. మూడు విజయాలతో స్పెయిన్ తొమ్మిది పాయింట్లతో గ్రూప్ ‘బి’ టాపర్‌గా నిలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. గ్రూప్ ‘బి’లో భాగంగా క్రొయేషియా జట్టుతో జరిగిన మ్యాచ్‌ను డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ 1–1తో ‘డ్రా’ చేసుకుంది. క్రొయేషియా తరఫున లూకా మోడ్రిచ్ (55వ ని.లో), ఇటలీ తరఫున జకాగ్ని (90+8వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. యూరో టోర్నీ చరిత్రలో గోల్ చేసిన అతి పెద్ద వయస్కుడిగా మోడ్రిచ్ (38 ఏళ్ల 289 రోజులు) గుర్తింపు పొందాడు. నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన ఇటలీ జట్టు కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. గ్రూప్ ‘డి’లో జరిగిన మ్యాచ్‌ల్లో ఆస్ట్రియా 3–2తో నెదర్లాండ్స్‌ను ఓడించగా... ఫ్రాన్స్, పోలాండ్ మధ్య జరిగిన మ్యాచ్ 1–1తో ‘డ్రా’గా ముగిసింది. ‘డి’ గ్రూప్ నుంచి ఆస్ట్రియా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్ ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాయి.

క్వార్టర్స్‌లో యూకీ జోడీ



న్యూఢిల్లీ: మలోర్కా చాంపియన్‌షిప్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ శుభారంభం చేసింది. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రౌండ్‌లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 6–3తో శ్రీరామ్ బాలాజీ (భారత్)–ల్యూక్ జాన్సన్ (బ్రిటన్) జంటపై నెగ్గింది. యూకీ జోడీ ఐదు ఏస్‌లు సంధించింది.

వార్నర్ వీడ్కోలు

అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ఆసీస్ స్టార్

డేవిడ్ వార్నర్ ఓ ఆస్ట్రేలియన్ క్రికెటర్ అంతే! అంతేనా అంటే కచ్చితంగా కాదు... మనకు బాగా తెలిసిన వ్యక్తి... మనల్ని మైదానంలో (ఐపీఎల్) ఆటతో, వెలుపల సతీసమేతంగా రీల్స్‌తో తెలుగు వాళ్లకు సుపరిచితుడు. అతని గురించి మూడే మూడు ముక్కల్లో చెప్పాలంటే ఓపెనింగ్‌లో విధ్వంసం, జట్టులో కీలకం, విజయాల్లో సంబరం! కానీ అతని బ్యాటింగ్ మెరుపులు ఇకపై అంతర్జాతీయ క్రికెట్‌లో కనిపించవు. ఆరు నెలల క్రితం టెస్టు, వన్డే ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పిన ఈ ఆస్ట్రేలియన్ తాజాగా టి20లకూ రిటైర్మెంట్ ప్రకటించడంతో అతని విధ్వంసరచన ఇకమీదట ఫ్రాంచైజీ ప్రైవేట్ టి20 లీగ్‌లకే పరిమితం కానుంది.

మెల్‌బోర్న్: ఓపెనింగ్‌లో బ్యాటింగ్‌కు దిగి ప్రత్యర్థి బౌలర్ల పాలిట సింహస్వప్నంగా మారి కంగారు పెట్టించిన ఈ కంగారూ క్రికెటర్ వార్నర్ అంతర్జాతీయ ఆటకు సంపూర్ణంగా టాటా చెప్పేశాడు. తాజాగా టి20లకు గుడ్‌బై చెప్పడం ద్వారా 15 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు 37 ఏళ్ల వార్నర్ వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియా ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ బ్యాటర్లలో ఒకడైన వార్నర్ ఇన్నింగ్స్‌కు అర్ష్‌దీప్ తెరదించాడు. అతని చివరి ఇన్నింగ్స్ స్కోరు 6. నిరాశగా వెనుదిరగడం మినహా ‘గార్డ్ ఆఫ్ ఆనర్’ గానీ స్టాండింగ్ ఒవేషన్ గానీ అందుకోలేకపోయాడు. అతని అంతిమ స్కోరు నిరాశపరచిందేమో కానీ... అతనే ఆస్ట్రేలియా తరఫున టి20ల్లో అత్యధిక పరుగుల (3277) వీరుడు. అన్ని ఫార్మాట్లలో కలిపి చూసుకున్న అతను చేసిందేమాత్రం తక్కువ కాదు. టెస్టు, వన్డే, టి20లు కలిపి దాదాపు 19 వేల పరుగులు (18,995) సాధించాడు. 49 సెంచరీలు బాదాడు. 98 అర్ధశతకాలు చేశాడు. సొంతగడ్డపై 2009 జనవరిలో సఫారీతో టి20 మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అదే నెల అదే ప్రత్యర్థిపై వన్డే కెరీర్ మొదలుపెట్టాడు. కానీ ఈ విధ్వంసకారుడు సంప్రదాయ టెస్టులు ఆడేందుకు దాదాపు మూడేళ్లు పట్టింది. 2011 డిసెంబర్‌లో కివీస్‌పై ఐదు రోజుల ఆటకు శ్రీకారం చుట్టాడు.

ముగింపు ఇలా...

ఓపెనర్‌గా విజయవంతమైన వార్నర్ ఆట భారత్‌తోనే ముగిసింది. గత నవంబర్లో భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్లో భారత్‌పై ఆడాకా ఆసీస్ విజేతగా నిలువడంతోనే రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పుడు మళ్లీ ప్రస్తుత టి20 ప్రపంచకప్‌లో సూపర్–8 దశలో భారత్‌తోనే (మొత్తం అంతర్జాతీయ) కెరీర్‌కు మంగళం పాడాడు.

మరక పడిందిలా...

ఆటలో మేటి, ఓపెనింగ్‌లో ఘనాపాటి. మైదానంలో చిన్నచిన్న స్లెడ్జింగ్ ఉండేదేమో కానీ బాల్ టాపంరింగ్ కంటే ముందు వార్నర్ పక్కా జెంటిల్‌మేనే! 2018లో సఫారీ పర్యటనలో మూడో టెస్టు (కేప్‌టౌన్‌లో) సందర్భంగా వైస్ కెప్టెన్‌గా ఉన్న వార్నర్, కెప్టెన్ స్మిత్, బౌలర్ బ్యాంక్రాఫ్ట్‌తో కలిసి బాల్ టాంపరింగ్ (బంతి ఆకారం మార్చడం)కు పాల్పడంతో ఏడాది పాటు నిషేధానికి, కెరీర్ అసాంతం కెప్టెన్సీకి దూరమయ్యాడు.



ఆడిన టెస్టులు: 112	ఆడిన వన్డేలు: 161	ఆడిన టి20లు: 110
చేసిన పరుగులు: 8786	చేసిన పరుగులు: 6932	చేసిన పరుగులు: 3277
సెంచరీలు: 26	సెంచరీలు: 22	సెంచరీలు: 1
అర్ధ సెంచరీలు: 37	అర్ధ సెంచరీలు: 33	అర్ధ సెంచరీలు: 28
అత్యధిక స్కోరు: 335 నాటౌట్	అత్యధిక స్కోరు: 179	అత్యధిక స్కోరు: 100 నాటౌట్

‘డక్‌వర్త్’ కన్నుమూత

న్యూఢిల్లీ: క్రికెట్‌లో వానొచ్చినపుడుల్లా వినిపించే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి రూపకర్తల్లో ఒకరైన ఫ్రాంక్ డక్‌వర్త్ కన్నుమూశారు. అయితే ఆయన మరణవార్త కాస్త ఆలస్యంగా వెలువడింది. 84 ఏళ్ల డక్‌వర్త్ ఈ నెల 21నే వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస విడిచారు. కానీ ఓ వెబ్‌సైట్ ద్వారా మంగళవారం ఆ వార్త వెలుగులోకి వచ్చింది. ఇక డీఎల్ విషయానికొస్తే డక్‌వర్త్, లూయిస్ ఇద్దరు కలిసి ఆవిష్కరించిన ఈ పద్ధతిని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తొలిసారి 1997లో అమలు చేసింది. తదనంతరం ఆస్ట్రేలియాకు చెందిన గణాంక నిపుణుడు స్టీవెన్ స్టెర్న్... డీఎల్‌కు కొన్ని మార్పుచేర్పులు చేశారు. అప్పటి నుంచి డీఎల్ కాస్త డక్‌వర్త్–లూయిస్–స్టెర్న్ (డీఎల్ఎస్)గా స్థిరపడింది. క్రికెట్‌లో వాన ముంచెత్తితే మ్యాచ్ రద్దవుతుంది. వాన పడి ఆగిపోయాక నిర్వహిస్తే, లేదంటే అప్పటివరకు జరిగిన మ్యాచ్‌లో ఫలితాన్ని తేల్చాలంటే, లక్ష్యాన్ని సవరించాలంటే డీఎల్ఎస్‌నే ప్రామాణికంగా ఉపయోగిస్తున్నారు.



పాక్‌తో భారత్ తొలిపోరు

మహిళల టి20 ఆసియా కప్ టోర్నీ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళల జట్టు ఆసియా కప్ టి20 టైటిల్ వేటను ఆరంభించనుంది. జూలై 19 నుంచి 28 వరకు శ్రీలంకలోని దంబుల్లా నగరంలో ఈ టోర్నీ జరగనుంది. మొత్తం 8 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ‘ఎ’లో భారత్, పాకిస్తాన్, యూఏఈ, నేపాల్... గ్రూప్ ‘బి’లో శ్రీలంక, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మలేసియా జట్లున్నాయి. జూలై 19న పాకిస్తాన్‌తో మ్యాచ్ అనంతరం భారత జట్టు 21న యూఏఈతో, 23న నేపాల్‌తో ఆడతాయి. రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరతాయి.

టాప్–10లో స్మృతి, హర్మన్‌ప్రీత్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్ టాప్–10లో ఉన్నారు. గతవారం మూడో స్థానంలో ఉన్న స్మృతి ఒక స్థానం పడిపోయి నాలుగో ర్యాంక్‌లో నిలువగా... హర్మన్‌ప్రీత్ రెండు స్థానాలు ఎగబాకి తొమ్మిదో ర్యాంక్‌కు చేరుకుంది.



సాక్షి బిజినెస్
బుధవారం
26-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
712	183
78,054	23,721

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,666	▲ 170
డోజోన్స్	39,108	▼ 303
ఎఫ్‌టీఎస్ఈ 100	8,248	▼ 34
డాక్స్	18,178	▼ 148
షాంఘై	2,950	▼ 13
నికాయ్	39,173	▲ 369

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	70,510
బంగారం (22 క్యారట్)	67,150
వెండి (కేజీ)	95,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎడిటం	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఎడిటం	104.84	107.40
€	యూరో	ఎడిటం	88.58	90.54
¥	జపాన్ ఎన్ (100)	ఎడిటం	51.88	53.01
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎడిటం	54.71	56.65
S$	సింగపూర్ డాలర్	ఛాయస్‌టికెట్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	ఛాయస్‌టికెట్	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయస్‌టికెట్	21.83	23.61
¥	చైనా యువాన్	ఛాయస్‌టికెట్	10.37	12.44

సినాప్సిస్‌తో టాటా ఎలక్ట్రానిక్స్ జోడీ




న్యూఢిల్లీ: ఐటీ రంగంలో ఉన్న యూఎస్ కంపెనీ సినాప్సిస్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు టాటా ఎలక్ట్రానిక్స్ తెలిపింది. ఇందులో భాగంగా ధోలేరాలో టాటా ఏర్పాటు చేస్తున్న సెమీకండక్టర్ ప్లాంట్‌కు ప్రాసెస్ టెక్నాలజీ, ఫౌండ్రీ డిజైన్ ప్లాట్‌ఫామ్ కోసం సినాప్సిస్ సహకారం తీసుకోనుంది. రూ.91,000 కోట్ల వ్యయంతో టాటా ఎలక్ట్రానిక్స్ గుజరాత్‌లోని ధోలేరాలో సెమీకండక్టర్ వేఫర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్‌ను నిర్మిస్తోంది.

రూ. 2,000 కోట్లతో ఎంఐపీపీఎల్ విస్తరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంఎస్ అగర్వాల్ గ్రూప్‌లో భాగమైన ఉక్కు ఉత్పత్తుల తయారీ సంస్థ మారుతీ ఇస్పాత్ అండ్ పైప్స్ (ఎంఐపీపీఎల్) వచ్చే అయిదేళ్లలో కార్యకలాపాల విస్తరణపై రూ. 2,000 కోట్లు వెచ్చించనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని మంత్రాలయం ప్లాంట్ విస్తరణతో పాటు ఉత్తరాది మార్కెట్లోనూ తయారీపై దృష్టి పెడుతున్నట్లు సంస్థ సీఈవో అభిషేక్ అగర్వాల్ వెల్లడించారు. ఈఆర్‌డబ్ల్యూ రకం స్టీల్ పైపుల కోసం ఎంఎస్ వాయు పేరిట కొత్త బ్రాండింగ్‌ను ఆవిష్కరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో టర్నోవరు రూ. 1,500 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 2026లో ఐపీవో ద్వారా రూ. 400 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం 2,000 మంది సిబ్బంది ఉండగా కొత్తగా 10,000 మందిని తీసుకోనున్నట్లు అగర్వాల్ పేర్కొన్నారు.

సెన్సెక్స్ @ 78,000



- నిఫ్టీ 23,750 స్థాయిపైకి
- ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డులు
- ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు రయ్

ముంబై: ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం ఇంట్రాడే, ముగింపులోనూ జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. సెన్సెక్స్ తొలిసారి 78 వేల మైలురాయిని అధిగమించింది. నిఫ్టీ ఈ ఏడాదిలో 34వ సారి సరికొత్త రికార్డును నెలకొల్పింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. మిడ్‌సెషన్ నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో ఊహించని రీతిలో పుంజుకున్నాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 823 పాయింట్లు ఎగసి 78,165 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 712 పాయింట్ల లాభంతో 78,054 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 216 పాయింట్లు బలపడి 23,754 వద్ద తాజా గరిష్టాన్ని నెలకొల్పింది. ఆఖరికి 183 పాయింట్లు బలపడి 23,721 వద్ద నిలిచింది. రికార్డుల ర్యాలీలోనూ రియల్టీ, విద్యుత్, వినిమయ, మెటల్, టెలికం షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

రికార్డుల ర్యాలీకి కారణాలు

- కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, సంస్కరణల కొనసాగింపుపై ఆశలు, అధికారం చేపట్టిన తొలి 100 రోజుల ప్రణాళికల అమలుపై మంత్రిత్వ శాఖలు దృష్టి సారించడంతో ట్రేడర్లు ఎఫ్అండ్ఓలపై బుల్లిష్ వైఖరి ప్రదర్శించారు. నిఫ్టీ జూలై సిరీస్ ఫ్యూచర్ కాంట్రాక్టుల్లోకి పొజిషన్లను రోలోవర్ చేసుకునేందుకు ట్రేడర్లు ఆసక్తి చూపుతున్నట్లు ఎఫ్అండ్ఓ గణాంకాలు సూచిస్తున్నాయి.
- ఇటీవల ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లలో ర్యాలీ మందగించడంతో మంగళవారం సూచీల్లో అధిక వెయిటేజీ కలిగిన ప్రైవేటు రంగ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. యాక్సిస్ బ్యాంక్ 3.50%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.50%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.32% కోటక్ బ్యాంక్ అరశాతం మేర రాణించాయి. అలాగే పీఎస్‌యూ ఎస్‌బీఐ బ్యాంకు షేరూ ఒకశాతానికి పైగా లాభపడింది.
- మూడోసారి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో విదేశీ ఇన్వెస్టర్లు ఇండెక్స్ ఫ్యూచర్లలో షార్ట్ పొజిషన్లను కవరింగ్ చేయడంతో పాటు క్రమంగా లాంగ్ పొజిషన్లను బిల్డ్ చేసుకున్నారు. గడచిన ఏడు ట్రేడింగ్ సెషన్లలో ఇండెక్స్ ఫ్యూచర్లలో నికర కొనుగోలుదారులుగా నిలిచారు. ఇండెక్సు ఫ్యూచర్లలో 59.08 శాతం లాంగ్ పొజిషన్లను కలిగి ఉన్నారు. ఇది గత రెండు నెలల్లో అత్యధికం.
- గత ఆర్థిక సంవత్సరంలో జనవరి–మార్చి త్రైమాసికంలో మనదేశ కరెంట్ ఖాతా మిగులు 5.7 మిలియన్ డాలర్లుగా ఉందని, ఇది జీడీపీలో 0.6 శాతానికి సమానమని ఆర్‌బీఐ ప్రకటించింది. ఇది సానుకూల సంకేతం కావడంతో ఇన్వెస్టర్లు భారీ కొనుగోళ్లకు మొగ్గుచూపారు. అలాగే అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై స్పష్టత ఇచ్చిన తర్వాత విదేశీ ఇన్వెస్టర్లు మన మార్కెట్లలో పెట్టుబడులు పెంచవచ్చని, రూపాయి మారకంపై ఒత్తిడి తగ్గే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలు సూచీలకు కలిసొచ్చాయి.

■ అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ షేరు 19% పెరిగి రూ.1,647 వద్ద ముగిసింది. లిథియం అయాన్ సెల్స్ ఉత్పత్తి చేసేందుకు స్లొవేకియా సంస్థ జీఐబీ ఎనర్జీఎక్స్‌తో ఈ సంస్థ లైసెన్సింగ్ డీల్ కుదుర్చుకోవడం ఇందుకు కారణం.

■ ప్రైవేటు రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంకు షేరు 2.5% పెరిగి రూ.1199 వద్ద స్థిరపడింది. దీంతో బ్యాంకు మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్ల (రూ.8.43 లక్షల కోట్లు) వద్ద ముగిసింది.

స్టాన్లీ లైఫ్‌స్టైల్ ఐపీవో సక్సెస్ 96 రెట్లు అధిక స్పందన

లగ్జరీ ఫర్నీచర్ బ్రాండ్(కంపెనీ) స్టాన్లీ లైఫ్‌స్టైల్ పబ్లిక్ ఇష్యూకు భారీ స్పందన లభించింది. ఇష్యూ చివరి రోజు మంగళవారానికల్లా 96 రెట్లు సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంది. కంపెనీ 1.02 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. దాదాపు 98.57 కోట్ల షేర్లకు స్పందన లభించింది. రిటైల్ ఇన్వెస్టర్లు 18 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. షేరుకి రూ. 351–369 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 537 కోట్లు సమీకరించింది.

5జీ స్పెక్ట్రమ్ వేలం.. రూ.11వేల కోట్ల బిడ్లు

మొదటిరోజు మంచి స్పందన



న్యూఢిల్లీ: 5జీ స్పెక్ట్రమ్ వేలం మొదటి రోజున మంచి డిమాండ్ కనిపించింది. మంగళవారం మొత్తం ఐదు రౌండ్లలో టెలికం ఆపరేటర్లు రూ.11వేల కోట్ల మేర బిడ్లు దాఖలు చేశారు. రూ.96,238 కోట్ల విలువ చేసే 10,500 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను కేంద్ర ప్రభుత్వం వేలానికి ఉంచింది. 900, 1800, 2100, 2500 మెగాహెర్ట్జ్ బ్యాండ్లలో స్పెక్ట్రమ్ కోసం ఆపరేటర్లు ఆసక్తి చూపించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వేలంలో పాల్గొన్నాయి. అత్యధికంగా రిలయన్స్ జియో రూ.3,000 కోట్లను ముందస్తుగా డిపాజిట్ చేసింది. దీంతో ఎక్కువ స్పెక్ట్రమ్ కోసం రిలయన్స్ పోటీ పడనున్నట్టు తెలుస్తోంది. భారతీ ఎయిర్‌టెల్ రూ.1,050 కోట్లను, వొడాఫోన్ రూ.300 కోట్ల చొప్పున డిపాజిట్ చేశాయి. 2010లో ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ మొదలైన తర్వాత ఇది పదో విడత స్పెక్ట్రమ్ వేలం కావడం గమనార్హం. కేంద్ర సర్కారు చివరిగా 2022 ఆగస్ట్‌లో వేలం నిర్వహించింది. వేలం బుధవారం తిరిగి ప్రారంభమవుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ టెర్మ్ ప్లాన్‌పై డిస్కౌంట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ సరికొత్త ఆఫర్‌కు తెరతీసింది. టర్మ్ ప్లాన్ అయిన ఐప్రొటెక్ట్ స్మార్ట్ కొనుగోలుపై మహిళలకు 15 శాతం లైఫ్‌టైమ్ డిస్కౌంట్ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. ఉద్యోగం చేస్తున్న మహిళలకు తొలి ఏడాది ప్రీమియంపై అదనంగా 15 శాతం తగ్గింపు ఇస్తారు. బ్రెస్ట్, ఒవేరియన్, యుటెరిన్, సెర్వికల్ క్యాన్సర్స్ వంటి 34 క్లిష్ట అనారోగ్య సమస్యలకు కవరేజ్ ఎంచుకోవచ్చు. మరణం, ప్రాణాంతక అనారోగ్యం, వైకల్యంతో సహా జీవితంలోని అనిశ్చితి నుండి ఆర్థిక రక్షణను ఐప్రొటెక్ట్ స్మార్ట్ అందిస్తుంది. 99 సంవత్సరాల వయస్సు వరకు లైఫ్ కవర్‌ను ఆఫర్ చేస్తోంది.

బజాజ్ ఫైనాన్స్‌తో టాటా మోటార్స్ జట్టు



న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ తాజాగా బ్యాంకింగేతర రుణ సంస్థ బజాజ్ ఫైనాన్స్‌తో చేతులు కలిపింది. ఇందులో భాగంగా టాటా వాణిజ్య వాహనాల కొనుగోలుకు కస్టమర్లకు సులభ వాయిదాల్లో రుణాలను బజాజ్ ఫైనాన్స్ సమకూరుస్తుంది. దేశంలో మారుమూల పల్లెలకూ బజాజ్ ఫైనాన్స్ చొచ్చుకుపోయిందని, వినియోగదార్లకు సులభంగా రుణం లభించేందుకు ఈ భాగస్వామ్యం ద్వారా వీలవుతుందని టాటా మోటార్స్ మంగళవారం తెలిపింది. తాజా డీల్ ద్వారా బజాజ్ ఫైనాన్స్ వాణిజ్య వాహనాల రుణ విభాగంలోకి ప్రవేశించినట్టు అయింది. బజాజ్ ఫైనాన్స్‌కు దేశవ్యాప్తంగా 8.36 కోట్ల మంది కిపైగా కస్టమర్లు ఉన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-6-2024	
విశాఖ	525–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515–00
వరంగల్	517–00
రిటైల్ ధర	5.75

భారీ పెట్టుబడులకు అదానీ రెడీ

- రెన్యువబుల్స్‌పై రూ. 2 లక్షల కోట్లు
- 2030కల్లా 50 గిగావాట్ల సామర్థ్యం



అహ్మదాబాద్: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ పునరుత్పాదక (రెన్యువబుల్స్) విద్యుదుత్పత్తిపై భారీగా ఇన్వెస్ట్ చేయనుంది. 2030కల్లా 40 గిగావాట్ల (జీడబ్ల్యూ) పునరుత్పాదక సామర్థ్యాన్ని నిర్మించే ప్రణాళికల్లో ఉంది. ఇందుకు రూ. 2 లక్షల కోట్ల పెట్టుబడులకు సిద్ధపడుతోంది. తద్వారా 2050కల్లా వివిధ బిజినెస్‌లలో నికరంగా కర్బనరహితం(నెట్ జీరో)గా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం గ్రూప్ పునరుత్పాదక(సౌర, పవన) విద్యుత్‌లో 10 గిగావాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇకపై ప్రతీ ఏడాది 6–7 జీడబ్ల్యూను జత చేసుకోవాలని చూస్తోంది. వెరసి 2030కల్లా 50 గిగావాట్లకు చేరుకునే లక్ష్యంతో పనిచేస్తోంది. ఒక్కో మెగావాట్‌కు రూ. 5 కోట్ల పెట్టుబడుల అంచనాతో మదింపు చేస్తే 2030కల్లా రూ. 2 లక్షల కోట్లను వెచ్చించవలసి ఉంటుందని అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ వెల్లడించారు. వీటితోపాటు 5 జీడబ్ల్యూ పంప్ స్టోరేజీ సామర్థ్యాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ సీఈవో అమిత్ సింగ్ తెలిపారు. విద్యుత్‌కు అధిక డిమాండ్ నెలకొనే రాత్రి వేళల్లో విద్యుదుత్పత్తికి వీలుగా స్టోరేజీ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వివరించారు.

కార్బన్ క్రెడిట్స్..

రెన్యువబుల్ సామర్థ్యాల వినియోగం ద్వారా లభించే కార్బన్ క్రెడిట్స్‌కుతోడు మరికొన్ని ఇతర చర్యల ద్వారా 2050కల్లా అదానీ గ్రూప్ నెట్ జీరోకు చేరనున్నట్లు అమిత్ పేర్కొన్నారు. గతేడాది(2023–24) అదానీ గ్రీన్ ఎనర్జీ 2.8 జీడబ్ల్యూ సామర్థ్యాలను జత చేసుకున్నట్లు తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం(2024–25)లో 6 జీడబ్ల్యూ సామర్థ్యాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కాగా, అదానీ గ్రూప్ ఈ ఏడాది (2024–25) వివిధ విభాగాలపై భారీ పెట్టుబడుల ప్రణాళికలు ప్రకటించింది. వివిధ కంపెనీలలో రూ. 1.3 లక్షల కోట్లు వెచ్చించనుంది.

సినిమా

చిన్న కథ కాదు!


● నివేదా థామస్

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '35 – చిన్న కథ కాదు'. ఈ చిత్రానికి నంద కిశోర్ ఈమాని దర్శకత్వం వహించారు. సురేష్ ప్రొడక్షన్స్ ఎస్. ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ పై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రానికి '35– చిన్న కథ కాదు' అనే టైటిల్‌ని ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఆగస్ట్ 15న సినిమాని తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు కూడా అధికారికంగా ప్రకటించారు. ''క్లీన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామా '35–చిన్న కథ కాదు'. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా చక్కని వినోదంతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ఈ సినిమా సిద్ధమైంది. తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, కెమెరా నికేత్ బొమ్మి.

నిశి తొలిచాడు దీపమై...


● దీపికా పదుకోన్

'అధర్మాన్ని అణచెయ్యగ యుగయుగాన జగములోన పరిపరి విధాల్లోన విభవించే విక్రమ విరాట్ రూపమితడే... స్వధర్మాన్ని పరిరక్షించగ సమస్తాన్ని ప్రక్షాళించగ సముద్భవించే అవతారమిదే...' అంటూ మొదలవుతుంది 'కల్కి' థీమ్ సాంగ్. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కల్కి 2898ఏడీ'. ఈ చిత్రంలో దీపికా పదుకోన్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం రేపు (గురువారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా 'థీమ్ ఆఫ్ కల్కి' పాటను మంగళవారం విడుదల చేశారు. 'అధర్మాన్ని అణచేయగా..' అంటూ మొదలై... 'నిశి తొలిచాడు దీపమై... నిధనం తన ధ్యేయమై... వాయువే వేగమై...కలియుగ స్థితి లయలే కలబోసే కల్కి ఇతడే...' అనే లిరిక్స్‌తో 'థీమ్ ఆఫ్ కల్కి' సాగుతుంది. కాలభైరవ, సంతోష్ నారాయణన్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా కాలభైరవ పాడారు.

పారిపోలేరు... దాక్కోనూలేరు


● కమల్‌హాసన్

'**ఊ**రారా ఇది... చదువుకు తగ్గ జాబ్ లేదు... జాబ్‌కి తగ్గ జీతం లేదు... కట్టిన ట్యాక్స్‌కి తగినట్టు ఫెసిలిటీస్ దొరకడం లేదు', 'దొంగలించేవాడు దొంగలిస్తూనే ఉంటాడు, తప్పు చేసేవాడు తప్పు చేస్తూనే ఉంటాడు' అంటూ ఓ మహిళ ఆవేదనతో చెప్పే డైలాగులతో 'భారతీయుడు 2' ట్రైలర్ ఆరంభమైంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'భారతీయుడు 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'భారతీయుడు' (1996)కి సీక్వెల్‌గా 'భారతీయుడు 2, భారతీయుడు 3' చిత్రాలు రూపొందాయి. సిద్ధార్థ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, గుల్షన్ గ్రోవర్ ఇతర పాత్రల్లో నటించారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగులో 'భారతీయుడు 2', తమిళంలో 'ఇండియన్ 2', హిందీలో 'హిందుస్తానీ 2' పేరుతో జూలై 12న విడుదల కానుంది. కాగా మంగళవారం ముంబైలో 'భారతీయుడు 2' ట్రైలర్ లాంచ్ వేడుకని నిర్వహించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ట్రైలర్స్‌ని విడుదల చేశారు మేకర్స్. 'ఇది రెండో స్వాతంత్ర్య పోరాటం... గాంధీజీ మార్గంలో మీరు... నేతాజీ మార్గంలో నేను', 'సో పారిపోలేరు... దాక్కోనూలేరు', 'టామ్ అండ్ జెర్రీ ఆట ఆరంభమైంది' అంటూ కమల్ హాసన్ చెప్పే డైలాగులు ట్రైలర్ ఉన్నాయి. ఇదిలా ఉంటే... 'భారతీయుడు 2' మూవీ తెలుగు హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పీ, సీడెడ్ హక్కులను శ్రీ లక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి.

థ్రిల్లింగ్ షణ్ముఖ


● షణ్ముగం, ఆది సాయికుమార్, అవికా గోర్

ఆది సాయికుమార్, అవికా గోర్ హీరో హీరోయిన్లుగా నటించిన డివోషనల్ థ్రిల్లర్ మూవీ 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహించారు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మించిన ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకుడు షణ్ముగం మాట్లాడుతూ– ''ఆది కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన డివోషనల్ పాయింట్‌తో విజువల్ వండర్‌లా ఈ చిత్రం ఉంటుంది. గ్రాఫిక్స్ విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. 'కేజీఎఫ్, సలార్' సినిమాలకు సంగీతం అందించిన రవి బస్రూర్ ఈ సినిమాకు సంగీతం అందించారు. హైదరాబాద్‌లో వేసిన ఓ సెట్‌లో జరిగిన చివరి షెడ్యూల్ చిత్రీకరణతో ఈ సినిమా షూటింగ్ పూర్తయింది త్వరలో నిర్మాణానంతర కార్యక్రమాలు ఆరంభిస్తాం'' అని పేర్కొన్నారు.

సెప్టెంబరులో ఎమర్జెన్సీ


● కంగనా రనౌత్

భారతదేశంలో ఏర్పడ్డ ఎమర్జెన్సీ (25 జూన్ 1975 – 21 మార్చి 1977) పరిస్థితుల ఆధారంగా హిందీలో తెరకెక్కిన చిత్రం 'ఎమర్జెన్సీ'. కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన సినిమా ఇది. ఈ చిత్రంలో భారతదేశ దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పాత్రలో కంగనా రనౌత్ నటించారు. అనుపమ్ ఖేర్, శ్రేయాస్ తల్పాడే, అశోక్ చబ్రా, మహిమా చౌదరి ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాను కంగనా రనౌత్, పి. రేణు నిర్మించారు. ఈ సినిమాను తొలుత గత నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ కుదర్లేదు. ఆ తర్వాత ఈ ఏడాది జూన్ 14న రిలీజ్‌కు ప్లాన్ చేశారు. ఆ తేదీకి కూడా రాలేదు. తాజాగా 'ఎమర్జెన్సీ'ని సెప్టెంబరు 6న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించి, కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ''భారతదేశంలో ఎమర్జెన్సీ పరిస్థితులు ఏర్పడి జూన్ 25 నాటికి 49 సంవత్సరాలు పూర్తయి, 50వ ఏడాదిలోకి అడుగుపెట్టాం. నాటి పరిస్థితుల నేపథ్యంలో తీసిన 'ఎమర్జెన్సీ'ని సెప్టెంబరు 6న విడుదల చేస్తున్నాం. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలోని ఈ వివాదాస్పదమైన ఎపిసోడ్‌ను మా సినిమాలో చూపించబోతున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

హీరోయిజమ్ చూపించాలని బడ్డీ చేయలేదు - అల్లు శిరీష్


● గాయత్రి, అల్లు శిరీష్, ప్రిషా


''బడ్డీ'లో హీరో నేను కాదు.. టెడ్డీ బేర్. ఆ పాత్ర నచ్చడంతోనే ఈ సినిమా చేశాను... అంతేకానీ నా హీరోయిజమ్ చూపించాలని కాదు. జ్ఞానవేల్ రాజా గారికి థ్యాంక్స్. మా నాన్న (నిర్మాత అల్లు అరవింద్) కూడా నాపై ఇంత ఖర్చు పెట్టి సినిమా నిర్మించలేదు. భారీ బడ్జెట్‌తో నాతో బిగ్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ తీశారు జ్ఞానవేల్ గారు'' అని అల్లు శిరీష్ అన్నారు. శ్యామ్ ఆంటోన్ దర్శకత్వంలో అల్లు శిరీష్ హీరోగా గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బడ్డీ'. కేఈ జ్ఞానవేల్ రాజా, అధనా జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ మూవీ జూలై 26న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'బడ్డీ' ట్రైలర్ రిలీజ్ కార్యక్రమంలో అల్లు శిరీష్ మాట్లాడుతూ– ''టెడ్డీ బేర్‌తో అడ్వెంచర్ యాక్షన్ మూవీ చేశాం.. ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అనుకున్నా. కానీ, 'బడ్డీ' ట్రైలర్ చూశాక నాకు చాలా నమ్మకం వచ్చింది'' అన్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ– ''గీతా ఆర్ట్స్, స్టూడియో గ్రీన్ కలిసి శ్యామ్ ఆంటోన్ దర్శకత్వంలో 'ప్రేమకథా చిత్రమ్' సినిమాను తమిళంలో రీమేక్ చేయగా మంచి హిట్ అయ్యింది. ఆ మూవీ తర్వాత 'బడ్డీ' కోసం శ్యామ్ మరోసారి మా సంస్థలో పని చేశాడు. మా సినిమాను తెలుగు ప్రేక్షకులు బ్లాక్ బస్టర్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''రాజమౌళిగారి 'ఈగ' సినిమానే మా 'బడ్డీ'కి స్ఫూర్తి'' అన్నారు శ్యామ్ ఆంటోన్. నిర్మాత 'మధుర' శ్రీధర్ రెడ్డి, నటులు అలీ, అజ్మల్ తదితరులు మాట్లాడారు.

ఎస్ బాస్ షూటింగ్ పూర్తి


● హవీష్

అనుష్క లీడ్ రోల్‌లో 'భాగమతి' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన అశోక్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'ఎస్ బాస్'. 'నువ్విలా, జీనియస్' చిత్రాల ఫేమ్ హవీష్ హీరోగా నటిస్తున్నారు. కె. స్టూడియోస్‌పై 'రాక్షసుడు, ఖిలాడి' వంటి హిట్ చిత్రాలను నిర్మించిన కోనేరు సత్యనారాయణ నిర్మిస్తున్న 'ఎస్ బాస్' మూవీ చిత్రీకరణ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. అలాగే హవీష్ బర్త్‌డేని (జూన్ 25) పురస్కరించుకుని కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. ''వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'ఎస్ బాస్'. ఈ చిత్రంలోని వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని యూనిట్ పేర్కొంది. బ్రహ్మానందం కీలక పాత్ర పోషించిన ఈ చిత్రానికి సమర్పణ: కాంచన కోనేరు, కెమెరా: కబీర్ లాల్, సంగీతం: అనూప్ రూబెన్స్.

ఈసారి బీభత్సమే...


● శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావ్

బాలీవుడ్ కామెడీ హారర్ హిట్ ఫిల్మ్ 'స్త్రీ' (2018)కి సీక్వెల్‌గా 'స్త్రీ 2' రూపొందిన సంగతి తెలిసిందే. తొలి భాగంలో నటించిన శ్రద్ధా కపూర్, రాజకుమార్ రావ్ 'స్త్రీ 2' సినిమాలోనూ లీడ్ రోల్స్‌లో నటించారు. చందేరి బ్యాక్‌డ్రాప్‌తో 'స్త్రీ' సినిమాకు దర్శకత్వం వహించిన అమర్ కౌశిక్‌యే సీక్వెల్‌కూ దర్శకత్వం వహించారు. దినేష్ విజయ్, జ్యోతి దేశ్‌పాండే నిర్మించిన ఈ 'స్త్రీ 2' చిత్రం ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ''ఈసారి ఆజాదీ రోజున (స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15) చందేరీలో బీభత్సం జరగబోతోంది. ఆమె తిరిగొచ్చింది'' అంటూ 'స్త్రీ 2' సినిమా హిందీ టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'స్త్రీ' బాక్సాఫీస్ వద్ద రూ. 150 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు రాబట్టిన నేపథ్యంలో 'స్త్రీ 2'పై బాలీవుడ్‌లో అంచనాలు ఉన్నాయి.

మేం ఫ్రెండ్సండి!


● నార్నే నితిన్

ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఆయ్'. 'మేం ఫ్రెండ్సండి' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. నయన్ సారిక హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాతో అంజి. కె మణిపుత్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ ఫన్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీని అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ సినిమాను ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లు యూనిట్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాకు సంగీతం: రామ్ మిర్యాల, కెమెరా: సమీర్ కల్యాణి.

క్లుప్తంగా...

ఏపీ టెట్‌-2024 ఫలితాలు విడుదల

- పరీక్షలకు 2,35,907 మంది హాజరు
- 1,37,903 మంది అభ్యర్థులు అర్హత

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్‌) ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ మంగళవారం విడుదల చేశారు. టెట్‌-2024కు ఫిబ్రవరిలో ప్రభుత్వం నోటిఫికేషన్, పరీక్షల షెడ్యూల్‌ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనికి బీఈడీ, డీఈడీ అభ్యర్థులు మొత్తం 2,67,789 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదేనెల 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షలకు 2,35,907 మంది (88.90 శాతం) హాజరయ్యారు. ఆ తరువాత ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో ఫలితాలు వెల్లడించలేదు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో 1,37,903 మంది (58.4 శాతం) మంది అర్హత సాధించారు. సెకండరీ గ్రేడ్‌ టీచర్ల అర్హత పరీక్ష పేపర్‌-1ఏ (రెగ్యులర్‌)లో 75,142 మంది, పేపర్‌-1బీ (స్పెషల్‌ ఎడ్యుకేషన్‌)లో 790 మంది ఉత్తీర్ణులయ్యారు. స్కూల్‌ అసిస్టెంట్‌ టీచర్ల అర్హత పరీక్ష అయిన పేపర్‌-2ఏ(రెగ్యులర్‌)లో 60,846 మంది, పేపర్‌-2బీ(స్పెషల్‌ ఎడ్యుకేషన్‌)లో 1,125 మంది విజయం సాధించారు. ఫలితాలను https:// cse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్టు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది.

ముగిసిన లడఖ్‌ ఎన్‌సీసీ విద్యార్థుల విశాఖ టూర్‌



క్షిపణుల పనితీరుని వివరిస్తున్న తూర్పు నౌకాదళ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: లడఖ్‌ నుంచి 30 మంది ఎన్‌సీసీ విద్యార్థుల బృందం విశాఖలో మూడు రోజుల పర్యటన మంగళవారం ముగిసింది. ముందుగా నేవల్‌ ఎయిర్‌ బేస్‌ ఐఎన్‌ఎస్‌ డేగాకు చేరుకున్న ఎన్‌సీసీ బృందానికి నౌకాదళ బృందం ఆత్మీయ స్వాగతం పలికింది. అనంతరం.. డేగాలో ఉన్న యుద్ధ విమానాల పనితీరును విద్యార్థులు పరిశీలించారు. ఎయిర్‌ ట్రాఫిక్‌ సర్వీసెస్‌ టవర్‌ పనితీరు, గైడెడ్‌ టూర్, ఎయిర్‌ సేఫ్టీ పరికరాల పనితీరుపై డెమో ప్రదర్శన నిర్వహించారు. అక్కడి నుంచి సబ్‌మెరైన్ల శిక్షణ కేంద్రం ఐఎన్‌ఎస్‌ శాతవాహనాలో జలాంతర్గాముల పనితీరుని అడిగి తెలుసుకున్నారు. సముద్ర జలాల్లో యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో సబ్‌మెరైన్ల ద్వారా ఎలాంటి వ్యూహాల్ని అనుసరించనున్నారు అనే అంశాలపై ఎన్‌సీసీ బృందంలో ఆసక్తి నెలకొనేలా చేశారు. ఎయిర్‌ఫోర్స్, నేవీలో చేరేందుకు ఈ టూర్‌ తమలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించిందని ఎన్‌సీసీ బృందం తెలిపింది.

నేటి నుంచి జాతీయ విద్యుత్‌ భద్రతా వారోత్సవాలు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా జాతీయ విద్యుత్‌ భద్రతా వారోత్సవాలు జూన్‌ ఈ నెల 26 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో విద్యుత్‌ భద్రతపై పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు విద్యుత్‌ భద్రతా సంచాలకులు, ప్రభుత్వ ప్రధాన విద్యుత్‌ తనిఖీ అధికారి జి.విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. 'విద్యుత్‌ భద్రతను స్వీకరించి జీవితాలను రక్షించండి' అనే నినాదంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్‌ భద్రతా సంచాలకుల శాఖలోని ఫీల్డ్‌ సిబ్బంది తమ అధికార పరిధిలో ఉన్న పాఠశాలలు, పరిశ్రమలు, సంస్థలు, ఆసుపత్రులు, సినిమా హాళ్ళు, అపార్ట్‌మెంట్‌లు, షాపింగ్‌ మాల్స్‌ మొదలైన వాటిలో విద్యుత భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారని వివరించారు. బస్‌ స్టాండ్, రైల్వే స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రులు మొదలైన చోట్ల భద్రతా నినాద బ్యానర్లను ప్రదర్శిస్తామన్నారు.

నేటి భవితలో..

- జాబ్స్‌ ఇన్ఫో: సింగరేణిలో.. కొలువుల మేళ ఐటీఐ, డిప్లొమా, బీటెక్‌ ఉత్తీర్ణులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! ప్రారంభంలోనే నెలకు రూ.40 వేలకు పైగా వేతనంతో సర్కారీ కొలువు తలుపుతడుతోంది! దేశంలోని ప్రముఖ బొగ్గు గనుల సంస్థ.. సింగరేణి కాలరీస్‌ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేసింది!! ఈ నోటిఫికేషన్‌ ద్వారా ఎగ్జిక్యూటివ్, నాన్‌-ఎగ్జిక్యూటివ్‌ విభాగాల్లో.. మొత్తం 327 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. సింగరేణి కాలరీస్‌ విడుదల చేసిన ఎగ్జిక్యూటివ్, నాన్‌-ఎగ్జిక్యూటివ్‌ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు.
- జాబ్‌ పాయింట్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం; యూపీఎస్సీ, ఎస్‌ఎస్‌సీ, రైల్వేలు, త్రివిధ దళాలు, బ్యాంకింగ్, ప్రభుత్వ రంగ సంస్థలు, అటానమస్‌ ఇన్‌స్టిట్యూట్స్‌లో జాబ్‌ నోటిఫికేషన్లు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర సమాచారంతో జాబ్‌ పాయింట్‌.

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కప్పం కడితేనే 'కింగ్‌ ఫిషర్‌'!

నెలకు రూ.1.50 కోటి.. ఏడాదికి రూ.18 కోట్లు కట్టాల్సిందే

కింగ్‌ ఫిషర్‌ బీరు ఉత్పత్తి చేసే యూబీ కంపెనీకి తేల్చిచెప్పిన కూటమి ముఠా

- ఇంత భారీ మొత్తం చెల్లించలేమన్న కంపెనీ
- దీంతో రెచ్చిపోయిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గీయులు
- ఫ్యాక్టరీపై దాడి.. కంపెనీ ఆస్తులు ధ్వంసం
- లారీలను అనుమతించని వైనం
- కంపెనీ ముందు బారులు తీరిన లారీలు
- డబుల్‌ గేమ్‌తో డ్రామాను రక్తి కట్టిస్తున్న మంత్రి అచ్చెన్న
- పారిశ్రామికవేత్తలకు అప్పుడే పచ్చ ముఠా బెదిరింపులు



సాక్షి, అమరావతి: 'మాకు లాభం ఉంటేనే లారీలు కదులుతాయి'.. 'మాకు కప్పం కడితేనే కింగ్‌ ఫిషర్‌ బీరు మార్కెట్‌లోకి వస్తుంది.. లేదంటే అంతే సంగతులు' అని పారిశ్రామికవేత్తలకు హెచ్చరికలు జారీ చేస్తోంది.. టీడీపీ కూటమి ముఠా. డీల్‌ సెట్‌ కాకపోతే కంపెనీలోకి ఒక్క లారీని రానివ్వం.. పోనివ్వం అని తెగేసి చెబుతోంది. దీంతో కింగ్‌ ఫిషర్‌ బీరును ఉత్పత్తి చేసే యునైటెడ్‌ బ్రూవరీస్‌ (యూబీ) కంపెనీ అధికార పార్టీ దాష్టీకానికి బెంబేలెత్తుతోంది. శ్రీకాకుళం జిల్లాలో పారిశ్రామికవేత్తలను హడలెత్తిస్తున్న ఈ సిండికేట్‌ను ఎచ్చెర్ల బీజేపీ ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు వర్గం తెరముందు నడుపుతుంటే.. తెర వెనుక వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వర్గం చక్రం తిప్పుతోంది. నెలకు రూ.1.50 కోట్లు చొప్పున ఏడాదికి రూ.18 కోట్లు తమకు కప్పం కింద కట్టాలని కంపెనీకి కూటమి ప్రజాప్రతినిధులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందుకు యునైటెడ్‌ బ్రూవరీస్‌ సిద్ధంగా లేకపోవడంతో కింగ్‌ ఫిషర్‌ బీరు ఉత్పత్తి మొదలుకావడం లేదు.

అడుగడుగునా అడ్డుపడుతున్న టీడీపీ కూటమి ముఠా..

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం బంటుపల్లిలో ఉన్న యునైటెడ్‌ బ్రూవరీస్‌ (యూబీ) బీర్‌ కంపెనీ ఉంది. తమ ఫ్యాక్టరీలో కింగ్‌ ఫిషర్‌ బీరు ఉత్పత్తిని ప్రారంభించేందుకు ఆ కంపెనీ చేస్తున్న యత్నాలకు అడుగడుగునా టీడీపీ కూటమి ముఠా అడ్డు పడుతోంది. ముడి సరుకును ఫ్యాక్టరీకి తీసుకువచ్చి, ఉత్పత్తి చేసిన సరుకును ఫ్యాక్టరీ నుంచి బయటకు తీసుకువెళ్లే ఒక్కో లారీకి రూ.వేయి చొప్పున కప్పం చెల్లించాలని ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గం కరాఖండీగా తేల్చిచెప్పిందనే విషయం సంచలనం సృష్టించింది. ఎందుకంటే లోడింగ్, అన్‌లోడింగ్‌ కోసం రోజుకు సగటున 500 లారీలు వస్తాయి.. ఆ లెక్కన రోజుకు రూ.5 లక్షల చొప్పున నెలకు రూ.1.50 కోట్ల వరకు కప్పంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి ఈ మొత్తం 18 కోట్లు. అంత భారీ మొత్తం కప్పంగా చెల్లించలేమని కంపెనీ ప్రతినిధులు చెప్పడంతో ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గీయులు ఏకంగా ఆ ఫ్యాక్టరీపై దాడి చేసి బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. కంపెనీ ఆస్తులను ధ్వంసం చేయడమే కాకుండా కంపెనీలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిపై దాడి చేసి భయోత్పాతం సృష్టించారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు మొదట పట్టించుకోలేదు. కేంద్ర హోం శాఖకు నివేదించడంతో ఢిల్లీ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో పోలీసులు ఒక రోజు తరువాత కేసు నమోదు చేశారు. మరోవైపు కంపెనీ ఉద్యోగులపై ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించడం గమనార్హం. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాకే చెందిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జోక్యం చేసుకుని కప్పం కట్టేలా డీల్‌ సెట్‌ చేసినట్టు సమాచారం. ఆయన ఆదేశాలతో కంపెనీ ప్రతినిధులు ఎమ్మెల్యే ఈశ్వరరావుతో రాజీ చర్చలు కూడా జరిపారు. తాము అడిగినట్టుగా నెలకు రూ.1.50 కోట్లు కప్పం కడితేనే బీర్‌ ఉత్పత్తి ప్రారంభించకోవచ్చని ఎమ్మెల్యే వర్గం కంపెనీకి తేల్చిచెప్పింది.

కంపెనీ యాజమాన్యం ససేమిరా..

ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గం డిమాండ్‌ చేసినట్టుగా నెలకు రూ.1.50 కోట్లు వరకు కప్పంగా చెల్లించేందుకు యూబీ కంపెనీ యాజమాన్యం ససేమిరా అన్నట్టు సమాచారం. బంటుపల్లిలోని ఒక్క యూనిట్‌కే ఏడాదికి ఏకంగా రూ.18 కోట్లు అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు మామూళ్లుగా ఇవ్వడం తలకుమించిన భారంగా ఆ కంపెనీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. మరో రూపంలో కొంత మొత్తం అయితేనే ఇవ్వగలమని చెప్పినట్టు సమాచారం. దీంతో ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గం భగ్గుమంది. ఫ్యాక్టరీలోని బీరు ఉత్పత్తికి అడ్డుపడుతోంది. రెండు రోజులుగా ఫ్యాక్టరీకి లారీలు వస్తున్నా అందులోని ముడి సరుకును అన్‌లోడింగ్‌ చేయనీయడం లేదు. అంతేకాకుండా ఇప్పటికే ఉత్పత్తి చేసిన బీరును మార్కెట్‌లోకి పంపేందుకు లారీల్లోకి లోడింగ్‌ చేయనీయడం లేదు. అంతేకాకుండా కళాసీలెవరూ పనిలోకి రావడానికి వీల్లేదని ఎమ్మెల్యే వర్గం అల్టిమేటం జారీ చేసింది. ఎమ్మెల్యే వర్గం గుప్పిట్లోనే కళాసీల సంఘం ప్రతినిధులు ఉండటం గమనార్హం. ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గీయుల దాష్టీకంతోయూబీ ఫ్యాక్టరీ ముందు భారీ సంఖ్యలో లారీలు బారులు తీరి ఉన్నాయి. ఎమ్మెల్యే వర్గం హెచ్చరికలకు భయపడి ఎవరూ ముడి సరుకును అన్‌లోడింగ్‌ చేయడం లేదు. దాంతో యూబీ ఫ్యాక్టరీలో బీరు ఉత్పత్తి నిలిచిపోయింది. మరోవైపు ఉత్పత్తి కోసం తెప్పించిన ముడి సరుకు సైతం లారీల్లోనే మగ్గిపోతోంది. ముడి సరుకు పాడైపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని కంపెనీ ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు.

డ్రామాను అదరగొడుతున్న అచ్చెన్న

ఈ వ్యవహారంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు డబుల్‌ గేమ్‌ ఆడుతుండటం గమనార్హం. కంపెనీ ప్రతినిధులు తమ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఈశ్వరరావుతో మాట్లాడినట్టు అచ్చెన్నాయుడు కథ నడిపించారు. తాను చెబుతున్నా కళాసీలు వినడం లేదని చెప్పి ఎమ్మెల్యే ఈశ్వరరావు తప్పించుకున్నారు. అయితే మంత్రి అచ్చెన్న, ఎమ్మెల్యే ఈశ్వరావు పక్కా పన్నాగంతోనే ఈ వ్యవహారాన్ని ఉద్దేశపూర్వకంగా సాగదీస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యాక్టరీలో బీరు ఉత్పత్తి కొన్ని రోజుల పాటు నిలిచిపోతే యాజమాన్యం తప్పనిసరిగా తమ కాళ్లబేరానికి వస్తుందనేదే ఇద్దరు నేతల ఉద్దేశమని అంటున్నారు. అదే అదనుగా భారీగా కప్పం డిమాండ్‌ చేసి సాధించుకోవచ్చని కుట్రపన్నారు.

పారిశ్రామికవేత్తల ఆందోళన..

అధికారంలోకి వచ్చీ రావడంతోనే కూటమి నేతల బెదిరింపులతో పారిశ్రామికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. పారిశ్రామికవేత్తల పట్ల ప్రభుత్వ వైఖరిపై వారిలో ఆవేదన వ్యక్తమవుతోంది. కానీ ప్రభుత్వ పెద్దలు మాత్రం తమ పంతం వీడటం లేదు. యూబీ కంపెనీ ఉదంతం ద్వారా రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలకు స్పష్టమైన సందేశం ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ ఉద్దేశంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాము డిమాండ్‌ చేసినంత కప్పం కడితేనే రాష్ట్రంలో ఏ కంపెనీ అయినా మనుగడ సాగిస్తుంది.. లేదంటే ఆ కంపెనీ మూత పడాల్సిందేనని స్పష్టం చేస్తోంది.

పొన్నవోలు భద్రతను 4 వారాలు కొనసాగించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా
- కౌంటర్‌ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, అమరావతి : మాజీ అదనపు అడ్వొకేట్‌ జనరల్‌ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి ఉన్న భద్రత (2+2)ను మరో నాలుగు వారాలు కొనసాగించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్‌ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ కొనకంటి శ్రీనివాసరెడ్డి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు వ్యతిరేకంగా కేసులు వాదించానన్న కక్షతో తనకున్న భద్రతను ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని, భద్రతను కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్‌ శ్రీనివాసరెడ్డి మంగళవారం విచారణ జరిపారు. సుధాకర్‌రెడ్డి తరఫున సీనియర్‌ న్యాయవాది దేశాయ్‌ ప్రకాశ్‌ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తమకు వ్యతిరేకంగా పనిచేసిన వారి సంగతి చూస్తామని, వారి పేర్లను రెడ్‌ బుక్‌లో నమోదు చేస్తున్నామంటూ నారా లోకేశ్‌ ఎన్నికల ప్రచారంలో చెప్పారన్నారు. అలాగే పలు ఇంటర్వ్యూల్లో కూడా ఇదే విషయాన్ని చెప్పారని, ఇప్పుడు ఆ రెడ్‌ బుక్‌ విస్తృత ప్రాచుర్యంలోకి వచ్చిందని, అందులో పిటిషనర్‌ సుధాకర్‌రెడ్డి పేరు మూడో పేజీలో ఉన్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు వ్యతిరేకంగా గతంలో సుధాకర్‌రెడ్డి అనేక కీలక కేసుల్లో వృత్తిపరమైన వాదనలు వినిపించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనకు ప్రాణహాని ఉండటంతో గత ప్రభుత్వం 2+2 భద్రత కల్పించిందన్నారు. వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించినందుకు సుధాకర్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు దిగే అవకాశం ఉందన్నారు. అందులో భాగంగానే ఆయనకు భద్రతను ఉపసంహరించే అవకాశం ఉందని, ఇది సహేతుక ఆందోళన అని ఆయన వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి, నాలుగు వారాల పాటు సుధాకర్‌రెడ్డి భద్రతను కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వడానికి వీల్లేదు

న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి జోక్యం చేసుకుని భద్రత కొనసాగింపు ఉత్తర్వులను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇంతకీ మీరెవరని, ఎవరి తరఫున హాజరవుతున్నారని న్యాయమూర్తి ప్రశ్నించగా.. తాను అడ్వొకేట్‌ జనరల్‌ (ఏజీ) ఆదేశాల మేరకు ఈ కేసులో హాజరవుతున్నానని తెలిపారు. న్యాయమూర్తి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఉత్తర్వులు ఇవ్వాలా? లేదా? అన్నది తన విచక్షణకు సంబంధించినదని, దీనిని ఎలా ప్రశ్నిస్తారని అన్నారు. తాను ఇచ్చిన ఉత్తర్వులు నాలుగు వారాలకేనని స్పష్టం చేశారు. అలా అయితే ఓ పది నిమిషాలు విచారణను వాయిదా వేయాలని, తాను అడ్వొకేట్‌ జనరల్‌కు ఈ ఉత్తర్వుల గురించి వివరిస్తానని కృష్ణారెడ్డి చెప్పారు. ఏజీకి వివరించేందుకు తనకు అభ్యంతరం లేదని, అయితే తాను పరిమిత కాలానికే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశానని న్యాయమూర్తి తేల్చి చెప్పారు.

వాసుదేవరెడ్డి పిటిషన్‌ విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్‌ శ్రీనివాసరెడ్డి

- ఈ వ్యాజ్యాన్ని సీజే ముందుంచాలని రిజిస్ట్రీకి ఆదేశం
- గురువారం విచారణకు వచ్చేలా చూడాలని స్పష్టీకరణ
- ఈలోపు రక్షణ కల్పించాలన్న వాసుదేవరెడ్డి న్యాయవాది
- ఎలాంటి రక్షణ కల్పించొద్దన్న సీఐడీ న్యాయవాది

సాక్షి, అమరావతి : ఏపీ స్టేట్‌ బెవరేజెస్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (ఏపీఎస్‌బీసీఎల్‌) ఫైళ్లు, కంప్యూటర్‌ పరికరాలు, ఇతర డాక్యుమెంట్లను తరలించారంటూ తనపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ఆ సంస్థ మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం న్యాయమూర్తి జస్టిస్‌ కొనకంటి శ్రీనివాసరెడ్డి ముందు విచారణకు వచ్చింది. అయితే, ఈ వ్యాజ్యం విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. ఈ వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచి, ఆయన ఆదేశాల మేరకు మరో న్యాయమూర్తి వద్దకు వచ్చేలా చూడాలని రిజిస్ట్రీని ఆదేశించారు. గురువారం విచారణకు వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. ఏపీఎస్‌బీసీఎల్‌ కార్యాలయం నుంచి ఆ సంస్థకు చెందిన ఫైళ్లు, కంప్యూటర్‌ పరికరాలు, ఇతర కీలక పత్రాలను వాసుదేవరెడ్డి కారులో తరలిస్తుండగా చూశానంటూ కంచికచర్లకు చెందిన గద్దె శివకృష్ణ సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద వాసుదేవరెడ్డిపై సీఐడీ అధికారులు ఈ నెల 6న కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సోదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసును కొట్టేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా.. విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు న్యాయమూర్తి జస్టిస్‌ శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ సమయంలో వాసుదేవరెడ్డి తరఫు న్యాయవాది ఎస్‌.నగేష్‌ రెడ్డి స్పందిస్తూ.. ఈ వ్యాజ్యం తిరిగి విచారణకు వచ్చేంత వరకు పిటిషనర్‌కు రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. తాను విచారణ నుంచి తప్పుకున్న తరువాత మధ్యంతర ఉత్తర్వులు ఎలా జారీ చేయగలనని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఈ వ్యాజ్యం తిరిగి విచారణకు వచ్చేందుకు వారంపైన సమయం పడుతుందని, అందుకే రక్షణ కల్పించాలని కోరుతున్నామని నగేష్‌ రెడ్డి చెప్పారు. దీనిపై మీరేం అంటారని సీఐడీ న్యాయవాదిని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఎలాంటి రక్షణ కల్పించాల్సిన అవసరం లేదని సీఐడీ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు చెప్పారు. ఇప్పటికే ముందస్తు బెయిల్‌కు పిటిషన్‌ దాఖలు చేశారని, అది పెండింగ్‌లో ఉందన్నారు. ఇప్పుడు తిరిగి సీఆర్‌పీసీ సెక్షన్‌ 482 కింద క్వాష్‌ పిటిషన్‌ దాఖలు చేశారని వివరించారు. ఈ వ్యాజ్యం త్వరగా విచారణకు వచ్చేలా చూడాలని నగేష్‌ రెడ్డి కోర్టును కోరారు. దీంతో ఈ వ్యాజ్యాన్ని ఎల్లుండి విచారణకు వచ్చేలా చూడాలని న్యాయమూర్తి రిజిస్ట్రీని ఆదేశించారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

ఉప ముఖ్యమంత్రి పవన్‌ను కోరిన ఏపీ జేఏసీ అమరావతి

సాక్షి, అమరావతి: ఉద్యోగులకు గత ప్రభుత్వంలో జరిగిన నష్టాలను కూటమి ప్రభుత్వం ద్వారా భర్తీ చేయాలని ఏపీ జేఏసీ అమరావతి ఉప ముఖ్యమంత్రి పవన్‌ కళ్యాణ్‌ను కోరింది. జేఏసీ చైర్మన్‌ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్‌ దామోదరావు తదితరులు మంగళవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఐఆర్‌ ప్రకటించాలని కోరారు. 11వ పీఆర్సీ ద్వారా జరిగిన నష్టాన్ని 12వ పీఆర్సీ ద్వారా భర్తీ అవుతుందని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని ఆయనకు తెలిపారు. 2018 నుంచి చెల్లించాల్సిన డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రతి ఉద్యోగికి ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించేలా చూడాలని, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. ఎన్డీఏ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. కోవిడ్‌ సమయంలో మృతి చెందిన జెడ్పీ టీచర్ల కుటుంబ సభ్యులకు అవసరమైతే సూపర్‌ న్యూమరీ పోస్టు సృష్టించి కారుణ్య నియామకాలను తక్షణమే కల్పించాలని, ఈహెచ్‌ఎస్‌ ద్వారా ఉద్యోగులందరికీ నగదు రహిత చికిత్స అందించేలా చూడాలని కోరారు.

ప్రాణం తీసిన 'ఫైనాన్స్‌'

- ప్రైవేట్‌ సంస్థల వేధింపులతో విజయవాడలో మహిళ ఆత్మహత్య
- ఏజెంట్లు తరచూ ఇంటికొచ్చి బెదిరించడంతోమనస్తాపంతో వారి ముందే ఉరేసుకున్న బాధితురాలు



మస్తానమ్మ ఇంటి వద్ద ఫైనాన్స్‌ కంపెనీ ఏజెంట్లను నిలదీస్తున్న స్థానిక మహిళలు



అల్లంపల్లి మస్తానమ్మ (ఫైల్‌)

అజిత్‌సింగ్‌నగర్‌ (విజయవాడ సెంట్రల్‌): ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ప్రైవేట్‌ ఫైనాన్స్‌ సంస్థ నుంచి తీసుకున్న రుణం ఓ మహిళ పాలిట మృత్యుపాశమైంది. అధిక వడ్డీలు చెల్లించలేక, ఫైనాన్స్‌ ఏజెంట్ల వేధింపులు భరించలేక తనువు చాలించింది. మంగళవారం విజయవాడలో ఈ విషాదం చోటు చేసుకుంది. విజయవాడ వాంబే కాలనీకి చెందిన అల్లంపల్లి మస్తానమ్మ అలియాస్‌ మాధవి (44) పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. భర్త లక్ష్మీనారాయణతో విభేదాలు తలెత్తడంతో పదేళ్ల క్రితం విడిపోయి వేరుగా ఉంటోంది. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేసి అత్తగారిళ్లకు పంపింది. వ్యాపారంలో నష్టం రావడం, పిల్లల వివాహాల కోసం కొంత అప్పులు చేసింది. హైదరాబాద్‌కు చెందిన క్రిస్‌ ఫైనాన్స్, స్పందన అనే సంస్థల ప్రతినిధులు రుణాలు ఇస్తామని చెప్పడంతో వారి వద్ద డబ్బులు అప్పుగా తీసుకోవడంతో పాటు మరి కొంతమంది మహిళలను కూడా గ్రూపులుగా చేర్చి అప్పు ఇప్పించింది. రూ.42 వేలు అప్పు ఇస్తే ప్రతి నెల మొదటి బుధవారం రూ.3,370 చొప్పున 20 నెలల పాటు చెల్లించాలనే షరతుతో ఫైనాన్స్‌ సంస్థలు అప్పులు ఇచ్చాయి. కొద్ది నెలలుగా అనారోగ్యం, వ్యాపారం సరిగా నడవకపోవడంతో డబ్బులు చెల్లించేందుకు బయట అప్పులు చేసింది. గత బుధవారం డబ్బులు కట్టకపోవడంతో ఫైనాన్స్‌ సంస్థల ఏజెంట్లు ఆమె ఇంటి వద్దకు వచ్చి బెదిరించినట్లు సమాచారం. తాజాగా మంగళవారం మరోసారి వచ్చి భయభ్రాంతులకు గురి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మస్తానమ్మ వారి ముందే ఇంట్లోకి వెళ్లి తలుపులు మూసి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై నున్న రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహ సారథిగా సేవలు..

మస్తానమ్మ దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డికి వీరాభిమాని. 60వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ గృహ సారథిగా మస్తానమ్మ సేవలందించారు. ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలియడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు ఆమె ఇంటి వద్దకు చేరుకుని సంతాపం తెలిపారు.

దేశంలో రెండో అతిపెద్ద జపనీస్‌ ఇండస్ట్రియల్‌ టౌన్‌షిప్‌ శ్రీసిటీ

- శ్రీసిటీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రవీంద్ర సన్నారెడ్డి
- జపాన్‌ కాన్సుల్‌ జనరల్‌ తకాహషి మునియో శ్రీసిటీ సందర్శన



తకాహషి మునియోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ (సత్యవేడు (తిరుపతి జిల్లా): దేశంలో రెండో అతిపెద్ద జపనీస్‌ ఇండస్ట్రియల్‌ టౌన్‌షిప్‌ శ్రీసిటీ అని శ్రీసిటీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. ఆటోమొబైల్, ఇంజినీరింగ్, లాజిస్టిక్‌ వంటి వివిధ రంగాల ఖ్యాతి గడించిన 30కు పైగా జపనీస్‌ పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయని వివరించారు. చెన్నైలోని జపాన్‌ కాన్సుల్‌ జనరల్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన తకాహషి మునియో మంగళవారం శ్రీసిటీని సందర్శించారు. రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి.. పెట్టుబడుల అవకాశాలు, వ్యాపార ప్రయోజనాలను వివరించారు. ఈ పరిశ్రమలన్నింటిలో కలిపి రూ.16,000 కోట్ల పెట్టుబడులు, సుమారు 20 వేల మందికి ఉపాధి అవకాశాలొచ్చాయన్నారు. జపాన్‌ దేశ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఒక ఎన్‌క్లేవ్‌ అభివృద్ధి చేశామన్నారు. శ్రీసిటీలో మౌలిక వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కాన్సుల్‌ జనరల్‌ తకాహషి మునియో వ్యాపార నిర్వహణకు అత్యంత అనువైన పారిశ్రామిక వాడల్లో శ్రీసిటీ ఒకటని ప్రశంసించారు. శ్రీసిటీ పరిసరాలతో పాటు ప్రముఖ జపనీస్‌ పరిశ్రమలు ఇసుజు, డైకిన్‌ ఇండియాను ఆయన సందర్శించారు. ఇసుజు పరిశ్రమ ఆవరణలో శ్రీసిటీ జపనీస్‌ ఇండస్ట్రీస్‌ అసోయియేషన్‌ సభ్యులతో సమావేశమై చర్చించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణుల దాడి

- ఐదుగురికి గాయాలు
- నంద్యాల జిల్లా పీరుసాహెబ్‌పేటలో ఘటన





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు, రవణమ్మ, శివకుమార్‌

మిడుతూరు: అధికారమే అండగా టీడీపీ శ్రేణులు బరితెగిస్తున్నాయి. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం పీరుసాహెబ్‌పేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఆంజనేయులు, శివకుమార్‌ నాగలూటి గ్రామ పరిధిలోని నాపరాతి గనుల్లో పనులు ముగించుకొని పీరుసాహెబ్‌పేటకు బయలుదేరారు. అయితే మిడుతూరు వ్యవసాయ కార్యాలయం సమీపంలో టీడీపీ వర్గీయులు బైక్‌ను అడ్డగించి ఆంజనేయులు, శివకుమార్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని బాధితులు తమ కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వెంకటేశ్వర్లు, రవణమ్మ, లక్ష్మీ నరసమ్మ గ్రామం నుంచి మిడుతూరుకు బయలుదేరారు. దారిలో పీరుసాహెబ్‌పేట గ్రామ టీడీపీ నాయకుడు రామేశ్వరరెడ్డి పొలం వద్ద ఆయన వర్గీయులు.. వెంకటేశ్వర్లు, రవణమ్మ, లక్ష్మీ నరసమ్మలపై దాడికి పాల్పడ్డారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చికిత్స నిమిత్తం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఘర్షణ జరుగుతున్న విషయం తెలుసుకొని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత చంద్రశేఖర్‌ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకోగా తమ పొలం వద్దకు వచ్చి దాడికి పాల్పడి, దుర్భాషలాడారని ఆయనపైనా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఆర్డీఏలో ఆస్ట్రేలియా కాన్సులేట్‌ బృందం



ఆస్ట్రేలియా కాన్సులేట్‌ అధికారులతో మాట్లాడుతున్న సీఆర్డీఏ కమిషనర్‌ భాస్కర్‌

సాక్షి, అమరావతి: ఆస్ట్రేలియా కాన్సులేట్‌ జనరల్‌ సిలైజాకీ నేతృత్వంలోని అధికారుల బృందం మంగళవారం ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌ కాటమనేని భాస్కర్‌తో భేటీ అయ్యింది. విజయవాడలోని సంస్థ కార్యాలయానికి వచ్చిన ఆస్ట్రేలియా కాన్సులేట్‌ అధికారులు కమిషనర్‌తో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా అమరావతిలో వాణిజ్య అవకాశాలపై సిల్లై చర్చించారు. ఈ ప్రాంతం భౌగోళిక స్వరూపం ప్రాధాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ భాస్కర్‌ మాట్లాడుతూ.. వ్యాపార, వాణిజ్య రంగాలకు అమరావతి నగరంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు కాన్సులేట్‌ అధికారులు సుముఖత వ్యక్తం చేసినట్టు కమిషనర్‌ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.